

ఆంధ్రసచిత్రవారపత్రిక

2-11-60 25 నయాపైసలు

ANDHRA SACHITRA VARA PATRIKA


అక్టోబర్ 28 నుండి
జింబో చిత్రంతో మెప్పించిన
చిత్ర, అజాద్, పెడ్రో (కోతి)
నటించిన
హోమీవాడియా సమర్పించు
జింబో నగరప్రవేశం
(గేవా కలరు సీనులతో)
(తెలుగు)
మాటలు, పాటలు శ్రీ శ్రీ + సంగీతం విజయభాస్కర్
STUDIO Kelkar
వాడియా బ్రదర్స్ నిర్మాణం
పూర్ణా రిలీజ్
FLOOD LIGHT

ఉత్తరాలు

కథ కాని కథ

10-8-1960 తేదినాటి ఆంధ్రపత్రిక యందలి "కథ కాని కథ" శీర్షిక క్రింద ప్రథమ బహుమతి పొందిన "కాఫీ ఒకటీ" అన్న కథను "కె. రాఘవ" అనే వారు జరిగిన సంఘటన వ్రాయలేదు.

ఇది "చిత్రగుప్త" (15-6-1956 తేది) లోని "కార్డు కథలు" శీర్షిక క్రింద "చెలిమిని కలిపిన కాఫీ ఒకటీ" అన్న కథ శ్రీ కె. పి. ఎల్లనగారిచే వ్రాయబడియుండెను. ఈ కథనే కాపీకొట్టి (ఏదో! అక్కడక్కడ కొంచెము మార్పుచేసి) "కె. రాఘవ" అనే వారు ప్రథమ బహుమతి పొందినారు. ఇది శోచనీయమైన విషయము.

ఎస్. మోహన్‌రావు (హైదరాబాద్)

* * *

దీపావళి సంచిక

మీ (మా) వారపత్రిక దీపావళి ప్రత్యేక సంచికలో నిర్వహించిన కథల పోటీ ఫలితాలు సంతృప్తికరంగా లేవని అనడానికి చాల విచారిస్తున్నాను. మొదటి బహుమతి పొందిన కథ "ప్రేమకు కత్తిపోట్లు" చాల పేలవంగావుంది. ఇతి వృత్తం సర్వసామాన్యమైనది. అదెట్లావున్నా రచయిత ఉపయోగించిన శైలి చాల మోటుగాను, అసభ్యంగాను ఉన్నదనిపించింది. ఈ కథ ఆంధ్ర పత్రికకన్నా వేరే పత్రికలకైతే రాణించేదేమో! ఇంతకంటే ద్వితీయ బహుమతి పొందిన "వెన్నెలనీడ" బాగుందని చెప్పవచ్చు. ఏమైనా దీపావళి ప్రత్యేక సంచిక ఆశించినంత అందంగా ముస్తాబైరాలేదు. (ముఖ్యంగా కథలపోటీ) సినీతారల ముఖ చిత్రాలతో విసుగెత్తిన మాకు దీపావళి సంచిక ముఖచిత్రం నేత్రానందమైనది. అందు కనుగుణంగా ప్రచురించిన కథ కూడా చాల బాగుంది.

మొత్తం మీద ఆంధ్రపత్రిక అన్నిరంగాలలోను పోటీలు నిర్వహించి పాఠకుల నుత్సాహపరుస్తున్నందుకు కృతజ్ఞులం.

జి. రమణమ్మ (జెంషెడ్‌పూర్)

* * *

దీపావళి కథలపోటీ, బహుమతుల నిర్ణయము ఏమీ న్యాయముగ లేదు. కథా సంవిధానమునుబట్టి శ్రీ భమిడిపాటి గోపాలం (గుంటూరు) రచించిన కథ "వెన్నెలనీడ" మొదటి బహుమానమునకు తగినది. వారికి నా అభినందనములు.

బల్లంకి సుబ్బారావు (బొంబాయి)

* * *

ఆంధ్రపత్రిక దీపావళిసంచిక వొస్తుందంటే; 'హాబ్బో, యిక బ్రహ్మాండం బ్రద్దలైపోతుం'దను కొన్నాను. కాని అదేం జరగలేదు సరిగదా, ఇంత పేలవంగా తయారౌతుందనికూడా ఊహించలేదు. అంజిరెడ్డిగారి కథను ప్రథమ బహుమతి పొందినదిగా నిర్ణయించడంతో-సాహిత్యరంగంలో బుద్ధిమంతులు సైతం ఈర్ష్యాళువులై ఉన్నారన్న మా అభిప్రాయం మరోసారి రుజువైంది! చిన్నకథకున్న 'లక్షణాల' దృష్ట్యా చూస్తే; గంగులు చనిపోయిన కారణం నాయకునికి తెలియడంతోనే చిన్న కథయొక్క లక్ష్యం నెరవేరిపోయింది. ఆతరువాత కథ అనవసరం. ఓ హెన్రీకథలూ యిహ సరేసరి. ఏమైనా ఒకటిమాత్రం నిజం; పాఠకుల్లో చౌకబారు అభిరుచుల్ని రెచ్చగొట్టడంలో పత్రిక 'జాణతనం' నానాటికి పెరుగుతూనే ఉంది. ఏమైనా "భోగాలము దాపురించినవారు మిత్రవాక్యమును అరుంధతిని, దీపగంధ నిర్వాణమును వినరు కనరు మూర్కొనరు" అన్నది ఎంత నిజం!

నిమ్మగడ్డ భానుమూర్తి (తెనాలి)

* * *

19-10-60 వ తేది ఆంధ్ర సచిత్రవార పత్రిక (దీపావళి) సంచిక సర్వాంగసుందరంగా ప్రముఖుల వ్యాసములతోను, చక్కని కథలతోను వెలువరించినందుకు మీకు మా ధన్యవాదాలు.

కె. పూర్ణచంద్రరావు (వేటపాలెము)

* * *

మిమ్ముల నెలా అభినందించాలో తెలియడంలేదు. మీ దీపావళి సంచికతో, 'ఆంధ్రపత్రిక'కు సాటివారపత్రిక లేదని నిరపడింది. బహుమతులుపొందిన, "ప్రేమకు కత్తిపోట్లు," "వెన్నెలనీడ," కన్సోలేషన్ బహుమతిపొందిన "చలమయ్య సంసారము," అద్భుతముగా ఉన్నవి. ఆయా రచయితలకు మా అభినందనలు తెలుపండి. 'యమ్. జి. యమ్.' వారి సౌజన్యాన, మీ పత్రికలో తెలిగించబడిన, "బెన్-హార్" గాథ హృదయంగమంగా ఉంది. రచయిత "తూలికా భూషణ్"కు మా హృదయపూర్వక అభినందనలు తెల్పండి. ఇకముందుకూడ పత్రిక ఇలాగే ఉండగలదని ఆశిస్తూ.

సి. పార్వతి (విజయవాడ)

* * *

దీపావళి ముఖచిత్రం

అయ్యా! మీరు ప్రతిసంచికలోను ప్రకటించిన ముఖచిత్రము లన్నిటికంటే దీపావళి సంచికలో ప్రకటించిన ముఖచిత్రమూ, దానికి సంబంధించి వ్రాసిన కథ నన్ను ఆనందింపజేసాయి. యికముందు ప్రతీ ముఖచిత్రమునుగూర్చికూడా, ఆ చిత్రానికి సంబంధించినకథ, కొత్తయిన ప్రకటిస్తే మాకు చాలాఆనందముగా ఉంటుంది. క్రొత్తగా పెండ్లయినవాగ ఈ చిత్రాన్ని చూచి సిగ్గుపడుతున్నారు. కారణమేమిటి? వారిమనసులోని తియ్యటిభయమే.

కాశేవెంకట్రాజు (కొత్తూపులపల్లి)

* * *

మనమూ-మన దేహస్థితి

"మనమూ, మనదేహస్థితీ" ఈ క్రొత్తశీర్షికను ప్రవేశపెట్టుదురని చదివి మిక్కిలి సంతోషపడ్డాను. ఇటువంటి శీర్షికలు యేర్పరచి పాఠకులకు ఉత్సాహంకల్గించి-రచయితలకు ఆశ్రయమిస్తూ, పారితోషికము లందిస్తున్న మీ పత్రిక కృషి కొనియాడదగినది. ఎల్లప్పుడూ ఆం, స, వా, ప, ఆయురారోగ్యంగా ఉండాలని యేడుకొండలవాడిని ప్రార్థిస్తూ మా అందరి శుభకాంక్షలర్పిస్తున్నాను.

భాగ్య కెంచవీర్ సాహు (ఆదోని)

* * *

'మనమూ, మనదేహస్థితి' మా పాఠకలోకానికి సరిక్రొత్త విజ్ఞానదీపిక. ఈ క్రొత్త శీర్షిక తలపెట్టిన సంపాదకునికి మా హృదయపూర్వకమైన ధన్యవాదములు. బహుళ ప్రచారంలోఉన్న ఇటువంటి పత్రికలకు ఇదొక నూతనాకర్షణయేకాకమహత్తరప్రజాసేవగా భావించబడుతు---. ఈ సందర్భంలో డాక్టర్ గాలి బాలసుందరరావుగారికి మా ప్రత్యేకాభివందనములు. ఈ శీర్షికతోపాటే పాఠకుల ప్రశ్నలకు (ఆరోగ్యసంబంధమైన) జవాబులు అనే ఇంకోప్రత్యేక శీర్షిక నిర్వహిస్తే ఎంతో బాగుంటుందనుకుంటాము.

కె. మల్లికాధూర్జటి (ఖమ్మం)

* * *

దివాలీ- సినీవాలి

మన 'పోరంగి - రేలంగి గారి దివాలీ సినీవాలి మొదటినుండి చివరదాకా - టిటపటాయించి ఓపిగ్గా ఒక్కొక్కరి ముందు చమత్కారంగా సంభాషిస్తున్నట్లుంటే మాకు చక్కిలిగింతలు పెట్టినట్లు నవ్వొగింది కాదు. ఇక 'బి, ఏ',లతో సంభాషణ ప్రతి ఒక్కరినీ తన్మయానందంలోకి దించగలదు.

సి. దీనదయాళ చౌదరి (పాకాల)

* * *

దీపావళి సంచికలో దేవికా (ప్రమీల) రేలంగిగారు, గిరిజాగారు వ్రాసిన వారి అనుభవ దీపావళీ రచనలు చాలా బాగుగా ఉన్నాయి. వారికి నా అభినంద నలు అందజేస్తూ, ఇలానే సంక్రాంతికి కూడా, తక్కిన నటులు (పెండ్లి అయిన వారు) తమయొక్క అత్త (అమ్మ) గారిండ్ల అనుభవములతో రచనలువ్రాసి, ఈ దీపావళి సంచికవలే, సంక్రాంతి సంచిక కూడా

ఉత్సాహంతో చదువుటకు తోడ్పడుతాగని ఆశిస్తున్నాను.

ద్వారపూడి కృష్ణారావు (వాల్తేరు)

*   *   *

"19-10-1960 న వెలువడిన ఆంధ్రపత్రికలో రేలంగివారు వ్రాసిన "దివాలీ సినీవాలీ" చాలా బాగుంది. చలన చిత్రసీమలో ప్రఖ్యాత హాస్యనటుడుగా పేరు పొందిన రేలంగి వ్యాసం చదువుతున్నంత సేపూ ఆయన ఎదురుగుండా నుంచుని హాస్యాన్ని చిలికిస్తున్నట్లుగానే యుంది. ఆయనకు నా ధన్యవాదాలు."

శిష్టా భాస్కరరావు (హైదరాబాదు)

*   *   *

పాలేరు పంట—పాలారు మంట

ఈ శీర్షిక మొత్తంపై బాగానే ఉన్నది. అందులో ప్రవేశపెట్టిన "రత్నం, పాప" చివరకి ఏ స్థితికి వచ్చినదిగూడ వ్రాసినచో చదువరులకు మిక్కిలి ఆనందము కలెడిది. ఈనాటి ప్రపంచములో 'రత్నం'లాంటి కోడలు ఉండరనే తలుస్తాను. చండికవంటి చేతలతో ఉన్న అత్తలు ఉన్నమాట్కె, కోడళ్లుగూడ వారిని మించి ప్రవర్తిస్తున్న ఈ రోజులలో 'రత్నం'లాంటి అమాయకురాలిని ప్రవేశపెట్టి ఈ శీర్షిక పూర్తిచేయడములో రచయిత ఉద్దేశ్యము నాకవగాహన అవలేదు.

నార్కెడిమిల్లి నాగేశ్వరరావు (కాకినాడ)

*   *   *

శ్రీమతి-శ్రీవారు

ఈవారం (26-10-60) పత్రికలో ప్రచురించిన "శ్రీవారు-శ్రీమతీ" కథ నన్నెంతో ఆకర్షించింది. "చిన్నారి పాప" (కవితా కింకిణి) చాలబాగున్నవి. "నిదురపోయే సెలయేరు" నా హృదయాన్నెంతో కలచివేసింది. 'ఇంకావుంది' అని చదివేసరికి చాలబాధవేసింది. కథంతా పత్రికనిండా వేస్తే బాగుండుననిపించింది.

ఎన్. ఎస్. సంధ్యావళి (మద్రాసు)

*   *   *

ఉషాకన్య

ఇక బాలలకోసం ప్రత్యేకించిన ఉషాకన్య కథాసంవిధానం బాగున్నమాట వాస్తవమే కాని దానికై ప్రత్యేకించిన బొమ్మలు దేశీయ, జానపద కథాసంప్రదాయానుసారం లేవు. ఇంగ్లీషువాళ్ల ననుసరించినట్లుంది.

జి. వి. రత్నం (జగన్నాథపురం)

*   *   *

ఆంధ్ర సచిత్ర వారపత్రికలో ప్రచురించుచున్న 'ఉషాకన్య కథ' చాలాబాగున్నది. ఇది వ్రాసిన శ్రీ బెజవాడ సదానందంగారికి మా అభివందనములు.

జె. ఎస్. వి. కరుణాదేవి (రాజమండ్రి)

*   *   *

"ఉషాకన్య కథ" సీరియల్ చాలబాగుంది. ప్రత్యేకంగా క్రితము వారపత్రికలో భాగం మరీ బాగుందనుటలో సందేహ మేమాత్రము లేదు. రచయిత సదానందంగారు ఉషాకన్య పదహారేండ్లు ఎదగటం పదునారువాక్యాల్లో ముచ్చటగా, ముద్దుగా వర్ణించారు. అపదునాగు వాక్యాలు మరీమరీ చదవాలనిపిస్తుంది. మొత్తముకథ చదువుచున్నంతసేపు ముచ్చటైన పచ్చడాలు పీగుతున్నట్లుంటుంది. రచయిత సదానందంగార్కి మీపత్రిక ద్వారా నా హృదయపూర్వక అభినందనలు అందజేయుచున్నాను.

పి. పి. నరసింహులు (గుంతకల్లు)

*   *   *

చదరంగం

దీపావళి సంచికలో ప్రచురించిన చదరంగమునందు, భారతీయ పద్ధతికిని, విదేశీయ పద్ధతిలోను "కాయలు" నడుచుటలో తేడా తెలుపలేదు. భారతీయ పద్ధతిలో "బంటు" ఒక్క గడిముందుకి నడుచునుగానీ మీరు ఇచ్చిన పద్ధతి (8)బ-మ 4 అని ఇచ్చినారు. దీనినిబట్టి "బంటు" 2 గడులు ముందుకు నడిచినది. అందుచే పైవి దేశీయ పద్ధతికిని, భారతీయ పద్ధతికిని "కాయలు" నడుచు పద్ధతులు ఏమైనా మార్పు ఉన్నయెడల తెలుపగోరుచున్నాను.

ఎం. ప్రభాకరరావు (వాడి)

*   *   *

"చదరంగం"కోసం "పత్రిక" ఎప్పుడు వస్తుందా అని ఆసక్తితో ఎదురుచూస్తూ కూర్చునే నాకు అప్పుడప్పుడు ఆశాభంగం కలుగుతోంది. యిక ముందిటువంటి ఆశాభంగం కలుగకుండా చేయుటకు ప్రయత్నిస్తారని ఆశిస్తున్నా.

5-10-1960 పత్రికలో శ్రీ వి. విశ్వనాథశాస్త్రిగారు 9 వ ఎత్తులోనే శకటుని పోగొట్టకుని కూడా నైపుణ్యంగా ఆడి ప్రముఖ మద్రాసు ఆటగానిపై గెలుపు సంపాదించినందుకు శాస్త్రిగారిని చాలా అభినందిస్తున్నా. చదరంగం ఆటనుగురించి తెలుసుకోవాలన్నా నైపుణ్యం సంపాదించాలన్నా మార్గాలేవో ఉపకరించే పుస్తకాలేవో మీ పత్రికాముఖంగా తెలియజేయవలసిందిగా శ్రీ వి. విశ్వనాథశాస్త్రిగారిని కోరుతున్నా.

పి. వి. సీతారామమూర్తి (నీలాద్రిపురం)

*   *   *

మా అభిమాన ఆంధ్రపత్రికకు చదరంగం శీర్షిక మకుటాయమానం, 'నోటింగు' చాలా బాగుంది. మీకు, శ్రీ శాస్త్రిగారికి నా ధన్యవాదాలు. ఈ క్రింది సందేహాలకు శ్రీ శాస్త్రి గారిచేత సమాధానాలు యిప్పిస్తారని ఆశిస్తాను.

1. ఆట మొదలు పెట్టినప్పుడు ఒకేసారి మూడు ఎత్తులు వేయవచ్చునా? 2 బంటును బంటు చంపకుండా ముందుకు జరుగవచ్చునా? 3 ఆట అయ్యేలోగా 'కాజ్లింగు' యెప్పుడైనా చేయవచ్చునా? 4. షా అనగా చెక్ అనియేనా?

5-10-60 తేది ఆంధ్రపత్రికలోని ఆటలో 9 వ ఎత్తు అర్థమగుటలేదు. దానిని విపులీకరిస్తారని కోరుచున్నాను. ఇటీవల శ్రీ అరన్ గారు 'మమూతో ఆడిన ఆటలు ప్రచురిస్తూ, సిసిలియన్ డిఫెన్సు మొదలయిన ఆటలోని మర్మములన్నియు వివరించగలందులకు ప్రార్థిస్తున్నాను.

చల్లా సత్యనారాయణప్రసాద్ (కర్నూలు)

*   *   *

పత్రిక ముద్రణ

మీ సచిత్ర వారపత్రిక జనబాహుళ్యము నందుకొనిన దనియు సర్కులేషను చాలా బాగున్నదనియు మీరు ఒప్పుకొనక తప్పదు. అయినప్పుడు మీరు టైపులను పాత అచ్చు బిళ్ళలను ఎందుకు మార్చకూడదు. ముద్దులు

ఉత్తరాలు

ముద్దలుగా పడుచున్న సిగారెట్టీలు కొంగజైన్ మేకప్పుడు లోటని తెలిసియుండియు పోటి పత్రికలను చూచైనా కొత్తతనము, పాత పైపును త్వరలో మార్చుటకు ఏర్పాట్లు చేయుదురని మీ చదువర్లందరి తరఫున మనవి చేయుచున్నాను.

ఇ. ఎల్. నాయుడు (కలిదిండి).

* * *

న్యూఢిల్లీ లేఖ

ఆంధ్రపత్రిక దీపావళి సంచికలో శ్రీకృష్ణ గారి న్యూఢిల్లీ లేఖ చదివాను. కొన్ని విషయాలను ఎంత సహేతుకంగా, సముంజసంగా, సూటిగా విమర్శిస్తారో మరికొన్ని విషయాలను అంత అసహనంతో, జుగుప్సతో ఇది వరకే కరడు కట్టుకొనివున్న కొన్ని భావాలతో పేలవంగా విమర్శిస్తారేమోననిపించింది. ప్రాంతీయ భాషను కాదనక హిందీకే అధిక ప్రాముఖ్యత ఇవ్వాలనే కొందరు గురభిమానులు దేశంలో వుండవచ్చు. విభిన్న అభిప్రాయములను కలిగి వివిధ దృక్పథాలతో వ్యవహరించే వ్యక్తులు ప్రజాస్వామ్య వ్యవస్థలో కన్పించడం సాధారణం, అత్యంత సహజంకూడా. అంతమాత్రంచేత ఒక విషయాన్నిగూర్చి—అందులో అత్యంత ప్రాధాన్యత కలిగిన రాష్ట్రభాషనుగూర్చి ఓర్మిలేక తూలనాడటం అత్యంత శోచనీయం. మన దేశంలో "ఇంగ్లీషుభాషను ధ్వంసం చేయడానికి ఇదివరకే అనేకమైన ప్రయత్నాలు జరిగాయి.. నిజానికి రాష్ట్రపతి హిందీ భాషా వర్గంవారి అగ్రనాయకుడు." ఇలాంటి విచక్షణారహితమైనవిమర్శలు ఆంధ్రులఅభిమాన పత్రిక 'ఆంధ్ర సచిత్ర వారపత్రిక' ముఖాన వెలువడటం అత్యంత శోచనీయం.

పి. గోపిరెడ్డి (వరంగల్).

* * *

కార్టూనులు

"ఆంధ్ర సచిత్ర వారపత్రిక" దిన దినాభివృద్ధిగాంచి పలువురి ప్రశంసల నందుకోవాలనుకునేవారిలో మేమొకరం "ఉమెన్" కార్టూన్ చాలా బాగుంటోంది. కథలు కూడా చాల చక్కటివి ప్రచురిస్తున్నందుకు మా అభినందనలు. 12-10-60 తేది పత్రికలో పలువురు పత్రిక ఖరీదు 50 న. పైలకు పెంచితే బాగుండునున్నట్లు సూచించారు. కాని అట్లుచేస్తే మధ్య తరగతివారు కొనటం కష్టము. అందువలన దయచేసి అట్లు చేయరని నమ్ముచున్నాము.

రామ అప్పారావుమూర్తి (శ్రీకాకుళం)

* * *

"ఎవరు దుబారా?"

శ్రీమతి సి. వి. విజయలక్ష్మిగారు వ్రాసిన "మగవారి దుబారా" అన్నవ్యాసం నేను చదవటం తటస్థించింది.

ఆ వ్యాసం చాలాబాగుంది. మగవారి దుబారా ఖర్చులు ఉన్నవిఉన్నట్లు పైకిలాగి మగవారికి బుద్ధి వచ్చేటట్లు మా బాగా వ్రాసేరు" అని చాలామంది మెచ్చుకుంటారని, అలా మెచ్చుకోవాలనీ, వారికి కోరిక కలిగి విజయలక్ష్మిగారు వ్రాసినట్లు నాకు తోచింది.

నిజానికి మగాళ్లే దుబారా చెయ్యడం మొదలెడితే ఆడవాళ్లు ఒక్కనాటికికూడా సంసారం చెయ్యలేరు. అసలు విజయలక్ష్మి గారు వ్రాసిన మగాళ్ళ దుబారాఖర్చుల జాబితాలోఉన్న అయిటమ్సు నిజానికిచాలా తక్కువ. చెయ్యాలంటే అంతకన్న పెద్ద దుబారాలు చెయ్యగల సమర్థులు మగవారు. కాని ఆడవారి శ్రేయస్సుకోరి కొందరు, వారినోటికి జడిసి కొందరు, వారికున్న ఏకొద్ది దుబారాలనైనా మానుకొంటున్నారు. నా

'ఆంధ్రసచిత్రవారపత్రిక' నిర్వహిస్తున్న పోటీలు

'కథకానికథ', 'కార్టూన్‌పోటీ', 'గళ్ళ నుడికట్టు ఆధారాలపోటీ', 'కవితాకింకిణి' మున్నగు పోటీలలో పాల్గొనేవారు ఈ దిగువ పేర్కొన్న అంశాలుగమనించాలని కోరుతున్నాము.

ఆయా పోటీలలో పాల్గొనడానికి ప్రత్యేకమైన నిబంధనలు ఏమీలేవు. ప్రవేశరుసుము లేదు. ఎవరు అయినా పాల్గొనవచ్చు. పోస్టుకార్డులమీద వ్రాసి పంపినా, 'ఇన్‌లాండ్ లెటర్'లలోను, కవర్లలోను పంపినా ఏపోటీకి సంబంధించినది స్పష్టంగా వాటిమీద వ్రాయవలసి ఉన్నది. ఆవిధంగా వ్రాసి పంపని వాటిని పరిశీలించడం జరుగదు. అన్ని పోటీలకు కలిపి ఒకే కార్డుమీదగాని, ఇన్‌లాండ్ లెటర్‌లోగాని, కవరులో కాని పంపినా వాటిని పరిశీలించడం జరుగదు.

ఆయా పోటీలకు పంపినవాటిని తిప్పిపంపడం జరుగదు. కనుక స్టాంపులుకాని, స్టాంపులు అతికించిన చిరునామాలుకల కవర్లుకాని జతచేసి పంపరాదు.

కార్టూన్‌లు ఏకాగితంమీద అయినా వేయవచ్చు. కాని 'ఇండియన్ ఇంక్'తో వేయవలసి ఉన్నది.

ఏసందర్భంలోను ఆయాపోటీలలో పాల్గొనేవారితో ఉత్తరప్రత్యుత్తరాలు జరపడం సంభవంకాదు.

—సంపాదకుడు

ముట్టుకు నాకు—టిన్నులు టిన్నులు సిగరెట్లు తగలేసేఅలవాటు ఏడాదిక్రిందటివరకూ ఉండేది. మళ్ళీ అగ్గిపుల్ల వెలిగించకుండా నే చెయిన్ స్మోకింగు అలవడాది. కాని నా శ్రీమతి కోరికమీదనైతేనేం, నా ఆరోగ్య దృష్ట్యానైతేనేం, ఆమెమనస్సు నొప్పించడం ఇష్టంలేకనైతేనేమి సిగరెట్లు అలవాటు మానేసాను. మళ్ళీ మొదలుపెట్టడం అసంభవం. ఇంతకీ నేను చెప్పొచ్చే దేమిటంటే, దుబారా ఖర్చులు మానుకోవాలన్నా, వాటిని తగ్గించుకోవాలన్నా, మగవారికున్న నిగ్రహం, పట్టుదల, ఆడవారిలో లేదని ఘంటాపధంగా చెప్పగలను.

—పా. చలపతిరావు (విశాఖపట్నం)

* * *

శ్రీమతి విజయలక్ష్మి వ్రాసిన వ్యాసాన్ని విమర్శిస్తూ శ్రీ రాజశేఖర్ గారు స్త్రీలదే దుబారా అని అందులో వేసిన బొమ్మను బట్టే ఆ నిర్ణయానికి వచ్చారేమో. ఆబొమ్మ వేసిన చిత్రకారుడు కూడ జాత్యభిమాన మే చూపించారు. ఇంతకూ బొమ్మలో వేసినట్లుగానే అన్నిరకాల టాయిలెట్లు మగవారు తమ స్త్రీలకు సప్లయిచేస్తూవున్నారా నిజంగా! ఇంటిలో తెలియకుండా హోటల్లలో స్నాక్సులు, సినిమా షికార్లు యిటువంటి వాటిలో డబ్బు దుబారా చేసే అవకాశము మగవారికే వుంది. కాని వంటింట్లో కాచుకొని కూర్చున్న ఆడవారు చేయరు. కాబట్టి దుబారా చేసేది మగవారే.

శ్రీమతి సి. వి. విజయలక్ష్మి అక్కయ్య గారూ మీరు రాసిన ఎవరు దుబారా వ్యాసం చాలా బాగుంది మగవారి నటన మనని విడిపించడం చక్కగ వర్ణించారు.

వి. రాజ్యలక్ష్మి (పాలకొల్లు)

* * *

5-10 60 తేదీ పత్రికలో సి. వి. విజయలక్ష్మిగారు వ్రాసిన "మీరే చెప్పండి?" అను వ్యాసంపై తమ అభిప్రాయం వ్యక్తంచేస్తూ రాజశేఖరంగారు "స్త్రీలదే దుబారా" అని చాలా తేలిగ్గా అనేశారు. పైగా వారు, "మీ ముందు ఆరు టాయిలెట్‌సామాన్లు ఉంటే, మీ వారి నోట్లో 5 సిగరెట్లే ఉన్నాయి అని రుజువుచేశారు, పాపం రాజశేఖర్ గారు విజయలక్ష్మిగారి శ్రీవారి చేతిలో సిగరెట్ టిన్ చూడలేదు. కాబోలు. వారి అభిప్రాయం చదువుతూంటే వారను కున్న నిష్పక్షపాతంకాక పక్షపాత బుద్ధే వ్యక్తమౌతూంది. అసలు దుబారామనుష్యులు ఒక్క స్త్రీలూ కాదు, ఒక్క పురుషులు కాదు. స్త్రీలలోను పొదుపరులున్నారు. న్యాయంగా ఆలోచిస్తే పురుషులే ఎక్కువ దుబారా పరులు. పరిస్థితులు కూడ స్త్రీలను తప్పనిసరిగా పొదుపరులను చేయుచున్నవి. కనుక విజయలక్ష్మిగారి వ్యాసాన్ని బట్టిగాక యితరత్రా ఆలోచించి శ్రీ రాజశేఖర్ గారు తమ అభిప్రాయాన్ని మార్చుకుంటారని ఆశిస్తా.

కుమారి సి. రత్నమాంబ (తాటిపాక) ★

ఆంధ్రసచిత్ర వారపత్రిక

★

Founder
K. Nageswara Rao

స్థాపితము
1908

★

సంపాదకుడు:
శివలెంక శంభుప్రసాద్

★

సంపుటము 55
సంచిక 59

2-11-60
బుధవారం

శార్వరి కార్తిక శుద్ధ చతుర్దశి

★

విడిప్రతి వెల 25 న. పై.
సంవత్సర చందా 13-0-0

★

ఆంధ్రపత్రిక కార్యాలయము
7, తంబుచెట్టివీధి,
మదరాసు-1.

విషయానుక్రమణిక

ముఖచిత్రం:

హంస సందేశం

—చిత్రకారుడు: కె. రాంబాబు.

కార్టూన్	— 6
తెలుగు వెలుగులు	— 7
వంకర బ్రతుకులు	— 8
మనమూ - మన దేహస్థితీ	— 14
ఎదురుచూసినది	— 16
కథ కానికథ	— 23
నిదురపోయే సెలయేరు	— 24
రాశిఫలాలు	— 30
శారద	— 32
వనితాలోకం	— 40
వనితావాణి	— 44
హరివంశము	— 45
ఉపాఖ్యానకథ	— 48
చల్లనితల్లి	— 50
సినిమా	— 55
చదరంగం	— 62
గళ్ళనుడికట్టు	— 63
పొట్టికథలు	— 64

న్యూఢిల్లీ లేఖ

కారణాంతరాలవల్ల న్యూఢిల్లీ లేఖను ఈ సంచికలో ప్రచురించలేకపోయాము. —సం]

దీపావళిసంచిక వనితాలోకం వ్యాసరచనపోటీ



*

సి. అన్నపూర్ణ
(రాజమండ్రి)
మొదటిబహుమతిపొందిన రచయిత్రి


*



*

ఐ. హేమలత
(అనంతపురం)
రెండవబహుమతిపొందిన రచయిత్రి

*


ఒక్క నిమిషం..ఆరోగ్యం, పరిశుభ్రత అంటే ఏమిటి?
ఆరోగ్యం, పరిశుభ్రత లను గూర్చి ఉపాధ్యాయులు స్వల్పకాలిక శిక్షణ పొందాలి... పి.వి.జి.రాజు
గూటిలో కోకిల
నూనె కోసం. రష్యాతో పాకిస్తాన్ ఒప్పందం
కథ గాని కథ
ముఖ్యమంత్రి వద్దకు రాయబారం వెళ్లాలని ఉపాధ్యాయుల నిర్ణయం



తెలుగు వెలుగులు 57

లేని అలంకారాలు తగిలించకుండా ఉన్న దాన్ని ఉన్నట్టుగా చిత్రించడం చిత్రకళకు నిదర్శనం-అని అన్నాడు ఒక పండితుడు. అలాగే నేను నాయకుడినని పోజు పెట్టని నాయకుడిది కూడా పెద్దపోజు. అది గడసరితనం.

అయితే ఈ సూత్రానికి భిన్నంగావుండే నాయకులుకూడా లేకపోలేదు. అలాంటి వారిలో శ్రీ వేముల కూర్మయ్యగారు ఒకరు.

మంత్రి అవతారంలో ఉన్నా, వట్టి కూర్మావతారంలోఉన్నా, ఆయనది ఒకే ఒక అవతారం; ఒకేఒక వేషం. ప్లీడరుపరీక్షు ప్యాసయినాడన్నమాటేగాని, అది ఏ కోశానా ఆయనలో కనపడదు. అచ్చంగా తూర్పుకృష్ణాజిల్లా గ్రామంలో ఊరి రంగు తేలినవాడుగా ఉంటారు.

కూర్మయ్యగారు రాజకీయాలలో ప్రవేశించకపోతే, ఏమిచేసేవారో చెప్పలేము. కాని, కాంగ్రెసులో తప్ప మరి ఏ పార్టీలోనూ ఇమడలేకపోయేవారు.

కారణం, ఈయన దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులుగారు స్థాపించిన శ్యామలా ధర్మపాఠశాలలో విద్యాభ్యాసం చేయడం. నాగేశ్వరరావుగారి మూలకంగా ఇతర కాంగ్రెసుపెద్దల సంపర్కం కలగడంవల్ల వారి ప్రభావం ఆయనపై ప్రసరించింది. అందుకనే కాంగ్రెసులోచేరి, స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్నారు. కాకపోతే ఏ షెడ్యూల్డ్ కాస్ట్ ఫెడరేషనులోనో చిక్కుకుని డాక్టర్ అంబేద్కర్ అనుచరుడుగానో, ఎం. సి. రాజాగానో తయారయ్యేవారు; పరప్రభుత్వంలో పదవులను అనేకం సంపాదించుకొనేవారు. అలాచేయక ఆద్యంతం కాంగ్రెస్ ఛత్రంకింద నిలబడినందుకు ఆయనను ఎంతైనా మెచ్చుకోవాలి.

కాంగ్రెస్ అంటే తమదే నన్నంత పూనికతో, అకుంఠిత నిష్ఠతో పనిచేశారు. ఈయనకు కాంగ్రెసు ఒక సంస్థకాదు, వ్యవస్థ. దాని నియమాలు సాధారణమైన తీర్మానాలు కావు, వేదవాక్యాలు.

ఈయన 1936 లో మొట్టమొదటిసారిగా సమష్టి మద్రాసురాష్ట్ర శాసనసభ సభ్యులుగా ఎన్నికై 1952 లో తూర్పు కోస్తా ఎన్నిక తుఫానులో కొట్టుకొనిపోయేవరకు సభ్యుడుగా ఉండడమేకాక 1946-47 లో ప్రచురణ శాఖామంత్రిగా, తరువాత 1949 లో గ్రామోద్ధరణ శాఖామంత్రిగా పనిచేశారు.

ఏ ఉద్యమం ఫలితంగా పైకివచ్చాడో ఆఉద్యమం వ్యాప్తికి, స్వసంఘీయుల అభ్యున్నతికి నిరంతరం కృషిచేయడం ఈయనలోని ప్రధాన లక్షణం. హరిజన బాలబాలికలకోసం ఛాత్రాలయాలను నిర్వహించి తనవలెనే పలువురు పైకిరావాలనే దీక్షతో పనిచేశారు. కాశీవిశ్వవిద్యాలయంలో ఎం. ఎ. ఎల్. ఎల్. బి. పట్టా పుచ్చుకున్న తొలి హరిజన విద్యార్థి కదామరి!

ఒక ఛాత్రాలయాలేకాదు. తన సంఘంలోని ప్రతివారికీ నివేశనస్థలం కావాలి; భూములు కావాలి; ఉద్యోగాలు కావాలి. ఇంతగా తనసంఘంవారికోసం పాటుబడుతున్నవారు భారతదేశంలోనే లేరంటారు.

ఈనాడు సమాజవికాస కార్యక్రమం అనే పేరిటజరుగుతున్న దానికి పునాదిఅనదగిన ఫిర్కా డెవలప్‌మెంట్ ప్రణాళికను ఈయన ద్వారా ప్రకాశం పంతులుగారు అమలు జరిపారు. కనుక నేటి సమాజవికాస పథకానికి కూర్మయ్యగారిని పితామహుడుగా పేర్కొనవచ్చు.

ఈయన మంత్రి అయిన కొత్తరోజులలో ఒక సంఘటనను చెబుతారు. ఎక్కడికైనా వెళ్లాలంటే తాము ఎవరికి తెలుపుచీటీ పంపాలనేది ఈయనకు సమస్య అయిందట. ఎవరికి పంపాలని ఎవరినో అడిగారటకూడా. వాస్తవమో, వ్యంగ్యమో గాని ఈ సంఘటన కూర్మయ్యగారి బోళాతనానికి నిదర్శనం.

ఈ బోళాతనం, మొగమోటంలేకపోవడం ఒక్కొక్కప్పుడు మరింత విడ్డూరమనిపించేది. కాంగ్రెసు ఎన్నికల ప్రచారంలో కాంగ్రెసు లోపాలనుకూడా ఈయన కుండబద్దలు కొట్టినట్టు చెప్పేవారు. "మనిషైనవాడు తప్పు చేయడా? తప్పుచేసినంత మాత్రాన ప్రజలకు ఏకైక ప్రాతినిధ్యం వహించే సమర్థత కాంగ్రెసుకుపోతుందా?" అనేవారు.

'తినగ తినగ వేము తియ్యనుండు' అన్నాడు వేమన. అలాగే వినగ వినగ మన 'వేము'ల చరిత్రకూడా తియ్యనుండు. ★

వంచిత బ్రతుకు

ప్రభు

'విన్నావా..?'

[illegible]



వాడిసర్వస్వమూ అంటూ వినిపించింది. "అయినా నాకెందుకులెండి అనవసరంగా..." ఏదేదో సణుక్కుంటూ లోపలికి వెళ్లిపోయింది.

*   *   *

నా ఆలోచన్లు చీకటిని చీల్చే కాంతిని కోల్పోయాయి. గతంతాలూకు ఛాయలు నిర్జీవంగా పరుచుకొంటున్నాయి...

మీనాక్షి... మీనాక్షి నాకేమవుతుంది? ఏమీ కాదు. లోకందృష్టికి మాయింటిపక్క ఒకప్పుడు ఉండే సాంబయ్యగారి కోడలు. అంతే. కాని నా మనస్సులో ఆమెకో ప్రత్యేకత ఉంది. నాకు కూతురే గనక



ఉంటే దానికి మీనాక్షిలో ఉండే కల్చర్, అణకువ సగం అబ్బితే నిజంగా చాలా మురిసిపోయేవాణ్ని. పరిస్థితులకు లొంగని గాంభీర్యం ఏదో ఉంది ఆమెలో.

పదేనిమిదో ఏట మీనాక్షి పెద్ద కోడలుగా, జగన్నాథం భార్యగా ఆ యింటి కొచ్చింది. అంతకుముందు రెండు మూడేళ్ళయిందిట ఆ అమ్మాయి స్కూలు ఫైనలు పాసయి. జగన్నాథం అప్పట్లో ఏదో బాంకులో పనిచేస్తూ నూరో, నూటయాభైయో తెస్తూ ఉండేవాడు. కాస్తో కూస్తో పొలంమీద గింజ లొచ్చేవేమో. తండ్రికి పెన్షను డబ్బులు వచ్చేవి. మిగిలిన పిల్లలింకా కాలేజీచదువులకి రాలేదు. కనుక వాళ్ళకంత యిబ్బంది అప్పట్లో లేదనుకుంటాను. కనుక జగన్నాథం ఎలా పెబ్బుతిగలేసినా ఎంత పట్టించుకోకుండా తిరిగినా ఎవరికీ అవసరం లేకపోయింది. తల్లికీ తండ్రికీ అతనేంచేస్తే అదో గొప్ప ఘనకార్యం. ఓ ముసలమ్మ ఉండేది. నాయనమ్మగాబోలు. ఆమెకు జగన్నాథం అంటే ఏ చక్రవర్తిలాగానో కనిపించేవాడు.

'మీనాక్షీ వాడులేచేవేళయినట్టుంది. కాఫీ ఫ్లాస్కులో పోసి ఉంచు.'

'వాడు చాకిరి చేసి చేసి వస్తాడు గదా. కాసిని వేన్నీళ్ళు కాచాలన్న జ్ఞానంలేదూ? మరి వాడు అరిచాడంటే అరవడూ."

"వాడికిష్టమైన అన్నంలోకి వేపుడు ముక్కలున్నాయా? లేకపోతే వాడు తినలేడు అసలు. ఎప్పుడన్నా అలవాటా పాడా?"

ఇలాంటిమాటలే వినిపిస్తూ ఉండేవి అస్తమానం. ఇవి నిజానికి మామూలు మాటలే... కాని నాకేమిటో వెగటుగా, అతన్ని అవసరమైందానికన్నా ఎక్కువ గారాబంచేస్తున్నారనిపించేది.

"ఏయ్ మీనాక్షీ; ఎక్కడచచ్చావే! తువాలేదీ?"

"కాసిని మంచినీళ్లిద్దూ నీపాడు పుస్తకం అలా పారేసి. నీ చదువు తగలడ్డట్టే ఉంది."

"ఏడిశావులే. నీబోడి సలహా ఎవరికీ అక్కర్లేదిపుడు."

"కాసినా కాఫీ అన్నా పొయ్యలేవేమే కొముకి? అన్నింటికీ అమ్మే రావాలా? ఆ కాఫీ అసలు నోట్లో పెట్టుకోలేం."...

ఇవీ జగన్నాథం అదిరిపాటులూ కేకలూ. ఎప్పుడన్నా సవ్యంగా భార్యతో మాట్లాడిన రోజుందేమోనని చూశా... నేను ఎప్పుడూ వినలేదు. అతనికో నాటకాలకంపెనీ; దానితో రాత్రీ పగలూ తిరుగుతూ ఉండేవాడు.

ఎప్పుడన్నా నేను వాళ్లింటికి వెళ్లితే మీనాక్షిని పలకరించేవాణ్ని. ఆ మాట్లాడిన కొద్దిమాటల్లోనే ఆమెకు సాహిత్యంలో అభిరుచి ఉందని గ్రహించాను. తెలుగులో ఇంగ్లీషులో మంచి మంచి పుస్తకాలు చదివింది. విమర్శలుకూడా నిశితంగా ఉండేవి. కానీ పట్టుమని పది నిముషాలన్నా మాట్లాడిందేదీ? జగన్నాథం గనుక అక్కడే ఉంటే అవన్నీ ఓట్టిపనికిమాలిన విషయాలన్నట్టు నవ్వి పారేసేవాడు. ఓమాటు అన్నాను అక్కడికి, "నీకి తెలుగుభాషతోబాటు కొద్దిగా సంస్కృతంకూడా రావాలమ్మా. చాలా చక్కని లిటరేచర్ ఉంది అందులో. చిన్న చిన్న పుస్తకాలిస్తాను. చూస్తావా ఏమిటి? ..."అన్నాను. ఆ అమ్మాయి కళ్లల్లో నీళ్ళు కదిలాయి. ఒక్క నిట్టూర్పు విడిచింది. అదే సమాధానం నాకు.

మీనాక్షికి పుట్టింటవేపు ఎవరూ లేరు. ఉన్న ఒక్క అన్నగారూ స్కూలుఫైనలు చదివించి పెళ్ళి అయిందనిపించి చేతులు దులుపుకొన్నాడు. ఏంచేస్తాడు అతను మాత్రం, అంతకంటే? నలుగురు పిల్లలూ, రోగిష్టి భార్యా, పట్నంలో కాపురమూ, అందువల్ల మీనాక్షికి పుట్టింటికి రాకలూ పోకలూ పండగ పబ్బాలకు పెట్టుపోతలూ ఆటే ఉండేవిగావు...అదీ ఒకగడ్డు సమస్యే అయింది మీనాక్షి బతుక్కి. "ఓ అచ్చటా ముచ్చటా... పెళ్లియింతగువాతి ఓసూటే నా ఒరగదు. ఇంతకీ మొహాన రాసిపెట్టి ఉండాలి దేనికనా" అంటున్నది శారదతో మీనాక్షి అత్తగారు ఒకరోజు పొద్దున్నే. పక్కనే మీనాక్షి నూతిగట్టుమీద చెంబులు తోముతున్నది.

"ఏమి అదిరిపాటే అది. ఇంకో సారెలూ చీరెలూ వేసుకొస్తే ఎలాఉండేదానికో! మా సీతమ్మకు కోడలురాగానే కొడుక్కి పెద్దఉద్యోగం అయింది. ఇంతకీ ఆడదాని అదృష్టం... కోడలొచ్చినవేళా గొడ్డువచ్చినవేళా అన్నారు..."ఇలాఅర్థంపర్థంలేకుండా సందర్భం అయినా కాకపోయినావాగుతోంది రాత్రితొమ్మిదిగంటలవేళ ముసలమ్మగారు.

'చక్కగా మోహన్‌రావుకి అత్తారు పండక్కిపిలిచి రేడియో కొనిపెట్టారు. సీతారాముడు గాబర్డిన్‌సూటు తెచ్చుకొన్నాడు. నేనూ ఉన్నాను అల్లుణ్ణి అంటూ ఎందుకూ..' అని సణుగుతున్నాడో రోజు జగన్నాథం.

కిందటేడు పైఫాయిడు వస్తే వంద రూపాయిలయింది మందులకే. అన్నగారు వచ్చిచూసి చక్కాపోయాడు. పళ్ళకీ పాలకీ లెక్కా పత్రమా? ఇదీ మామగారి మాటల సారాంశం.

మనుష్యుడిలో పశుప్రవృత్తి ఉంటుందంటారు అణిగీమణిగీ. కాని యిది రాక్షస ప్రవృత్తిగాదూ. ప్రక్కనమనిషిని తెలిసి తెలిసి యిలా హింసించటంలో ఆనందం ఏమిటి లభిస్తుందో? రోడ్డుమీద పడుకున్న

పక్కను నడుస్తున్న పురవాసు ఉత్త పుణ్యానికి తన్నేస్తాడు. మేష్టారు ఉన్న ఒక్క తెల్లని చొక్కా మీదా గంగుసిరా చిలకరించి టిన్నింగ్ లాగా సాహదానందం పొందుతాడు భావిభారత పౌరుడు. చక్కగా నాటకం చూస్తున్న అమ్మాయిలమధ్య టపాకాయలు పేల్చి బెదరగొట్టి హీరోల్లాగా పోజులుపెడ్తారు యువకధీరులు. రాత్రి సినిమాలో నాయకురాలి దరిద్రం ఎలా తనను కరిగించి కన్నీళ్లు తెప్పించిందో మరిచి దగ్గరకు వచ్చిన ముష్టిపిల్లను మాటి మాటకు కనిగలుతిప్పి వెక్కిరించి పొమ్మంటారు నేరు మిడిసిపాటు అమ్మాయిలు. ఏమిటో ఈ హింసాకాండ? భగవంతుడిచ్చిన కొద్ది సౌఖ్యమూ యిలాంటి పొరుపుమాటలతో, అతకని బతుకులతో అంతం చేసుకొంటూ రెందుకనీ? ఏనాడు చేసుకొన్నారో ఆనాడే తెలీదూ ఆ అమ్మాయి అంతిస్తూ. అంతగా కానుకలూ, ముచ్చట్లూ కావాలను కొనేవారు మరో పెదసంబంధమే చూసుకోగూడదూ? అసలు బాగా ఉన్నవాళ్లు యేం చూసియిస్తారు వీడికి? పండగలూ పబ్బాలూ మనస్సును ఉల్లాసపరుచుకోటానికి గాని యిలా మనస్సులు బాధపెట్టుకోటానికా?

ఆ అమ్మాయి మనస్సు ఎంతబాధ పడుతున్నదో ఈ మాటలతో. ఆమె నేర్చిన ఆ కొత్తచదువూ తనజీవిత సమస్యలను తీర్చుకోవటానికి ఎలా పనికివస్తున్నది? అయినా మీనాక్షి ఎవరితో కంప్లెయింటు చేసినట్టే ఉండేదిగాదు. చేస్తేమాత్రం లాభంఏముంది.

* * *

అరమూ పరమూ లేకుండా పరుగెత్తుతున్న ఆలోచనలు పిల్లవాడియేడుపుతో తెగిపోయినాయి. చిక్కుపడినతాడుకి మళ్లీ మొదలందలేదు. దొరికినచోటు ముడిపెట్టాను.

"ఏడిశాడు లెద్దూ. బోడి ఎ.వ. నన్ను షోకెళా అంటాడూ, ఎంత పైఆఫీసరయితే మాత్రం. మాటలంటే పడతానా? నాకు మాత్రం సెల్ఫ్ రెస్పెక్టు లేదూ. పేకాట ఆడుకుంటూ పనులే చెయ్యాలట. ఇలా అయితే నీఉద్యోగం ఆట్టేరోజులు నిలవదన్నాడు. ఎప్పుడో ఎందుకు ఇప్పుడే రిజైన్ ఇచ్చిచక్కావచ్చాను. నాయిష్టం వచ్చినట్టుంటా. నన్నడిగే దెవరు?" ఇలా ధూములు ధాములు చేస్తున్నాడు జగన్నాథం వంటింట్లో ఒకరోజు.

సాయంకాలం వాళ్లమ్మ ఎవరితోనో అంటున్నది.

'అవునమ్మా! చిన్నప్పటినుంచీ వాడతీరే అంత. ఎవ్వరికీలొంగడు. మాటంటే పడేరకం గాదు. వాడికంత రోషం మరి. ఉద్యోగం అయ్యేది మరోటయ్యేది.'

నేనీమాటలు విని నవ్వుకొన్నాను. అందరూ

వంకర బ్రతుకులు

అంగాగే అనుకుంటే. కాని బయటికి అనగలనా ఆమాటల్ని?

అయితే ఈ ఆనందం ఆట్టేరోజులు నిలవలేదు. కేవలం తండ్రిపెన్షనుతో బండినడవటం లేదు. ఆయేడు పంటగింజలూ తిన్నగా రాలేదు. జగన్నాధానికి ఉద్యోగంపోయినా దానివల్లవచ్చిన అలవాట్లుమాత్రం పోలేదు. అతని అధికారం యింకొంత ఎక్కువే అయింది. పంచదార తక్కువైతే గ్లాసు నే

వంకర బ్రతుకులు

తోసికొట్టిన చప్పుళ్ళూ, కూరలేనప్పుడు కంచం విసిరికొట్టిన మోతలూ అంతకంతకు ఎక్కువవుతున్నాయి. అతని కోపతాపాలకు గురి అయ్యేది మీనాక్షి. అప్పుడప్పుడు చెయ్యి కూడా చేసుకొనేవాడనుకుంటాను.

కథ యింతటితో ప్రస్తుతానికి ఆగిపోయింది. కారణం వాళ్ళు మాకు దూరంగా వెళ్ళటమే. శారద ఒకరోజీవార్త తెచ్చింది పరమసంతోషంతో. మీనాక్షి అంటే నాకున్న అభిమానానికి శారద కెందుకో అనుమానం జెలసీ. చిత్రమేమిటంటే శారదా అలాంటి సర్కిలులోనుంచే వచ్చిందిగాని మీనాక్షిని తప్పుపట్టటంలో ఆమెకూడా ఎవరికీ తీసిపోయేదిగాదు. 'అసలాపిల్ల పైకి అలా కన్పిస్తుందిగాని ఓట్టిపాదుపలవండీ. మొగుడు కోపదారి అని తెలుసుగా. ఎందుకంత ఇదవటం ఊరికే" అనేది. పైగా ఆమె సానుభూతికూడా జగన్నాధానికే. పట్టిబోతే మనిషి. కావలిస్తే నెత్తిన పెట్టుగుంటాడు. లేకపోతే బడబడా తిట్టేస్తాడు.

ఇదే నిజమయితే యింతకంటే దారుణం ఉంటుందా? కావలిస్తే నెత్తిన పెట్టుగోటానికీ, లేకపోతే కాలరాయటానికి ఇదేమైనా వస్తువా! అతని దృష్టిలో తిని విసిరేసిన పళ్ళానికీ, తన్ని పారేసిన పెళ్ళానికీ భేదం లేదన్నమాట.

ఏదిఏమయినా నేనూ శారదా పాత్రధారులమయినాము, అనుకోకుండా మీనాక్షికథలో. మీనాక్షికి కొడుకుపుట్టాడని శారదే గాబోలు ఓమాటు వార్త తీసుకొచ్చింది. అది నాకో విధంగా విచారమే కలిగించింది. సంతానం ఆనందదాయకమే? ఎవరికీ? సిరిసంపదా ఉన్నవాళ్ళకి. పోనీ యివేమీ లేకపోయినా కనీసం దంపతుల మధ్య అనుకూల్యం అయినా ఉండాలి. మీనాక్షి సమస్యలు పిల్లాడు పుట్టటంతో మరి కొన్ని క్లిష్టమే అవుతాయిగాని తగ్గవు. తను గనుక యేదో పనిచేస్తున్నా కొంత కొన్ని అవసరాలు గడుస్తుండిగాని యింక పిల్లాడు.

ఇంచుమించుగా రెండేళ్ళకిందట మీనాక్షి కథ యిది. ఇవ్వాళ శారద ద్వారా తన జీవితంలోని మలుపు నాకు తెలియజేసింది. ఇది ఆమె పరిస్థితిని పతనమే చేస్తుందో బాగుపరుస్తుందో నాకు తెలీదు. శ్యామలరావుతో ఆమె వెళ్ళిందంటే నమ్మలేకపోయాను. వాడి పేరు గూడా ఆమె విని ఉంటుందనుకోను. వాడి బతుకెలాంటిదో ఊళ్ళో చాలా మందికి తెలుసు. అదుపూ ఆజ్ఞా లేనివాడు. వాడు ఊళ్ళో లేకపోవట మేమీ కొత్త గాదు. పన్నెత్తి తనబాధ ఒకరితో చెప్పుకోని మీనాక్షి, ఎవరి సానుభూతీ ఏనాడూ ఆశించని మీనాక్షి యిలా పారిపోయిందని యెలా అనుకోను?

గడియారం కొట్టిన గంటలు నా ఊహలను చెదరగొట్టాయి. మళ్లీ ఏరుకొనే ఓపికలేక లోపలికి వచ్చాను. శారద మంచంమీద పడుకొని ఉంది. తెల్లని చీరా తలలోని తెల్లని మల్లెలూ నవ్వుతున్నాయి. మనిషికీ మనిషికీ ఎంత తారతమ్యం?

* * *

పదేళ్లు గిర్రున తిరిగిపోయాయి. మీనాక్షి సంగతి నాకేమీ తెలీదు. తెలుసుకోవాలని ప్రయత్నమూ చేయలేదు. ఊపరుగెత్తుతున్న రైలుబండి ఎవరికోసమూ ఆగదు మరి. మరో రెండునెల్లకు నాకు ట్రాన్సుఫరుఅయి శాశ్వతంగా వచ్చేశాము ఆ వూర్నించి.

'స్త్రీజనశ్రేయానికీ, మానసిక సంస్కారానికీ సంబంధించిన పుస్తకం అచ్చేసున్నా. ఆ పనిమీద తిరుగుతున్న నాకు మా పెద్దవాడికేదో కారు ప్రమాదం జరిగిందని వార్త వచ్చింది. అప్పటికే నాలుగురోజులయిందిట అది జరిగి. వాడు జూనియర్ ఇనస్పెక్టరుగా పనిచేస్తూ పల్లెటూళ్ళ వెంబడి తిరుగుతూ ఉన్నాడు. పరుగెత్తుకుంటూ వెళ్లానా ఊరికి.

ఎక్కడి గోదావరిజిల్లా? ఆ ఊరు వెళ్లాలంటే ప్రయాణ సాధనాలన్నీ ఉపయోగించాల్సి వచ్చింది. రైలు, కారు, బండీ, పడవ, అన్నీ దిగి నాలుగు మైళ్ళు నడిచి ప్రపంచానికి దూరంగా విసిరేసిన ఆ ఊరు చేరుకొన్నా సాయంకాలానికి. ఒక చిన్న యింట్లో పడుకోబెట్టారు మా సీనును. దెబ్బలంత ప్రమాదికరంగా లేవుగాని కదలలేకుండా ఉన్నాడు. కాలిమడిమ బెణికి వాచి ఉన్నది.

'మరేం కంగారులేదు నాన్నా. ఈ యింటివాళ్లు చాలా మంచివాళ్లు. వాళ్లే లేకపోతే యేమయేవాడినో ఇప్పుడు అసలు కొద్దిగా నయం" అంటున్నాడు సీను. "నిన్ను ఇంటికి తీసుకెళతాను నాన్నా. బండిలో రాలేవా?"

"మేనాకోసం కబురు చేస్తాను. రేపు పొద్దున వస్తుంది. ఈలోగా తొందరేం లేదులెండి. బండిమీద ఒళ్లంతా మళ్ళీ కదలిపోతుంది."

వెనకనుంచి వచ్చిన గొంతు పరిచితంగా ఉన్నది. తిరిగిచూసి నమస్కరించబోయి ఆగిపోయాను.

'ఆమే నాన్నా. ఈ ఊళ్లో ఎలిమెంటరీ స్కూల్లో టీచరుగా పనిచేస్తున్నది. అలాంటి వారు నిజానికి ఊరికొక్కరున్నా చాలు."

ఏమిటేమిటో అంటున్నాడు సీను. నా మనస్సు ఏమీ వినిపించుకోలేదు. ఏదో పాతగాథలు తవ్వుతున్నది. అదే నిబ్బరం. అదే నిండుదనం. మీనాక్షి ఏమీ మారలేదు. కొద్దిగా వయసుమీరిన ఛాయలు తప్ప.

నన్ను చూసి ఏమీ నివ్వెరపోలేదామె. నేను వస్తానని ఎదురుచూస్తున్న దానల్లే కనిపించింది. తల చక్కగా దువ్వుకొంది. మొహాన బొట్టు ఆ సంజెవెలుగులో మెరుస్తున్నది. కట్టుకొన్న చీర పరిశుభ్రంగా ఉంది.

సీనుకి ఎలా దెబ్బతగిలిందో స్పష్టంగా వివరించింది. పక్క ఊరునుంచి డాక్టరు వచ్చి కట్టుకడుతున్నాడుట. ఎక్కడా ఫ్రాక్చర్ కాలేదంటున్నాడు డాక్టరు. అయినా పట్నానికి తీసుకెళ్లి ఎక్స్‌రే తీయిస్తే మంచిది. ఇలా మాట్లాడుతుండగా నే పది పన్నెండేళ్ల కుర్రవాడొకడు ఏదో సీసా పట్టుకొచ్చాడు.

"అమ్మా డాక్టరుగారు ఈ మందు మూడు సార్లిమ్మన్నారే. కాలుకి కాపడం పెట్టమన్నారు. ఈ మాత్రలు మూడేసి గంటల కొకటి......"

ఆ గొంతువిని ఉలిక్కిపడ్డాను. అది జగన్నాథం గొంతు. మీనాక్షి అతి మామూలుగా వచ్చి సీనుని లేవదీసి మాత్ర మింగించింది. టెంపరేచర్ చూసింది. లోపలికి పోయి కుంపటీ నీళ్లూ తెచ్చి కాలికి కాపడం పెడుతున్నది. పిల్లవాడు పక్కనేఉండి ఆమెకు సహాయపడుతున్నాడు.

చూస్తూ ఉండటంకంటె ఏమీ చేయలేకపోయాను. నిమ్మదిగా బయటికి వచ్చాను. ఎర్రని రంగు దిక్కులను పులుముకొంటున్నది. గొల్లపిల్లవాడొకడు సినిమాపాటలు కీచు

గొంతుతో పాడుకొంటూ పోతున్నాడు. ఆడవాళ్లు నీళ్లు తెచ్చుకొంటున్నారు. పశువుల కొలితొక్కిడికి గుమ్మురేకుతున్నది. ఎక్కడో బావిగిలక గిరగిరా తిరుగుతూ చప్పుడు వినిపిస్తున్నది. దూరంగా పంట కాలువలో బాతులు ఈదుతున్నాయి.

మీనాక్షి చేతిలో లాంతరుతో బయటికి వచ్చి అక్కడేఉన్న చిన్న బల్ల మీద పెట్టింది.

"మేష్టారూ నేనింకా జ్ఞాపకానికి రాలేదా?"

"గుర్తుపట్టాను మీనాక్షీ... కాని నువ్వి క్కడా... ఎలా?" మాటలు పెగలక తడుము కొన్నాను.

చిన్నగా నవ్వింది. అందులో విషాదం నిండిఉందేమో అనిపించింది. కనీసం నా కళ్లకి.

గోపీవచ్చి అరుగుమీద చాపవేసుకుని దీపం పెట్టుకొని పుస్తకాలతో కూర్చున్నాడు. చాయ తండ్రిదేమోగాని పోలిక అంతా మీనాక్షిదే. మీనాక్షి నాతో యింకేం మాట్లాడకుండా వాడిపక్కన కూర్చున్నది. వాడి యెదుట యిలాంటివి ప్రసంగించటం యిష్టంకాదేమో. నాకేమీ తోచక గన్నేరుచెట్టు సందుల్లోనించి తొంగిచూస్తున్న సూర్యుణ్ణి చూస్తున్నాను: సీను బాధగా "అమ్మా" అని మూలిగాడు. లోపలికి వెళ్లి పోయాను.

ఆరాత్రి భోజనం చేయలేదు నేను. అలాగే సీను పక్క కూర్చున్నాను. మీనాక్షి మధ్య మధ్య వచ్చి పలకరించి పోతున్నది. లోపల నుంచి గిన్నెలూ, పళ్లాలూ చప్పుడవుతున్నాయి. నిశ్శబ్దంగా ఉంది వాతావరణం. నాకు మనస్సులో సీనునుగురించిన దిగులూ ఆందోళనా... మీనాక్షిని గురించి కుతూహలమూ. ఏమీ తోచటంలేదు... తొమ్మిది గంటలయిందేమో... హాల్లో ఏదో గొంతు వినపడింది. "బాబు పడుకున్నాడా?"

"ఆ. ఇప్పుడే. ఇంత ఆలస్యమైందేం ఇవాళ."

"లారీ మధ్యలో చెడిపోయిందిలే... నడిచి వచ్చాను. ఆకుర్రాడికెల్లా ఉంది?"

"కొంచెం నయమే. జ్వరం రాలేదివాళ. వాళ్ల నాన్నగారు వచ్చారు సాయంకాలం. రేపు పొద్దున తీసుకెళతానన్నారు."

అప్పుడే తొందరేం పాపం. కాలు కాస్త సద్దుకోనీకూడదూ.

నాకింక మనస్సు ఆగక గుమ్మందగ్గరికి వచ్చాను. హాల్లో మంచంమీద పడుకొన్న గోపీ జుట్టు సవరిస్తూ మాట్లాడుతున్నా డెవరో? నా అలికిడి విని తిరిగిచూశాడు. శ్యామలరావే.

ఆ విషయం నేను నమ్మలేకపోయానో... దేవ్వ గాదని చెప్పితే కసిరికొట్టానో అది ఆకారం ధరించి యెదుట నిలబడింది. మీనాక్షి అంటే నాకుండే గౌరవం అభిమానం తుడిచిపెట్టుకుపోయినాయి ఒక్కసారిగా. ఆపదలో దిక్కూ మొక్కూ లేని పల్లెటూళ్లో నా పిల్లవాడిని రక్షించిందన్న కృతజ్ఞతకు గూడా నా మనస్సులో స్థానం లేదు. ఎప్పుడెప్పుడు పారిపోదామా అని పించింది అక్కడినుంచీ. తెల్లవార్లూ కుర్చీ మీదఉన్నట్టే ఉన్నాను.

సీను కదిలినప్పుడల్లా మీనాక్షి పక్క సర్దుతునే ఉన్నది. మంచినీళ్లు తేవడీసి యిచ్చింది. నారింజపండురసం తీసియిచ్చింది. నెత్తికట్టు చెదిరితే సరిచేసింది. తెల్లవారే వరకూ ఇదేపని ఆమెకు. ఎంతచేసినా ఆమె చేసిన పాపపనికి ప్రాయశ్చిత్తం కాగలదా?

పొద్దున్నే చెరువుకి వెళ్లి స్నానంచేసి వచ్చాను. గోపీ కాఫీ తెచ్చి యిచ్చాడు. తాగనని తిప్పికొట్టాను. నా కళ్లలోని మూగ భావాలు చదివిందేమో. మీనాక్షి దగ్గర్నుంచి బలవంతం రాలేదు. ఎనిమిది గంటలకు మేనా వచ్చింది. శ్యామలరావు మరోయిద్దరూ కలిసి సీనును మేనా యెక్కించారు. సీనే స్వయంగా హీనస్వరంతో మీనాక్షితో ఏదో అన్నాడు గాని నా కృతజ్ఞతను కనీసం మాటల్లోనయినా వెల్లడించలేదు.

* * *

తిరిగి మీనాక్షినిగురించి వినటం అనేది జరిగింది ఆరేడేళ్లు తరువాత. అలా వినకపోతే యింత భయంకరంగా ముగిసేదేకాదు కథ. మనుష్యుడికి బుద్ధినీ మాటలనూ భగవంతుడు ఎందుకిచ్చాడో! అలా లేకపోతే యిన్ని దురంతాలు జరిగి ఉండకపోను. సరే యివన్నీ ఎందుకు! జరిగింది చెబుతున్నా. కనీసం అది కొంతవరకూ నా పాపాన్ని తగ్గిస్తుందేమో?

ఆరోజు కాలేజిలో ఏదో ఉత్సవం. రిటైరుఅయి ఓమూలకూర్చొని పుస్తకాలు రాసుకొంటున్న నన్నే పిలవాలావాళ్లు? సరే వెళ్లాను—ఆ ఉత్సవంలో ఓకుర్రాడు బి. ఎ. చదువుతున్నాడుట. తెలుగుసాహిత్యం తీరూ తెన్నూ చక్కగా చర్చించాడు. చాలా ఒరిజినలుగా ఉన్నాయి అతని ఉద్దేశాలు. అతని తెలివితేటలకీ వాగ్ధోరణికీ ఆశ్చర్యపోయాను. ఈ మాత్రం పరిజ్ఞానంకలవాళ్లున్నారంటే మన కాలేజీలు ఫర్వాలేదనిపించింది. శ్లోకాలూ పద్యాలూ అతను ఉదాహరిస్తూఉంటే కమ్మగా నిద్ర వచ్చేటట్టున్నది అతని గొంతు. వచ్చేస్తూ కుతూహలంపట్టలేక ప్రక్కనున్న ఎవరినో ప్రశ్నించాను.

ఎవరో రాజాపురంట. గోపాలకృష్ణ అంటారు. పోయినయేడు కూడా ఇక్కడే చదివి ఫస్టుక్లాసులో పాసైనాడు. మనిషి చాలా బీదవాడంటారుగాని ఆ బీదతనం మాటల్లో గాని వేషంలో గాని కనిపిస్తుందేమో చూడండి. ఆటల్లో పాటల్లో అన్నింట్లోనూ పైకి వస్తున్నాడు. ఇంతకీ ఆతల్లి చేసుకొన్న పుణ్యం.

(60—వ పేజీ చూడండి)

జీర్ణకోశ స్వరూపం - వ్యాధులు

డాక్టర్ గాలి బాలసుందరరావు

మానవదేహస్థితి

మానవదేహమూ జంతు దేహములాగే "ప్రోటోప్లాజమ్" అనే సజీవ వస్తువుతో నిండిఉన్నది. గోడలోని ఇటుకల లాగా ప్రోటోప్లాజమ్ అనేక జీవకణముల సముదాయము. ఈ జీవకణములను ఇంగ్లీషులో 'సెల్స్'అంటారు. వీటిచుట్టూ "సెల్ వాల్" (పొర) ఉంటుంది. ప్రోటో అంటే మూలము లేక ఆది అని అర్థము. ప్లాజమ్ అంటే గుజ్జువంటి పదార్థమని అర్థము. సెల్ లో ఉన్న ప్రోటోప్లాజమ్ మధ్యలో, విభిన్నమైన రసాయనిక స్వభావం కలిగిన "న్యూక్లియస్" ఉంటుంది. ఒక సెల్ రెండు భాగములు అయినప్పుడు న్యూక్లియస్ లోని భాగాలు వాటిలో ఉంటే అవి స్వతంత్రమైన కొత్తసెల్స్‌గా జీవిస్తాయి. ఈవిధంగా ఒక సెల్ రెండుసెల్లులుగాను, రెండు నాలుగుగానూ అవసరమునుబట్టి విభజన పొందుతూ ఉంటవి.

ఇటుకలలో రకములు ఉన్నట్లే సెల్లులలోనూ భౌతికంగానూ, రసాయనికంగానూ, చాలా భేదములు ఉంటవి. కండరములలో ఉండే "సెల్" ఒకరకం. చర్మంపైభాగంలో ఉండే సెల్ ఒకరకం. నోటిలోని మెత్తని పొరలోఉండే సెల్ వేరొకరకం. కాని అన్నిసెల్లులలోనూ సెల్ వాల్, లోపల సైటోప్లాజమ్ అనే ప్రోటోప్లాజము ఉంటవి. న్యూక్లియోప్లాజమ్ అని పిలవబడే ఒకరకమైన ప్రోటోప్లాజముతో ఏర్పడిన న్యూక్లియస్ విధిగా ఉంటవి. కొన్ని సెల్లులు దేహోపరిభాగములకు రక్షణఇచ్చే పొరలుగా ఉంటవి. కొన్నికొన్ని రకములైన స్పందనములను స్పందించేవిగా ఉంటవి. కొన్ని చిన్నవి పెద్దవి అయ్యే శక్తికలిగి ఉంటవి. ఇల్లా సెల్లులు నానారకములుగా ఉంటవి. ఒకే రకమైన సెల్లులతో యేర్పడిన శరీరభాగము 'టిష్యూ' అని పిలవబడుతుంది.

ఆయాకోశములలో భాగములు నిర్వహించ వలసిన విధినిబట్టి, అంగములు ఏర్పడతవి. వీటిని ఇంగ్లీషులో "ఆర్గన్స్"అంటారు. ఆర్గన్స్‌లో అనేకరకములటిష్యూలు ఉంటవి. ఇటువంటి ఆర్గనులు కొన్నిచేరి ఒకకోశము తయారవుతుంది.

శరీరములో చాలా కోశములు ఉన్నవి, శ్వాసకోశము, జీర్ణకోశము మొదలైనవి. ఒకేకార్యము సాధించడంలో సహకరించే అంగ సముదాయమును "సిస్టమ్" అంటారు. ఒకొక్కొక్కప్పుడు ఒకసిస్టములోని భాగములు రెండుమూడు పనులను కూడా చేయటం జరుగుతుంది. ఆయా కోశములు వాటికి వచ్చేవ్యాధులు చెప్పేస్తూన్నప్పుడు తెలుసుకోతగిన వివరాలు తెలియజేస్తాను. ఈ వివరములు తెలియనిదే రోగలక్షణములు, వాటి చికిత్సకు సంబంధించిన విషయాలు అర్థంకావు.


శరీరంలో ఎప్పుడూ యేదో ఒకపని జరుగుతూనే ఉన్నది. ఊపిరిపీల్చడం, విడవడం, హృదయం స్పందించడము, కండరములు చిన్నవీ పెద్దవీఅవటం మొదలైనఅనేకపనులు జరుగుతూంటవి. ఈపనులు చేయడానికి శక్తి కావాలి. ఆశక్తి ఉష్ణశక్తి. ఉష్ణశక్తి, "ఆక్సిజన్" (ప్రాణవాయువు)అనే వాయువు శరీర ధాతువులతో సంపర్కం పొంది, ధాతు దహనం జరిగినప్పుడు ఉత్పత్తి అవుతుంది. ఈవిధంగా దగ్ధమైనధాతువులను మళ్లీ సృష్టించకపోతే, శరీరం చిక్కిపోతుంది. అందుకని ధాతువులే మళ్లీ తమవంటిధాతువులను, సెల్లులు పొందే అనంతమైన విభజనద్వారా నిర్మించుకుంటవి. ఇందుకు వాటికి కావలసిన రసాయనిక ద్రవ్యములు, జీర్ణమైన ఆహారం అనేక రూపములలో రక్తంద్వారా ధాతువులను క్రమిస్తున్నప్పుడు సరఫరా అవుతవి. అంటే నిత్యమూ మనం చేసే పనికి కావలసిన శక్తి నివ్వడానికీ, నశించిన ధాతువులను మళ్లీ సృష్టించడానికీ ఆహారంకావాలి. ఆహారం జీర్ణంకావడానికి జీర్ణకోశం ఏర్పడ్డది. అందులో భాగములు అందుకు తగినట్లుగా నిర్మించబడ్డవి.

జీర్ణకోశంలో మొదటిభాగం నోరు. పైన అంగిలి (పాలెట్), క్రింద నాలుక. రెండు ప్రక్కల దవడలు; ముందు పెదవులు, వెనుక "ఫారింక్స్"అనే గరాటీవంటిభాగము కలవు. వీటి మధ్య ఉన్న భాగమును నోరు అంటారు. ఇందులో నాలుక, దంతములు, నాలుక వెనుకభాగంలో ఇరుప్రక్కల "టాన్సిల్సు" అనే ఉండలవంటి శరీరభాగములు, అంగిలినుండి క్రిందకు వ్రాలివుండే కొండనాలుక ఉన్నవి. ఈభాగములన్నీ రోగగ్రస్తములు కావచ్చును.

నోటిలో ఉమ్మినీరు ఊరుతూ ఉంటుంది. దీనిని ఇంగ్లీషులో "సలైవా" అంటారు. సంస్కృతంలో లాలాజలం అంటారు. సలైవాను "సలైవరీగ్లాండ్సు" (గ్రంథులు) స్రవింపజేసి తమ నాళముల ద్వారా నోటిలోకి పంపిస్తవి. చెవికి ముందుగా రెండు దవడలలోను రెండు సలైవరీ గ్లాండ్సు ఉన్నవి. వీటిని "పెరాటిడ్ గ్లాండ్సు"అంటారు. నాలుక క్రిందిభాగంలో రెండు ఉన్నవి. పెరాటిడ్ గ్లాండులు వాచినప్పుడు గవదబిళ్ళలు అంటారు.

కొన్ని ద్రవములను స్రవింపచేసే శక్తిగల జీవాణువుల సముదాయమును "గ్లాండ్" అంటారు. ఇటువంటివి శరీరంలో చాలా ఉన్నవి. జీర్ణకోశంలోనూ చాలా ఉన్నవి. కొన్ని గ్రంథులు నాళములద్వారా తమ రసములను కావలసిన చోట్లకు పంపుతవి. మరి కొన్ని నేరుగా ధాతువులలోకి తమ స్రావములను వదలుతవి. అవి రక్తంలోకి ప్రవహించి, శరీర కార్యక్రమములో పాల్గొంటవి! ఈ గ్రంథులను వినాళికా గ్రంథులు అంటారు... ఇంగ్లీషులో "ఎండోక్రైన్ గ్లాండ్సు" అంటారు. ఇవి స్రవింపచేసే వస్తువులు "హార్మోనులు" అని పిలవబడతవి. ఇవి అధికమైనా, స్వల్పమైనా కొన్ని వ్యాధులు యేర్పడతవి. ఈవిధంగా, ఏదో ద్రవపదార్థమును స్రవింపచేసేగ్లాండులలో పలిభాగము ఒక మెత్తని పొరతో కప్పబడి ఉంటుంది. ఆ పొరను "మ్యూకస్ మెంబ్రేన్" అంటారు! మెంబ్రేనుకు సంస్కృతం పేరు జేహం.

నోటి వెనకభాగం గరాటిలాగా ఉందని చెప్పేను. ఈ భాగం పేరు "ఫారింక్సు", ఈ గరాటి కొన రెండు భాగములుగా చీలి ముందుభాగం శ్వాసకోశంలోకి పోతుంది; రెండవభాగం "ఈసాఫగస్" అనే పేరుగల గొట్టంలో అంతమౌతుంది. ఈసాఫగస్ వక్షంలో, రెండు ఊపిరి తిత్తుల మధ్యనుంచి క్రిందికిదిగి "డయాఫ్రమును" చీల్చుకుని కడుపులో అంతమౌతోంది. కడుపును ఇంగ్లీషులో "స్టమక్" అంటారు. వైద్య పరిభాషలో 'గాస్ట్రియా' అంటారు.



(1) మిడిల్, లెఫ్ట్ హిపాటిక్ వెయిన్స్ (2) రైట్ వాగస్ నర్వ్, ఇసోఫేగస్ (3) రైట్ హిపాటిక్ వెయిన్, క్రూరా ఆఫ్ డయాఫ్రామ్ (4) ఇన్ఫీరియర్ వీనాకావా, గ్రేటర్ స్ప్లాన్క్నిక్ నర్వ్ (5) పోర్టల్ వీన్, హిపాటిక్ ఆర్టెరీ, (6) సిలియాక్ ప్లెక్సస్, సిలియాక్ ఆర్టెరీ (7) హిపాటిక్ లింఫ్ నోడ్, హిపాటిక్ రామి ఆఫ్ వాగస్ నర్వ్ (8) గాస్ట్రో డ్యూయొడెనల్ ఆర్టెరీ, సూప్రాపైలోరిక్ లింఫ్‌నోడ్స్ (9) సుపీరియర్ గాస్ట్రిక్ లింఫ్‌నోడ్స్ (10) డుయోడినం (11) సుపీరియర్ మెసెన్టెరిక్ ఆర్టెరీ, వెయిన్ (12) సబ్ పైలోరిక్ లింఫ్‌నోడ్స్ (13) రైట్ గాస్ట్రోఎపిప్లోయిక్ ఆర్టెరీ, వెయిన్ (14) ఇన్ఫీరియర్ గాస్ట్రిక్ లింఫ్‌నోడ్స్ (15) డయాఫ్రమ్ (16) సెరోసా (17) పారా కార్డియల్ లింఫ్‌నోడ్స్, (18) లెఫ్ట్ వాగస్ నర్వ్, లాంగిట్యూడినల్ మస్క్యులర్ లేయర్ (19) ఎబ్డామినల్ ఎవోర్టా, సర్క్యులర్ లేయర్ (20) లెఫ్ట్ గాస్ట్రిక్ ఆర్టెరీ, ఆబ్లిక్ మస్క్యులర్ లేయర్ (21) సిలియాక్ రామి ఆఫ్ వాగస్ నర్వ్, గాస్ట్రిక్, మ్యుకోసా (22) స్ప్లెనిక్ లింఫ్‌నోడ్స్, (23) లెఫ్ట్ గాస్ట్రిక్ (కొరొనరీ) వెయిన్, స్ప్లెనిక్ రామి ఆఫ్ వాగస్ నర్వ్ (24) స్ప్లెనిక్ ఆర్టెరీ, వీన్ (25) గాస్ట్రిక్ రామి ఆఫ్ వాగస్ నర్వ్ (26) లెఫ్ట్ గాస్ట్రో ఎపిప్లోయిక్ ఆర్టెరీ, వెయిన్, (27) గాస్ట్రిక్ లింఫాటిక్ ప్లెక్సస్.

కడుపు పాలసీసావంటి ఆకారం కలది. కడుపు చివరభాగం ప్రేగులో అంతమౌతుంది. ప్రేగులను ఇంగ్లీషులో "ఇంటెస్టైన్స్" అంటారు. సంస్కృతంలో ఆంత్రము అంటారు: వైద్య శాస్త్ర పరిభాషలో "ఎంటెరన్" అంటారు.

ప్రేగులో మొదటిభాగం—గుర్రం లాడం ఆకారంగలది. దీనికి "డువోడినం" అని పేరు. ఈ భాగానికి ఎడమ ప్రక్కన "లివరు" ఉన్నది: లివరుకు సంస్కృత నామం కాలేయం. వైద్య పరిభాషలో 'హిపార్.' లివరు ఒక గ్లాండు. అది పసరును స్రవింపచేస్తుంది. ఆపసరును "బైల్" అంటారు. ఒక నాళం ద్వారా బైల్ డువోడినంలో వచ్చి పడుతుంది. డువోడినంకు కుడి ప్రక్కన చేపపిల్ల ఆకారంగల "పాంక్రియస్" అనే గ్లాండు ఉన్నది. దాని రసంకూడా ఒక నాళంద్వారా డువోడినంలో పడుతుంది. డువోడినం చివరనుండి "జెజూనం" అనే

(54 వ పేజీ చూడండి)

ఎదురు చూసినది...?

అరవింద



రాజేశ్వరికోసం నిరీక్షిస్తూ కేశవ్ లేడీస్ హాస్టల్ విజిటర్స్ రూమ్‌లో కూర్చున్నాడు. ఊరికే కూర్చుంటే అతనికి అనేక రకాలైన ఆలోచనలు వస్తుంటాయి. కొంతమంది అమ్మాయిలు తమకోసం వచ్చినవాళ్ళతో మాట్లాడుతున్నారు. సాయంత్రం మసక చీకటి. కొంతమంది గాలిలో తిరుగుతున్నారు. కేశవ్ అకస్మాత్తుగా అమ్మాయిలనుగురించిన ఆలోచనలో పడ్డాడు. అతడిని కదిలించింది వాళ్ళ అందాలు, నవ్వులు కావు. ఈనాటి చదువులు, నాగరికతలను ఆధారం చేసుకున్న పరిస్థితులు.

"ఎంత అసహజంగా బ్రతుకుతున్నాము!.... ఈనాటి స్త్రీలు, పురుషులు కూడా. ఒక్కొక్క కాలధర్మం ఆ విధంగా నడిపిస్తుంది. పూర్వీకులు స్త్రీలను గృహానికే అంకితం చేశారేమో! విజ్ఞానం అపారమైనది. కనుక అసంతృప్తికి దారి తీస్తుంది. గృహిణి అయిన స్త్రీ విద్యావంతురాలు అయితే పురుషుడితో సమానంగా అన్వేషణలో మునిగి తన బాధ్యతలు నిర్వహించలేకపోతే కుటుంబ వ్యవస్థ కొంతవరకు క్షేమాలకి భంగం వాటిల్లుతుందేమో! గ్రీకుల కళా శిఖరావాసానికి బానిసలు సోపానాలైనట్లు మన స్త్రీలు హిందూ నాగరికతను పోషించారు కాబోలు. ఆ రకంగా కొంతమంది కళాజీవులు, జ్ఞానతృష్ణగలవారు ఆత్మహింసకి గురియై ఉంటారు. కాని సామాన్యంగా స్త్రీ యొక్క ప్రకృతి, స్వభావం గృహజీవనానికి అనుగుణంగా సృష్టించబడి ఉండాలి. ఇది అర్థం చేసుకోటానికి నేటి పరిస్థితులు ఆడవాళ్ళను చక్కని అవకాశం. ఇప్పుడిప్పుడే స్త్రీలు స్వతంత్రాన్ని కొంచెం రుచి చూస్తున్నారు. ఈ నాగరికత అసంతృప్తికి దారితీస్తుందా! మళ్ళీ మానవుడు యంత్రాల్ని విసర్జించి ప్రకృతినే ఆరాధిస్తాడా! విజ్ఞానవతులయిన స్త్రీలు గృహనిర్వహణం ఉత్తమ బాధ్యత అని తెలుసుకుని తృప్తితో స్వీకరిస్తారా! మానవుడు పయనించి పయనించి మళ్ళీ మొదటికే వస్తాడు. భూమి గుండ్రం కదా! కాలంకూడా వృత్తాకారం కలదానిలాగే కనిపిస్తోంది..."

"చాలా ఆలస్యం చేశానా మామయ్యా?" అంటూ ఇంకొక కుర్చీలో కూర్చుంటూ రాజేశ్వరి. కేశవ్ చూశాడు. రాజేశ్వరి వచ్చింది. తెల్ల జార్జెట్ చీర, తెలుపు పాప్లిన్ జాకెట్ వేసుకుని చాలా నీట్‌గా ఉంది. పెదవులమీద నవ్వు ఉన్నా కళ్ళలో నీడలా ఏదో దిగులు వ్యాపించి ఉంది.

"ఏవో ఆలోచనలు వస్తుంటే పది నిముషాలు గడిచాయని కూడా తెలియలేదు. రాజీ" అన్నాడు. ఒక్కసారిగా రాజేశ్వరి కేశవ్ ముఖంలోకి చూసింది.

"నేను చాలాసార్లు అనుకున్నాను మామయ్యా, రాజీ అని పిలవమని చెప్పాలని. నా ఫ్రెండ్స్ కూడా నన్ను ఇంట్లో అందరూ పిలిచినట్లే రాజీ అనే పిలుస్తారు. ఈ మధ్య ఆ పేరు నాకెందుకో జుగుప్స కలిగిస్తోంది. నువ్వు రాజీ అని పిలిస్తే ఎంతో హాయిగా అనిపించింది. అలా పిలిపించుకోవాలని ఉందని నీకెప్పుడైనా చెప్పానా, నాకు గుర్తులేదు." అంది.

కేశవ నవ్వాడు. అతడు రాజేశ్వరికంటె పదేళ్ళు పెద్దవాడు. ఆ నవ్వులో ఆప్యాయత, వాత్సల్యం ఉన్నాయి. అతని మాటలలో ముఖంలో నిదానం ఉట్టిపడుతూ ఉంటుంది. చేతులు టేబుల్ మీద ఆన్చి కప్పులు ముందుకు పెట్టాడు.

"అక్కయ్యకి నువ్వే ప్రథమసంతానం. నువ్వు పుట్టేముందర మీనాన్న కొడుకు పుట్టాలి అన్నాడు. నువ్వు పుట్టగానే మీ అమ్మ 'ఆడపిల్లా' అని ముఖం తిప్పేసుకుంది. తరవాత నీకు అబ్బాయి చొక్కాలు తొడిగేది. నిన్ను రాజూ అని పిలిచేది. షర్టు, నిక్కరు వేసి క్రాప్ చేయించేది. గోలీలాడటం, చెట్లెక్కడం, గోడలుదూకటం నీకు గుర్తుఉంటాయి నిన్ను చూస్తుంటే వాతో సైకిల్ పందాలువేసిన రాజావిసా అనిపిస్తుంది" అన్నాడు.

"ఊహు. రాజు అనొద్దు మామయ్యా" అంది కొంచెం అలుకగా. రాజేశ్వరిని అర్థం చేసుకోటానికి ప్రయత్నిస్తూ ఆమె ముఖంలోకి చూశాడు కేశవ్. రాజేశ్వరి బల్లమీద ఆన్చిన తన చేతులకేసి చూపులు ప్రసరిస్తూ అమ్మకోరిక నెరవేర్చాలని, అంతపట్టుదలతో మెడిసిన్‌లో చేరానా, ఇప్పుడు ఈ రెండేళ్లు లేని దిగులు ఏదో వేధిస్తోంది మామయ్యా. నాకేం తక్కువ! ఇంట్లో చదువుకోడానికి వీలుగా ఉండదు, కాలేజీ దూరమనీ అనుకుంటే హాస్టల్ లో జేర్పించారు నాన్న. నాకు మార్కులుకూడా బాగానే వస్తాయి. ఎందుకో దిగులు నాకేం అర్థంకాదు" అంది. రాజేశ్వరి సన్నగా ఉంటుంది. ఎక్కువ పొడుగుకాదు. కళ్ళు పెద్దవి. చిన్నపిల్లలా అమాయకంగా కనిపించే ముఖం. రాజేశ్వరి మీద జాలివేసిందతనికి.

"మొన్న ఒకరోజు బీచ్ కి వెళ్లాను. కెరటాలు చంద్రుడిని అందుకోటానికి తహతహలాడుతున్నాయని వర్ణిస్తారు కవులు. నాకేమనిపించిందో తెలుసా! ఈ అల్లరిపిల్ల ఆకాశరాజులాగ ఉండాలని ఎగురుతూ వృథాప్రయత్నం చేస్తోందని. కాని సముద్రము, ఆకాశము – దేనిలోఉండే గాంభీర్యమూ, అందము విడివిడిగా రెండింటిలోనూ ఉన్నాయి కదూ" అన్నాడు.

"సముద్రాన్ని అల్లరిపిల్లతో పోల్చావా" అంటూ రాజేశ్వరి నవ్వేసింది. నా మాటలు అర్థంచేసుకోలేదు అనుకున్నాడు కేశవ్. అతడి పెదవులమీద నవ్వు అణిగిపోయింది. తరవాత కులాసాకబుర్లు అయ్యాక అతను వెళ్లిపోయాడు.

*   *   *

రాజు ఎందుకు దిగులుగా ఉంటోంది! ఇది కేశవ్ ఆలోచన.

"రాజు ఎందుకో దిగులుగా కనిపిస్తోంది అక్కయ్యా" అన్నాడు కమలమ్మతో.

"పరీక్షలకి చదువుతోందేమో! అయినా ఈమధ్య దానిని చూస్తే దానికి చదువు ఆపించి పెళ్లి చేసే నయమేమో అనిపిస్తోంది. ఏమి మనుషులమో, ఒక అభిప్రాయం పెట్టుకోటానికి వీలులేదు. అది నెరవేరుతుందని లేదు. మెడికల్ స్టూడెంట్స్ దానితోటివాళ్లంత సరదాగా తిరుగుతారు! దాని కళ్లలో దిగులు నాకూ కనిపించింది. దసరాలకి అక్క వచ్చిందని ఉష ఎంత సరదాపడింది. అదేమో సినిమాకి రమ్మన్నా కదలదు పేరంటాళ్ళు వచ్చినా రాదు. ఆ మేడగదిలో కుర్చీ వేసుకుని చేతిలో ఒకనవల, ఎక్కడో చూపులు. దీనిని బలవంతంగా చదివిస్తున్నామా అనిపించింది."

"నాకూ అట్లాగే అనిపించింది" అన్నాడు కేశవ్. కొంచెంసేపు ఊరుకుని కమలమ్మ, "ఆదివారం తప్పకుండా ఇంటికి రమ్మని చెప్పు. ప్రసాద్ వాళ్ళ వాళ్ళకి కబురు చేశాము. నువ్వు వెళ్ళినప్పుడు రాజుతో మళ్ళీ ఒకమాటు చెప్పు అది అతనంటే కొంచెం ఇష్టం చూపిస్తోంది. పోనీ కుదిరితే పెళ్ళి చేస్తాము. పిల్లల సంతోషంకంటేనా, నా అభిలాష! అది డాక్టర్ కావాలని ఎన్నో కలలు కన్నాను. దానికిష్టంలేని భారం నెత్తిన వెయ్యటం అన్యాయమవుతుంది.

"కొడుకులాగ పెంచావుకాని, కొడుకును కానని గుర్తుచేస్తోంది. అంతే అక్కయ్యా!" అన్నాడు కేశవ్ నవ్వుతో.

*

"మీ అమ్మ నిన్ను ఆదివారం తప్పకుండా రమ్మని చెప్పింది. తెలుసుకదూ, ప్రసాద్ వాళ్ళు నిన్ను చూడటానికి వస్తారుట" అన్నాడు. రాజేశ్వరి సిగ్గుపడింది.

"అతను, వాళ్ళ చెల్లెలు ప్రమీల ఇప్పుడు ఇక్కడికివస్తున్నారు. నువ్వెప్పుడైనా అతడిని చూశావా?" కళ్ళతో ప్రశ్నిస్తూ అడిగింది.

"శనివారం సినిమాదగ్గర నువ్వు, సరోజా మాట్లాడుతున్నది అతనితోటేనా?" అన్నాడు. రాజేశ్వరి తన చూపులను మళ్లించుకుంది.

"మాటినీషోకి నువ్వూవచ్చావా మామయ్యా! ఔను. సరదాగా ఉంటాడు. అదిగో వస్తున్నారు" అంది. ప్రమీల, ప్రసాద్ వచ్చి ఇంకో రెండు కుర్చీలు ఆక్రమించుకున్నారు. కేశవ్ ప్రసాద్ మాటల్లో, [illegible]గలికల్లో గమ



నిస్తున్నాడు. రాజేశ్వరి ప్రసాద్ వైపు చూసినప్పుడు ఆమె బుగ్గలు ఎర్రపడటం, కళ్ళలోకి కాంతి రావటం అతను చూశాడు. ఇతనిలో ఏమిచూసి రాజేశ్వరి ముగ్ధురాలవుతున్నది అని అతడు నవ్వుకున్నాడు. వాళ్ళు వెళ్ళిపోయాక,

"ప్రసాద్ నిన్న సినిమాలో ఉమాబాలతో కనిపించాడు. అతనికి చాలామంది ఫ్రెండ్స్ ఉన్నట్లున్నారే" అన్నాడు.

రాజేశ్వరి తన ముఖంలోని భావాలేవీ కనపడకుండా ప్రయత్నం చేస్తూ—

"అతను చాలా సరదాగా ఉంటాడని చెప్పాను కదుమామయ్యా" అంది.

"ఒకసారి ట్రైన్‌లో నేను, అతనూ ఒకే కంపార్ట్‌మెంట్‌లో ఎక్కాము. బెడ్డింగ్, సూట్‌కేస్ తీసుకువస్తూ ఎదురుగావచ్చే ఐదేళ్ల

పిల్లని తోసేశాడు. ఒకావిడ బెడ్డింగ్ వేసుకుని పడుకుంది. చోటు చెయ్యమన్నాడు. ఆవిడ ఒప్పుకోలేదు. ఆవిడతో వాదనకి దిగాడు. ఎంత తొందరపాటు!"

"ప్రతిమనిషికీ ఏవో బలహీనతలుంటాయి కదు మామయ్యా!"

"శంకర్ చెప్పాడు. ప్రమీల స్నేహితురాండ్రందరితోటి అతను సరదాగా కబుర్లు చెపాడుట. కాని తన చెల్లెల్ని తనస్నేహితులెవరితోటి మాట్లాడనీయడుట. ప్రమీల చదువుకోవటం అతడికేమీ ఇష్టంలేదుట."

"నా మటుకు నాకు ఈ చదువులకు అర్థం లేదనిపిస్తుంది. ఇంక నేను చదవలేననిపిస్తోంది మామయ్యా. ఈమధ్య" అంది భారంగా.

"శంకర్, ప్రసాద్ చాలా స్నేహంగా ఉంటారని నీకు తెలుసనుకుంటాను. ఎక్కడికి వెళ్ళినా, సినిమాలకి, షాపింగ్ కి, ప్రతిచోటికీ శంకర్ ని బలవంతంగానైనా లాక్కుపోతాడుట ప్రసాద్. ఈమధ్య శంకర్ కి మలేరియా వచ్చింది. రూమ్ మేట్ కదా! జ్వరంగా ఉందా, అయితే క్లాస్ కి రావా అని వెళ్ళిపోయాడుట." అన్నాడు కేశవ్. రాజేశ్వరి ముఖంమీదే అతడి చూపులు కేంద్రీకృతమయి ఉన్నాయి. రాజేశ్వరి అట్లాగే తలవంచుకుని బల్లమీద వేళ్ళతో వ్రాస్తూ కొంచెంసేపు మాట్లాడకుండా కూర్చుంది.

"నేననుకుంటాను మామయ్యా, చిన్నతనంలో విన్నవీ, చదివినవీ కథలూ, కబుర్లూ మనకేవో ఆదర్శాలు, వ్యామోహాలు కల్పిస్తాయి. దేశసేవ, ప్రేమ వివాహం ఇటువంటి ఉద్దేశాలెన్నో కలుగుతాయి అప్పుడు బ్రతుకంతో తీయగా, మహోత్తమంగా, ఉత్సాహపూరితంగా ఉంటుంది. కాని టైన్స్ గడుస్తూ, యథార్థాలని అర్థం చేసుకుంటుంటే ఇవన్నీ భ్రమలు, జీవితం ఎడారివంటిది అనిపిస్తుంది. ఇటువంటి జీవితానికి నియమాలేమిటి? ఇంత గాంభీర్యమెందుకు? అల్పాయుష్కాలయిన ఈ జీవితంలో సిద్ధాంతాలనీ, ఆశయాలనీ పెట్టుకుని ఆనందాన్ని దూరం చేసుకోవటం కాలాన్ని వ్యర్థం చేయటం కాదా! నాకు రిస్సరెక్షన్ నవల గుర్తువస్తుంది. ఇప్పుడు ఈ రెండవ స్టేజ్ లో నేనున్నానేమో అనిపిస్తుంది. ఎవరి కష్టసుఖాలు వారివి కాని, ఇంకొకళ్ళు పాలు పంచుకోగలరంటావా? ఇటువంటి సందేహాలకి సమాధానం దొరకక మనసు భారంగా ఉంటుంది మామయ్యా" అంది. కేశవ్ వెంటనే ఏమీ మాట్లాడలేదు. కొంచెంసేపు మౌనంగా కూర్చున్నాడు. తిరవాత వెళ్ళటానికి లేస్తూ "ఆదివారం తప్పకుండా, అమ్మ గుర్తు చెయ్యమంది" అన్నాడు.

* " *

ఆ రోజు ఆదివారం. రాజేశ్వరిని చూడటానికి పెళ్ళివారు వస్తారు. రాజేశ్వరి అద్దం ముందు నిలబడి జడలు అల్లుకుంటోంది. ఉష దగ్గరేనిలబడిఉంది. ఉషకి మొదటి నుంచీ అలంకరణమీద మోజు. అసలు స్వభావంలోనే రాజేశ్వరికి, ఉషకి తేడాఉంది. తల్లి కమలమ్మ మొదటినుంచీ రాజేశ్వరి చదువు విషయంలోనూ, పుస్తకాలమీద శ్రద్ధ తీసుకునేది. ఉష తోటి ఆడపిల్లలతో బొమ్మల పెళ్ళిళ్ళు చేస్తూ, ఆడుకుంటూ తిరిగేది. కొత్తరకం నగవస్తే వెంటనే ఆవిడ ఉషకి అనగ చేయించేది. అడిగి, పేచీ పెట్టి రకరకాల పరికిణీలు కుట్టించుకునేది ఉష. రాజేశ్వరి తల్లి నేమీ అడిగేదికాదు. ఏమీ అనుకునేదికాదు తాను ఈ కోరికలన్నింటికి అతీతురాలు అన్నట్లు ఉండేది. లైబ్రరీ నుంచి మామయ్య తెచ్చుకున్న ప్రతిపుస్తకం చదివేది. మామయ్యతో సైకిల్ పందాలు వేసేది. సినిమాలకి వెళ్ళటం, క్రికెట్ గురించి చర్చించటం, ఇవి రాజేశ్వరి సరదాలు. "నేను పెళ్లి చేసుకోను. డాక్టర్ నవుతాను. స్వతంత్ర జీవనం గడుపుతాను" అనేది

ఇవేళ రాజేశ్వరికి అలంకరించుకోవాలని కోరిక పుట్టింది. అలంకరించుకోటానికి సిగ్గు పడుతోంది. తల్లి బలవంతంచేస్తే నగలు పెట్టుకుందామనుకుంది. కమలమ్మ వచ్చి ఒంటిపేట గొలుసు, గాజులజత ఇస్తూ "నెక్లెస్ వేసుకోవూ?" అని అడిగింది రాజేశ్వరి "ఊహు" అంది మనసులో సిగ్గు కోరికను అణచివేస్తుంటే. ఆ గదిలోనే కూర్చున్న కేశవ్ తో "దానికి మొదటినుంచీ నగలంటే ఇష్టంలేదు" అని ముస్తాబవటానికి వెళ్ళిందావిడ. జడలు అల్లుకుంటున్న రాజేశ్వరిని చూసి "అయితే ఇవేళకూడా మీ మెడికల్ కాలేజి పిల్లలాగే ఉంటావా?" అని అడిగింది ఉష. ఉష మెడలో నెక్లెస్ అందంగా కనిపిస్తోంది. చెవులకు ముత్యాల దుద్దులు. చేతులకు బంగారు గాజులమధ్య రంగురంగుల గాజులు మెరుపులీనుతున్నాయి. వదులుగా అల్లుకుని వొంకులు తిరిగిన జడలో పువ్వులు నవ్వుతున్నాయి. ఉష ఎంత కళగా ఉంది! ఇదివరకెప్పుడూ చెల్లెలి ముస్తాబుచూసి నవ్వుకునేది రాజేశ్వరి. ఇవేళ తనకేమీ నగలు లేవని బాధపడుతోంది. బామ్మ అమ్మతో దెబ్బలాడి తనకు చిన్నప్పుడు చెవులు కుట్టించింది. కాన్వెంట్ లో చేరాక తను మామయ్య సైకిల్ మీద కంసాలి దగ్గరకు వెళ్లి చెవుల రింగులు తీయించుకుంది. తర్వాత తనకి అమ్మ ఏ ఆభరణాలూ చేయించలేదు. దానికి రాజేశ్వరి బాధపడలేదుకూడాను. అందరు ఆడపిల్లలలాగ అలంకరించుకుందాము అనే కోరికే ఉండేదికాదు. ఇంటర్ పాసయితే, నాన్న వాచ్ కొని పెట్టారు. ఆ కానుకే తనకి అపరిమితానందం కలుగజేసింది. ఇప్పుడు ఈ బాధ ఎందుకూ! చెల్లెలి ప్రశ్నకి జవాబుగా "నేను నీకంటెకీ

"విచిత్రంగా కనిపిస్తానుటే ఉషా?" అనడిగింది. "నువ్వుబాగుంటావు, నగలు పెట్టుకుంటే ఎట్లాగుంటావో చూడాలనిపిస్తుంది; రాజక్కా! నీకు నగలంటే చిరాకు" అంది ఉష.

ఆమాటలకి రాజేశ్వరి ముఖం చిన్నబోయింది.

బీరువా తెరిచి దంతపుపెట్టె తీసుకువచ్చి "నేను జూకాలు పెట్టుకుంటాను. నువ్వు నా ముత్యాలదుద్దులు పెట్టుకోవాలి" అంది ఉష. తన చెవివి తీసిఇచ్చింది. రాజేశ్వరి వాటివైపు చూసింది. ముత్యాలమధ్య కెంపు మెరుస్తోంది. ముద్దుగా, అందంగా ఉన్నాయి దుద్దులు. అక్క మౌనంగా ఉండటంచూసి, చెవులకు పెట్టడానికి ప్రయత్నించింది ఉష. దుద్దుల కాడలు లావుగా ఉన్నాయి. పట్టలేదు. "అవి పట్టవు ఉషా" అంది రాజేశ్వరి సన్నగొంతుకతో. ఉష అక్కని పెళ్ళివారు చూడటానికి వస్తారు అనే సరదాలో ఉంది. రాజేశ్వరి పరిస్థితి ఏమిటో ఉషకి తెలియదు. "ఛో, అక్కా చెవికన్నాలు చూడు ఎంత సన్నగా ఉన్నాయో! నీకే సరదాలేదు. చెవులకేమీ లేకపోతే ఏం బాగుంటుంది. నగలంటే నీకంత అయిష్టమెందుకో నాకు అర్థంకాదు. పోనీ, స్ప్రిట్స్ తెప్పిస్తానుండు" అని ఉష వెళ్ళిపోయింది. అప్పటిదాక అణచుకున్న ఆవేదన రెండు బిందువులుగా కనుకొలకుల్లోకి జారింది. "చెవులకి ముక్కు

ఎదురుచూసినది

లకి కన్నాలు పొడిపించుకోవటమేమిటని తను క్లాస్ మేట్స్‌ని వేళాకోళం చేయటం గుర్తువచ్చింది రాజేశ్వరికి. ఇప్పుడు మెడలో నెక్లెస్ వేసుకోవాలని, చేతులకి రంగురంగుల గాజులు వేసుకోవాలని తల బరువుగా పూలు పెట్టుకోవాలని కోరిక సన్నగా కాటు వేస్తోంది. తను ఇవేళ అమ్మని వాటికోసం అడగలేదు. ఇప్పుడు తను వేసుకున్న బంగారు గాజులజత, ఒంటిపేటగొలుసు, జడలో గులాబీలజంట తన అభిమానాన్ని ఆక్షేపిస్తున్నాయి.

* ౨ *

ఆరోజు రాజేశ్వరి పుట్టినరోజు. ఇంటికి వచ్చింది. తలంటిపోసుకుని కొత్తచీర కట్టుకుంది. ఉష కాలేజీకి వెళ్ళింది. తల్లి పిండివంట చేస్తోంది. రాజేశ్వరి మేడగదిలో ఒంటరిగావుంది కిటికీదగ్గర నిలబడి ఆకాశంలోకి చూస్తోంది. "ఆకాశంలో మేఘాలు కదిలిపోతున్నట్లే తన జీవితంలో సంవత్సరాలు దొర్లిపోతున్నాయి. తను దేనికోసమో ఎదురు చూస్తోంది. తనకది దూరమైపోతున్నట్లు ఆవేదన అధికమౌతోంది. జీవితంలో వానలేదు, ఎండలేదు. అన్నీ మబ్బులు, మబ్బులు... తను ఎదురుచూస్తున్నది ఏమిటి?..." కేశవ్ ఆగదిలోకి వచ్చేదాకా రాజేశ్వరి ఆలోచనలలో చలనరహితంగా అక్కడే నిలబడివుంది.

"రా మామయ్యా" అంది కేశవ్‌ని చూసి. కేశవ్ ఒక కుర్చీని రాజేశ్వరి సమీపంలోకి లాక్కుని కూర్చున్నాడు.

"ఇంకా దిగులుగానే కనిపిస్తున్నావ్ రాజీ. ఆసంబంధం కుదరలేదని నీకుబాధగా ఉన్నట్లుంది" అన్నాడు తలపైకెత్తిచూస్తూ.

"కట్నాలు, లాంఛనాల దగ్గర భేదం వచ్చిందికాదు మామయ్యా. అమ్మాయి నచ్చలేదన్నారుట" జాలిగా, సన్నగా నవ్వింది రాజేశ్వరి.

"నువ్వు దిగులుపడకు రాజీ. ఈ కారణంగా నువ్వు దిగులుపడటం అనవసరం. "ఏదో వాళ్ళు రమ్మన్నారని చూడడానికి వెళ్ళాం. పెళ్ళిచూపులకికూడా నర్సులాగే తయారయింది. మా అమ్మకి నచ్చలేదు. మనిషిలో చలాకీతనం, హుషారు కనిపించవు. మొగరాయుడులా ఉంటుంది. ఆ అమ్మాయి నాకు చాలారోజులనుంచీ తెలుసు. కాబోయే భార్యలో మనం కోరుకునేది ఈ లక్షణాలు కాదుకదా" అన్నాడుట శంకర్‌తో. దీనిని బట్టి నువ్వు అతడని అర్థంచేసుకుంటావని చెప్తున్నాను నిన్ను బాధపెట్టాలనికాదు" అన్నాడు. రాజేశ్వరిముఖం జేవురించింది. కళ్ళు ఆర్ద్రాలవుతుంటే ముఖాన్ని పక్కకు తిప్పుకుంది.

"అతనిలో బలహీనతలన్నింటినీ సహిద్దా

మనే అనుకున్నాను. నాపట్ల అతను ఇంత అభిమానంగా ఉంటాడని నేను ఎప్పుడూ ఊహించలేదు" అంది.

"శంకరం గారింటికి వెళ్లినప్పుడు ప్రసాద్ తల్లి గోలపెడుతుందిట ఇతనితో. తండ్రి పోయినప్పటినుంచి డబ్బు వ్యవహారాలన్నీ ఇతనే చూస్తున్నాడు. తన సరదాలకు విచ్చలవిడిగా ఖర్చుపెట్టుకుని తల్లి ఏమి అడిగినా వినిపించుకోడుట. అతని స్వభావం నాకు నచ్చలేదు రాజీ. ఇప్పుడు చెప్పినా నీకు నామీద కోపంరాదుకదూ" అన్నాడు నవ్వుతూ. రాజేశ్వరి తల అడ్డంగా వూపుతూ 'లేదం'ది. ఆమె మనసులో భారం తగ్గినట్లు ఒకసారి గట్టిగా ఊపిరి పీల్చి వదిలింది. అతనికి ఫలహారం తెచ్చిపెట్టింది.

ఫలహారం తినటం అయ్యాక "ఈసారి నీ పుట్టినరోజుకి నేను ఏమి తెచ్చానో తెలుసా?" అన్నాడు కేశవ్ పాంట్ జేబులో చెయ్యిపెడుతూ. రాజేశ్వరికి పుట్టినరోజు నాడు ఒక పుస్తకమేదైనా ఇవ్వటం అతనికి అలవాటు. కాని ఈసారి అతడు ఫాన్సీ షాపులో అమ్మే ముత్యాల గుద్దులు తెచ్చాడు. వాటి ఖరీదు ఏ రెండు రూపాయలో ఉంటుంది. అంతే. రాజేశ్వరిలో ఆ క్షణంలో ఆశ్చర్యం, దానివెంట సిగ్గు కలిగాయి.

"నా కెందుకు ఫ్యాషన్లు, అవి" అంది అతడి కళ్లలోకి చూస్తూ.

"ప్రపంచంలో ఇన్ని మార్పులు వచ్చాయి కాని స్త్రీ ప్రకృతిలో మార్పు రాలేదు" అన్నాడు కేశవ్ నవ్వుతూ. తన చేతిలో ఆ వస్తువుల్ని పరీక్షిస్తూ మళ్లీ నవ్వాడు.

"నీ మాట నిజమేనా?" అని ప్రశ్నిస్తున్నట్లుందా నవ్వు. "నాదగ్గర నువ్వు ఏమీ దాగలేవు" అన్నట్లుందతని నవ్వు. కేశవ్ హఠాత్తుగా నవ్వు ఆపి,

"నువ్వు ఇదివరకు రాజువు కావు, రాజీ" అన్నాడు కళ్లెత్తి చూస్తూ. రాజేశ్వరి మెల్లగా కనులు వాల్చి అతడి చేతిలోని వస్తువుల్ని తీసుకుంది.

"నాకు పట్టవేమో!" అంటూనే చెవులకు గట్టిగా గుచ్చింది. వాటికి సన్నటి కాడలు ఉండటంవలన తేలికగా చెవిలోకి దిగింది. రెండు చెవులకీ పెట్టుకున్నాక చెంపలకి రెండు చేతుల్నీ చేర్చుకుని కేశవ్ వైపు నవ్వుతూ చూస్తూ కూర్చుంది.

"బాగున్నాయి" అన్నాడు కేశవ్ తన వాలు కుర్చీలో వెనకకి చేరబడి.

"ఆ రోజు నీవన్న మాటలు గుర్తున్నాయా? నిజమే. జీవితాన్ని అర్థంచేసుకుంటుంటే సముద్రంలో కొట్టుకుపోతున్నట్లు, శూన్యంలో ఈదుతున్నట్లు తుఫానులో చిక్కుకున్నట్లు ఉంటుంది. జీవితంలో గమ్యమేమిటో తెలియకుండా నిర్ణయాలు చేసుకుని పొరపాట్లు చేయటం ఆ వయసులోనే సంభవిస్తుంది. జీవితం చాలా పరిమితమైంది. కనుకనే ఆశయాలతో, సిద్ధాంతాలతో దానిని సుందరతరంగా మలచుకోవాలి. ఈ కృషిలోనే తృప్తి, ఆనందం లభిస్తాయి. పొరపాట్లు దిద్దుకోగల అవకాశం జీవితంలో దొరకటం కష్టం. అవసానదశలో, మానవుడికి మిగలవలసినది తృప్తితోకూడిన ఆనందం. ఆనందమనేది ఆవేశంలో, తేలికగా లభ్యమయ్యే వస్తువు కాదు. కష్టసాధ్యమైనది. అంతేకాదు, ఒకరి కష్టసుఖాలలో ఇంకొకరికి పాలుఉంది. ఎవరి కష్టసుఖాలు వారివే అనుకుని మానవుడు బ్రతుకలేడు. సహజంగా సానుభూతి అనేది మనస్సులో ఉంది" అని కుర్చీలోనుంచి లేస్తూ "నీకు దిగులు పెట్టుకోవలసిన కారణాలు ఏమీ లేవు. చక్కగా చదువుకో" అని వెళ్ళిపోయాడు.

తరువాతకూడా రాజేశ్వరి అక్కడనుంచి కదలలేదు. అమ్మకూడా గుర్తించలేని తనలోని మార్పు, దిగులికి కారణం మామయ్య తెలుసుకున్నాడు. ప్రసాదంటే మామయ్యకి ఇష్టంలేదు. తన చేష్టలమీద ఒకకన్ను వేసే ఉంచాడు. ప్రసాద్ ప్రవర్తనని ఎంత నిశితంగా పరిశీలించాడు! తనేదో వ్యామోహంలోపడి మామయ్య చెప్పినవిషయాలను విమర్శించలేకపోయింది. తను ఎవరిని పెళ్ళి చేసుకుంటే మామయ్యకేమిటి? నామీద ఎందుకతనికంత వాత్సల్యం? ఇదివరకటి మామయ్యేనా ఈమామయ్య. నువ్వు పూర్వపు రాజువు కావు రాజీ అన్నాడు. అతడు నాలో కొత్తగా మొలకెత్తుతున్న కోరికల్ని స్త్రీ సహజమైన వాంఛల్ని గుర్తించాడన్న మాట. ఇదివరకు ఎప్పుడూ నేను మామయ్యని ఈలాగ అర్థం చేసుకోలేదు" అనుకుంది.

గదిలోకి చీకట్లు వస్తున్నాయి. అప్పుడు లేచి లైటువేసి ఉత్తరం వ్రాయటం మొదలు పెట్టింది.

"నువ్వు ఇదివరకు లాగ ఒక స్నేహితుడివిగా కాక కొత్తరకంగా అర్థమయ్యావు మామయ్యా. నీకు నామీద ఎంత వాత్సల్యం! కాని నాకు ఇప్పుడు పూర్తిగా పరిణతిపొందే యువతి మనసుంది. అబ్బాయివేషాలు వేసే అల్లరి పిల్లలాగ కాదు. కనుక నా మనసులో అంతా నువ్వే నిండిపోయావు. నేను ఆవేశంలో వ్రాయటంలేదు. నీవు నన్ను అర్థం చేసుకున్నావు. నువ్వు వెళ్లాక రెండుగంటల వరకూ నేను ఆ కుర్చీలోంచి లేవ లేకపోయాను. నేను నిన్ను అర్థం చేసుకోవటం ఆశ్చర్యం, సంభ్రమం కలిగించింది. ఒకరు నా మనసులో నిండిపోవటం ఇంత ఆనందాన్ని, తృప్తిని కలిగిస్తుందా! ఇంత బలాన్ని ఇస్తుందా? నామీద నీకింత వాత్సల్యం, అభిమానం ఉన్నాయని నేను ఊహించలేదు, ఈ క్షణంవరకూ. అది తెలిశాక నేనెంత అదృష్టవంతురాలనో అర్థమయింది. నాకింక దిగులు లేదు, మామయ్యా. నేను మెడిసిన్ పూర్తిచేస్తాను.

నీ
రాజీ

★

కథ కాని కథ

పెళ్లితో చెంబు

(మొదటి బహుమతి రు 10)

మా ఊరికి దగ్గర గ్రామంలో ఒక పోతు బతుకున్నాడు. కట్నాల పిచ్చి ఎక్కువైనందున కట్నాలరాయుడనే వారతన్ని. ఆయన కోర్కెల కంతూ, పంతూ లేదు. ఒక రోజు మా ఊరినుండి సుబ్బారావుగారనే వారు ఈ కట్నాలరాయుడి వద్దకు పెళ్ళి మాటలకు వెళ్లారు. ఇక ఆ కట్నాలరాయుడు "మా అబ్బాయికి పదివేలు నగదు, రేడియో, రిష్టువాచి, సైకిలు" ఇలా వరుసగా వర్ణించ సాగాడు. అన్నీ విని "మీ లాంఛనాలన్నీ తీరుస్తారు అభ్యంతరంలేదు, కాని పిల నిచ్చినవారికి మీరు ఒక లాంఛనం జరపా"లన్నారు సుబ్బారావుగారు. అదేమిటని ఆశ్చర్యంగా అడిగాడు కట్నాలరాయుడు. "అబ్బే! అంత పెద్ద లాంఛనం కాదు, చాలా స్వల్పం, మీ కోర్కెలన్నీ తీర్చేసరికి ఆయన యావదాస్తీ హరించిపోతుంది. కావున తమరు మీ వియ్యంకునకు 3 శేర్లు పట్టే క్రొత్త చెంబు (రాగిదయితే శ్రేష్ఠం) లాంఛనం రూపంగా ఇప్పిస్తే యాయవారం చేసుకొని కుటుంబాన్ని పోషించుకుంటా"డనే సరికి నిలువునా నీరైపోయాడు కట్నాలరాయుడు.

వి. ఎ. ఎస్. శర్మ (టెక్కలి)

* * *

అలారం గొడవ

(రెండవ బహుమతి రు. 5 లు)

మా బాబిగానిది చాల మొద్దునిద్ర. నిద్రపోయాడంటే బ్రహ్మదేవుడైనా వానిని నిద్రనుండి లేపలేడు. ఆరోజు ఆదివారము. సోమవారము ఎనిమిదింటికి వానికి ఇంగ్లీషుపరీక్ష. తలనొప్పిగావుందని ఆరోజురాత్రి తొమ్మిదింటికే పడుకున్నాడు. అలారమ్ నాలుగింటికి పెట్టి, టైమ్‌పీస్ టేబుల్‌పైనుంచి నిద్రపోయాడు. తెల్లవారి నాలుగింటికి అలారమ్ కొట్టింది. పరీక్ష భయముచేత కాబోలు ఆరోజు అలారమ్ కొడుతూనే లేచి కూర్చున్నాడు. నిద్రమత్తు పూర్తిగా వదలలేదు. లేస్తూనే ప్రక్కనే పడుకొని నిద్రపోతున్న మానాన్నగారి ముక్కు పట్టుకొని గట్టిగ అదిమేశాడు. మానాన్న కోపంతో కేకలేస్తూ లేచారు. కేకలు వింటూనే వానికి ఆ మత్తుకాస్తా వదిలిపోయింది. మా నాన్న ఎందుకురా ముక్కుపట్టుకున్నావని అడిగితే, "టైమ్‌పీస్ ఎక్కడ పెట్టిందీ జ్ఞాపకములేదు నాన్నా. మీ తలను చూచి టైమ్‌పీస అనుకుని అలారమ్ ఆఫ్ చేయబోయి మీముక్కు పట్టుకున్నా"నని భయంతో చెప్పాడు. మానాన్న కోపంతో తిట్టున్నా నాకు నవ్వాగిందికాదు.

బి. పి. కుమారి (తిరుపతి)

* * *

గజం కాఫీ

(రెండవ బహుమతి రు. 5 లు)

మేము ఢిల్లీలో ఉంటుండగా మా అన్న స్నేహితులు, వారి భార్యలు మా ఇంటికి తరచు వచ్చేవారు. ఆడవారంతా మా వదిన స్నేహితురాండ్రు. అందులో ఒకామె పంజాబీ. ఆమె మా వదిన డియరెస్టు ఫ్రెండు. వారు మా ఇంటికి మొదటవస్తే మేము కాఫీ ఇస్తే "ఇది చేదుగా ఉంటుంది, మా కిష్టం లే"దనే వారు. మా వదిన వారికి బాగా కాఫీ అలవాటు చేసింది. రానురాను వారు మా ఇంటికి వస్తే మాకు కాఫీ ఇవ్వండి యని అడిగే వారు. ఆ ఊరి వారందరికీ వాళ్ళకేది కావాలన్నా మొగమాటం లేకుండా ఎదురుగానే అడిగి తింటారు, త్రాగుతారు. ఒకమారు వీరిద్దరు (అంటే భార్య, భర్త) మద్రాసుకు పోయినారు. ఆయన ఏదో పనిమీద పోతూవుంటే ఈమె కూడా వెళ్ళింది. అక్కడి వింతలు—విశేషాలు చూచి చివరకొక హోటలుకు పోయినారు. కాఫీకి ఆర్డరిచ్చినారు. వీరికి అరవం రాదు. హోటల్ బాయ్‌కి హిందీరాదు. వాడు ఎట్లో ఏమి కావాలని అడిగితే కాఫీ అని జవాబిచ్చిందీమె. వాడు "కిత్ నా" (ఎంత?) అని అడిగితే ఈమెకు ఏమి చెప్పేందుకు తెలియక "ఏక్ గజ్" (ఒక గజం) టకీమని అడిగింది. వీనికా తెలియదు. అక్కడకు టిఫిన్ తినేందుకు వచ్చినారు, హిందీ తెలిసినవారు ఆమెను ఎందుకట్లా అడిగినావని, ఒక గజం అనకూడదు ఒక కప్పు అనవలెనని చెప్పగా ఆమె మీరు కాఫీని ఒక గజం పైకెత్తి వేరే కప్పులో పోస్తారు. అందుకని అట్లా అడిగినానని చెప్పింది. ఆమె తిరిగి ఢిల్లీ వచ్చిన తర్వాత మాకు ఈ విషయం చెప్పితే మేము కడుపుబ్బనవ్వి "అది చల్లార్చేందుకు ఒక కప్పునుంచి వేరే కప్పులో పైకెత్తి పోస్తా"రని చెప్పితే ఆమె మాతో కూడ శ్రుతి కలిపి నవ్వింది.

ఇందిర (తిరుపతి)

* * *

గడ్డాలు, మీసాల వ్యాపారం

(రెండవ బహుమతి రు. 5 లు)

ఆరోజు ఆదివారం అవటంవల్ల మా మిత్రబృందంఅంతా పబ్లిక్ గార్డెన్సుకి వెళ్లాం. ప్రశాంతంగా ఉంటుందని రోస్ గార్డెనులో కూర్చున్నాం. మాసింగు హాస్యాలజీపుటలు విప్పుతూ లెక్చరిస్తున్నాడు. మా మెడికల్ కాలేజి జీవితాల్లోనిగొప్పతనంగూర్చివున్నవి, లేనివి కలిపి కొడుతున్నాడు. తక్కినవాళ్ళం దగు శ్రద్ధగా వింటున్నారు. నాకు విసుగుపుట్టి అటూఇటూ చూస్తున్నాను. మాకు కొంచెం దూరంలో ఒక తెలుగాయన పెద్దచుట్ట కాలుస్తూ పత్రిక చదువుతున్నాడు. ఆయన చుట్ట కాలవటం నన్నాకర్షించింది. అటే చూస్తున్నాను. ఇంతలో ఎవరో వ్యక్తి నల్లగుడ్డలో గడ్డాలు మీసాలో సైకిల్ మీదపోతూ ఆ తెలుగాయన దగ్గర ఆగి వేగంగా సైకిలుదిగి బోర్లించి కైజారు తీశాడు. నాకు షాకు తగిలినట్టయింది. వెంటనే అరిచి అటుపరిగెత్తాను. మావాళ్ళందరు నన్ను అనుసరించారు. గబగబా అటు పరుగెత్తి ఆదుర్మార్గుడిచెయ్యి గట్టిగా పట్టుకున్నాను. కొంచెం ఆలస్యం అయితే... అబ్బా..! అనిపించింది. ఆ తెలుగాయన నిశ్చేష్టుడై చూస్తున్నాడు: చుట్ట జారిపోయింది. ఆహంగామాకు కారణమైన ఆయన నా చెయ్యి విదిల్చి నవ్వుతూ, గడ్డం, మీసం లాగేసి ఆ తెలుగాయనవైపుతిరిగి "చూశారా సార్, గడ్డం, మీసంమజాకా, మీకు గడ్డం మీసం లేకపోయినా, ఇవి పెట్టుకుంటే అందరూ నిజమైనవనుకుంటారు. వెల 8 అణాలే" అంటూ సైకిల్‌కి తగిల్చివున్న గడ్డాలు మీసాల సంచీతీశాడు. "మాకందరికీ సంగతి అర్థమైంది. విపరీతమైననవ్వువచ్చింది. ఆరోజు ఆగడ్డాల వ్యాపారికి, అతని నటనకు ప్రశంసలు, పైసలు బాగా దొరికాయి.

సి. మురం. (హైదరాబాదు)

★



(గత వారం తరువాయి)

తర్వాత కొలరోజులవరకూ ఆ విషయాలే మరిచిపోయాను. సమయానికి సిమెంటు రాలేదు. అందువల్ల పని ఆగిపోయింది. ఇద్దరూ సూపర్ వైజర్లు పరిస్థితిని గమనించడానికి వచ్చారు. బృహత్తర ప్రయత్నంతో మళ్లీ కొంతవరకు పని సజావుగా సాగనారంభించింది. ఓ రోజు ముసిల్ది కనిపించి. "పంకజం తేరుకొంది బాబూ!" అని చెప్పిన జ్ఞాపకం మాత్రం ఉంది.

సింగు పిల్లల్ని చూడడానికని 15 రోజులు సెలవుపెట్టి మధ్యప్రదేశ్ కు వెళ్లాడు—ఇక నా కెవరూ తోడు మిగల్లేదు. నన్ను అర్థంచేసుకుని సాధక బాధకాలు గమనించేవారు డిపార్టుమెంటులో ఎవరూ లేకపోవడంతో రెండు నెలలు ఇక్కడ ఉండాల్సిన గడువు యింకా ఎక్కువయే ప్రమాదాలు కనిపించాయి.

ఒకరోజు మరీ చీకటిపడ్డాక విజయవాడ జీపులో వెళ్లి తిరిగి వచ్చేసరికి మేడమెట్ల మీద కుంచుకపోయి పంకజం పడుకొని వుంది. పువ్వుల్లో రాళ్లు విరిచిన బొమ్మను కొలను విసురుగా పడేస్తే ఎలా వుంటుంది-? అలా-

రోగం పెద్దది కాకపోయినా పంకజం ముఖంలో ఎరుపును మింగేసింది. నుదుటికి పెట్టుకున్న పెద్దబొట్టు నిద్రమత్తులో చేతికి రాసుకు ముఖమంతా పాకింది – నిద్రలో నే పెదాల్ని తడిచేసుకుంటోంది.

తట్టిలేపితే తుళ్లిపడింది– ఎవరో కొత్త వ్యక్తిని చూస్తున్నట్టు వింతపడుతోంది– ఒక్కసారిచుటూ గమనించి నావేపే తీక్షణంగా చూస్తోంది. దీపప్పు నీడలో కళ్లల్లో

ఆకలి పూర్తిగా అర్థం కావడంలేదు. ఆశ్చర్యమేమో?-ముఖం దీపంవేపు తిప్పబోతే కొయ్యిలీసి ముఖం తప్పించుకుంది. అంతలో మెల్లదగ్గర గోడకి చేరబడి వింటోంది.

నాకు విసుగేసింది.

మాటలుగాని తనకు కన్నీటని ఆయుధంగా చేసుకున్నదేమోననిపించింది. నిశ్శబ్దం కొంగతనానికి చిహ్నం - ఆ కళ్ళల్లో అమాయకత్వం - చూపులో జాలి - తప్పిస్తే పంకజంలో నమ్మకం కలగడానికింకే కారణమూ కనిపించదు.

కుర్చీలో కూర్చుంటే విపరీతంగా తలనొప్పి ప్రారంభమయింది. మరో పావుగంటకు పంకజం భోజనం తీసుకు వచ్చింది. ఇప్పుడికి విశేషంలేదు. బల్లమీద భోజనం ఉంచి బొల్కనీ గోడకి ఆనుకుని కూచొంది.

నిశీథి నిశ్శబ్దాన్ని ఏదో కొత్త ప్రపంచం నుంచి దానిడానికి రహస్యంగా కప్పిన తెరలావుంది ఆకాశం - పంకజం అటువేపు కళ్ళు తిప్పితే - ఆకాశం నలుపు కళ్ళల్లో ప్రతిబింబం చూసుకొంది. ఏడుస్తుందేమోనని ఎదురుగా వచ్చి నిలబడ్డాను. ఇందాక ఆమె కన్నీటిపై విసుగుదలను బాగా అర్థం చేసుకున్నట్టుంది. చిన్నగా నవ్వింది. ఉత్సాహంకాదు, తృప్తికాదు - దుఃఖాన్ని దాచుకొంటూ. అసహాయతకు 'ఒప్పు' రంగువేసి నప్పుట ప్రయత్నం ఆ నవ్వులో - అదీ ఆ నవ్వుకి అర్థం.

"ఎందు కేడుస్తా?" అనడిగాను-

నా ముఖంలోకి చూస్తోంది. నాకు అర్థమయేట్టు చెప్పగలనా అని ఆలోచిస్తోందేమో?-తడబాటు, సందిగ్ధం- ఏదో చెప్పబోయి చెప్పలేనిప్రయత్నం - భయంతో రొమ్ము ఎగిరిపడే బిడియం - ఏదో వింత శక్తిని చూస్తున్నట్టు - అలాగే నిలబడిపోయేను-

అంతలో లేచి - నాకళ్ళను తప్పించుకొని భోజనం పళ్లెం తీసుకొచ్చి నాముందుంచింది.

భోజనం ముగించేవరకూ అలా నే కూచుంది.

భోజనం ముగిస్తే వెళిపోతుందేమో నన్న లోభత్వంతో గంటలకొద్దీ నిశ్శబ్దంగా ఉండిపోయాను.

బయట సన్నగా చినుకులు ప్రారంభమయాయి - ఆమె అలాగే నా వేపు చూస్తుంది.

నాకు మాట్లాడడం తెలీదు.

అంతే-!

* * *

సింగు వచ్చాడు. మధ్యప్రదేశ్ నుంచి విచిత్రమైన పళ్లు తీసుకొచ్చేడు. "ఎట్లావుంది, యిక్కడి బ్రతుకు?" అంటాడు నవ్వుతూ.

"మనస్సేం బావుండడం లేదు—విజయవాడే నయమేమో ననిపిస్తుంది—మరీ ఎక్కువ విశ్రాంతి లభిస్తే ఏం చెయ్యాలో తెలీదు. ఎక్కువ సంతోషం నుంచి దుఃఖంలాగా, పూర్తి విశ్రాంతిలోంచి భయం, పిరికితనం పుట్టుందేమో" అన్నా.

ఇవన్నీ అర్థం చేసుకోడు సింగు.

"స్త్రీలు మాట్లాడకుండానే చాలా విషయాల్ని చెప్పగలరు భయ్యా—వాళ్ళకళ్లకి సరయిన అర్థం చెప్పగల డిక్షనరీ నీ దగ్గర వుండాలి. అదీ రహస్యం"—అని, భుజం తట్టాడు. ఎవర్ని ఉద్దేశించి అంటున్నాడో తెలీక తెల్లబోయేను. నవ్వేడు సింగు. అంతే. మరింకేమీ చెప్పలేదు.

తర్వాత పది రోజులకు అనుకొంటాను—యీ సంఘటన జరిగింది.

అంతవరకూ మళ్ళీ మాణిక్యాన్ని కలవలేదు. దాదాపు ఆలోచనలే మరిచిపోయేను.

కాని ఓ రోజు ప్లాంటుదగ్గరనుంచి జీప్‌లో వస్తున్నా, నూ. జాన్ ఏదోమాట్లాడుతున్నాడు. వీలయితే తనకు కొండపల్లిలో నే ఉండిపోవాలనుందిట. "గవర్నమెంటు ఉద్యోగులందరినీ ఇక్కడ రెండునెలలు వుంచి పంపాలండీ —ప్రతివాడూ ఒక వేదాంతో, కవో అయిపోతాడు" అంటున్నాడు.

రాతిమీద కర్రలమోపు దించి అలసట తీర్చుకుంటున్న పంకజం కన్పించింది—జాన్ చూశాడు. "కర్రలు మోయడం, నీళ్లు తోడడం, మొదలయిన కొన్ని ప్రత్యేకమైన పనులను దేవుడు స్త్రీలకే ప్రత్యేకించాడు సార్. ఆసమయాల్లో వాళ్ళు మరీ అందంగా కనిపిస్తారు— చూడండి కావలిస్తే."

పళ్ళు బిగపట్టి కాలిలో ముల్లు తీసుకొంటోంది రాతికి ఆనుకుని. పసుపుపచ్చటి చీర మరీ తేలికయి తెరచాప కట్టినట్టు నడుక్కి ఊగుతోంది. శరీరం వంపులన్నీ సాయంకాలపు నీడల్లో కలిసిపోయి, కుంచె గీసిన రేఖల్లా కన్పిస్తున్నాయి

"ఒక్కసారి జీపు ఆపు."

"ఎందుకు సార్?—కట్టెల్ని మోయనివ్వకుండా చేయడంలో మనం ప్రపంచానికి చాలా ద్రోహం చేస్తున్నా మన్నమాట. ఇంకా ఆ అందాన్ని దారిలో చాలాకోణాల్లో చాలామంది చూడవలసి వుంది"—తన మాటలకి తానే విరగబడి నవ్వుకుంటున్నాడు జాన్. ఒక్క కుదుపుతో జీప్ ఆగిపోయింది. వెనక్కి చేరబడి స్టీరింగుమీద తల ఆనించాడు.

జీప్ దిగి రాయిదగ్గరికి నడిచేను. ముల్లు తీసిన చోటునుంచి పంకజం కాలిలో రక్తం వస్తోంది. నోటిలో ఉమ్మి తీసి తడిచేసి ఇసిక పోస్తోంది. నన్ను చూసి లేచి నిలబడబోయి పక్కని పారేసిన ముళ్ళ కొమ్మమీద మళ్ళీ కాలేసింది. బాధతో తూలి పడబోయి భుజం మీద చెయ్యేసింది. ఈసారి రెండు చోట్ల ముళ్ళు గుచ్చుకున్నాయి.

నా పక్క చూడడంలేదు. చుట్టూ గమనిస్తోంది. జాన్ జీప్‌ను 20 గజాలు ముందుకు పోనిచ్చాడు.



—ఎస్. రఘురామరావు (విల్లివాకం)

నేను వచ్చినప్పటి కంటె ఇప్పుడు మరీ నిశ్శబ్దంగా ఉండడం అలవాటు చేసుకుంది.

"నేను యిక్కడినుంచి వెళిపోతున్నాను" —సూచించాను.

ఆశ్చర్యంతో చూస్తోంది. "ఎప్పుడు" అని అడగలేదు. ఆశ్చర్యం తప్ప, యింకే భావమూ కన్పించదు.

ఏదో అసంతృప్తిగా వుంది—. "నువ్వు నాతో తిరుగుతున్నావని లేకపోతే నేను నీతో తిరుగుతున్నానని అందరూ అనుకొంటున్నారు" అని చెప్పడం నా ఉద్దేశం. కొన్ని క్షణాలు నాలో నేనే సంజాటనపడి చెప్పబోయేను. ఇంకేదో విధంగా అర్థం చేసుకున్నట్టుంది. గుండెమీద రెండుచేతులూ గట్టిగా ఆనించుకుని "నేనురాను" అని

నిదురపోయే సెలయేరు

నూచిస్తోంది. నాకు నవ్వొచ్చింది. పక్కన నవ్వేశాను. విచిత్రంగా చూస్తోంది. నిలబడి రాయికి అనుకోబోతే చెయ్యి పట్టుకు కూర్చోపెట్టాను.

అంత దగ్గరగా పంకజాన్ని చూడడం రెండవసారి. కుడివేపు నుదుటిమీద మచ్చ ఎప్పుడూ చూడలేదు నేను—

కొంతసేపు నిశ్శబ్దంగా కూర్చొని లేవబోతూ పంకజాన్ని చూశాను—మళ్లీ ఏడుస్తున్నదేమో ననిపించింది. బుజం మీద చెయ్యేసి కదిపితే నవ్వేసింది—ముఖం కప్పుకొంటుంది. తలమీంచి బుజంమీదకు నీరసంగా వాలిన అడివిపువ్వులు, చల్లగా చేతిని కొరుకుతున్నాయి. తలమీద చెయ్యి వేస్తే ఆ చల్లదనం వొళ్లంతా పాకింది. అంతకు మించి నీలిరంగు రవిక బరువూ,— పెదాల వొణుకూ, ఆశ్చర్యం— ఒక్కసారి పంకజాన్ని కౌగలించుకోవాలనిపించింది.

కాని పిరికితనం—

జాన్ దూరంగా హారన్ మోగిస్తున్నాడు.

వెళ్తున్నానని కూడా చెప్పకుండా జీప్ వేపు నడిచాను. జీప్ లో కూచున్నాక వెనక్కి చూస్తే, దుఃఖంతో మెత్తబడిన కళ్లను అట్లాగే సాయంకాలం మసక చీకటిలోకి జొనిపి మావేపు చూస్తూ కన్పించింది పంకజం— మనస్సంతా ఆర్ద్రతతో, పంకజం మీది తెలీని సానుభూతితో వణికింది.

నేను దిగులుగా కూచోవడం గమనించి— "అంతేనండి—ఆడవాళ్లతో మాటాడడాన్ని ఊహించుకోవాలే గాని వాళ్లతో మాట్లాడకూడదు. అందువల్లనే కథల్లో ఆడవాళ్లూ, కలల్లో ఆడవాళ్లూ బావుంటారు— ఇక పంకజమా! ఉఫ్!—హెచ్చు ఆలోచించకండి సార్—అది కొండపల్లి ఆటబొమ్మ"—

అని ఎక్సిలరేటర్ నొక్కాడు. జీప్ కుదుపులను సహిస్తూ ఆలోచనలకు తావివ్వని శబ్దంతో మా శరీరాలను లాక్కుపోతోంది.

30 గజాలు నడిచిందో లేదో ఎవరో జీప్ని ఆపమని అరుస్తున్నారు.

జాన్ భయపడ్డాడు మొదట. జోరుగా హారన్ మోగించాడు. కాని జీప్ ముందున్న వ్యక్తి తప్పుకోవడంలేదు. చివరికి యిక తప్పనిసరిగా ఆపేశాడు.

ముందు లైటులో మాణిక్యాన్ని గుర్తుపట్టాను నేను, బుజంమీద నల్లగళ్ల తువాలు, జబ్బలకు వెండి తావీజు, చేతిలో పొట్టికర్రా —మరో చేతిలో సగంవిరిగిన సీసా—

జీప్లోంచి దిగాలనిపించ లేదు నాకు. జాన్మాత్రం సర్దుకున్నాడు. మాణిక్యం దగ్గరికివచ్చి లోపలికి వంగితే కల్లు వాసన గుప్పుమంది.

"ఒరే కిందకిదిగు" అన్నాడు నన్ను చూసి.

"ఎందుకు" అందామంటే గొంతు విడడం లేదు.

ఇంకా తటపటాయిస్తే చెయ్యి పుచ్చుకొన్నాడు. చెమటతో, మట్టితో తడిసిన చెయ్యికింద నా వేళ్లనరాలు బలహీనంగా వణుకుతున్నాయి.

"చెయ్యివదులు. దిగుతాను."

దిగాక—మాణిక్యం ఏదో మాట్లాడబోయి, శరీరం తూలిపాటును ఆపుకోలేక బండని ఆనుకు నిలబడ్డాడు.

"ఒరే, నిన్ను దానితో మాట్లాడొద్దని చెప్పానా?"

"ఎవరితో?"

"నోర్ముయ్-ఎవరితోనో నీకు తెలీదూ?- సీసా పగిలిపోయింది—లేకపోతే నిన్ను చంపేసేవాడినే?"—

"ఎందుకూ చంపడం?"

"చస్, మాట్లాడేవా, లేదా చెప్పు"—

"ఆ అమ్మాయికీ, నీకూ ఏం సంబంధం?"

కర్రతో జీప్మీద బాదాడు. "అవన్నీ అడక్కు—స్స్. ఇదిగో, చెప్తున్నాను-రెండ్రోజుల్లో నువ్వు ఊరొదిలిపోవాలి - లేకపోతే బ్రతికుండగా గోరీ కట్టేస్తాను-నా బలంమీద నమ్మకం లేకపోతే ఊర్లో పదిమందిని అడుగు."

జాన్ ఏదో అల్లరి చెయ్యబోయి కొట్టడానికి కారు హాండిల్ తీయబోయాడు. అంతే - కన్నుమూసి తెరిచేలోపల చేతికర్రలోంచి పెద్దకత్తిని దూసాడు మాణిక్యం, అంతలో నిశ్శబ్దం వణికేలా నవ్వి "ఎవడీ పిచ్చిక?" అంటున్నాడు.

నాకు నిజంగానే భయమేసింది. మాణిక్యానికి కళ్లు మూతలు పడుతున్నాయి. ఇప్పట్లో మాట్లాడడం మంచిది కాదనుకున్నాను. "వదలండి - ఈ వెధవని ఒక్క దెబ్బతో చంపేస్తాను" అని అరుస్తున్నాడు. బలవంతంగా జీప్లోకి ఎక్కించాను—

మాణిక్యం రోడ్డుపక్క నిలబడి బూతులు తిడుతున్నాడు. జీప్ బయదేరుతూంటే లోపలికి తలవంచి "మరిచిపోకురోయ్— రెండ్రోజుల్లో దొబ్బెయ్యాలి" అంటున్నాడు—

"ఎవడండీ ఆ సాక్రంద్రల్—వదిలేస్తే హాండిల్తో పొడిచేద్దును"—

కాస్త ఆగి - "రేపు ఉదయం వెళ్లి సంగ

గారిని పిలుచుకురా జాన్!—ఎవరికీ యీ విషయం చెప్పకు" అన్నా.

"ఈ ముక్కకి మళ్లీ జయ మెందుకండీ—రేపు యిద్దర్నీ తీసుకొచ్చి వీడి ప్రాణం తోడేస్తాను"—

మాణిక్యం నన్ను తిట్టిన బూతుకంటె, అర్థం కాకుండా తెగనవక ఉండిపోయిన రహస్యాల సందిగ్ధత యింకా బాధపెడ్తోంది. మాణిక్యానికి పంకజాన్ని ఎట్లా తెలుసు?—పంకజం ఎప్పుడూ ఏడుస్తూంటుంది ఎందుకని?—ఇట్లాంటివి.

* * *

ఓ రోజు ఉదయాన్నే—(రెండు రోజుల తర్వాత అనుకుంటాను, సరిగా గుర్తులేదు)—తోటలో మాణిక్యంతో పంకజం తల్లి మాట్లాడుతూండగా చూశాను—[illegible] సిమెంటు బెంచీమీద కూచొని [illegible] గిస్తున్నాడు—ఏదో విసురుగా మాట్లాడుతూ, మధ్య మధ్య మేడ వేపు చూస్తున్నాడు.

మేడదిగి సరాసరిన తోటలోకి వచ్చాను. నన్ను చూసి పంకజంతల్లి తెబ్బకుతోంది.

"నమస్కారం సాబ్—" అంటున్నాడు మాణిక్యం నవ్వుతూ. నవ్వులో నిర్లక్ష్యం తెలుస్తూ వుంది.

వినిపించుకోలేదు నేను—"ఎవరువీడు?" అన్నాను పంకజం తల్లితో.

"నీకెందుకయ్యా, అది?" అన్నాడు మాణిక్యం.

"నువ్వు మాటాడకురా" అని అదిలిస్తోంది—

నాకు విసుగేసింది "ఇట్లాంటి వేషాలేవీ నాకు పనికిరావు. పోలీసులకి రిపోర్టు నిన్ననే పంపించాను. రేపటికి వస్తారు. ఇద్దరూ పోలీసుస్టేషన్లో జవాబులు చెప్పుకోండి" అని వచ్చేశాను.

అన్నానేకాని మాణిక్యం వాళ్ళకి దొరకడని ఎట్లాగూ తెలుసు... కొన్ని క్షణాలు గడిచాక, అట్లా అనడం నాకే ముప్పు అన్న విషయం హఠాత్తుగా స్ఫురణకు వచ్చింది.

మొత్తంమీద కొండపల్లి జీవితంమీద ఏవో దిగులు ముసుగు కప్పుకొన్నట్టనిపించింది. పంకజంతల్లోనున్న స్థిమితాన్ని యివ్వాలంటే జప్పుడు—ప్రతీవ్యక్తీ ఏదో ప్రశ్నయాన్ని దాస్తున్నట్టూ—దొంగతనంగా బ్రతుకుతున్నట్టూ అనిపించింది. ఆ దొంగతనం ఈ స్థలంలోనే ఉందేమో—పిచ్చివాళ్ళని చూసిన కొన్నేపటికి, ఎవరికి నిజంగా పిచ్చో అర్థంకానట్టు, కొన్నాళ్ళయేసరికి మనలోనే ఆ దొంగతనం ఉన్నదా అనిపించేట్టుంది పరిస్థితి. మనవరించి ఎవరూ ఆలోచించక పోవడంలోనూ తృప్తి ఉంది—అంధదృష్టిలో ఉంటూ బ్రతకగలగడం జీవితానికి పెద్దశిక్ష.

"భగవాన్! నాను నేను ఒక్కక్షణం బ్రతికే అవకాశం కల్పించు" అనుకోవడం ఎంతపోయి!

నాలుగురోజుల తరువాత పని ఎట్లా జరుగుతోందో చూడడానికి సింగువస్తే "యిక్కడ రోజులు గడపడం ఎంతదుర్భరంగా ఉందో వివరించాను.

"ఏం?" అన్నాడు ఆశ్చర్యపోతూ.

"ఇంతనిశ్శబ్దంగా—ఈ కొండలూ, చెట్లూ, సెలయేళ్ళూ, ఎంతసేపూ సంస్కారంలేని మనుషులతో గడపడం—రచనకు కూడా ఓమీడియమ్ కావాలేమో గాని—యింత గుండె బద్దలుచేసే శూన్యంమాత్రం కాదు—ఇక్కడ నాలాంటి వాళ్లుకాదు. ఋషులు తపస్సు చేసుకోడుకు బాగుంటుంది. ఇది ప్రశాంతత కాదు—భయంకరమైన ప్రళయం" అన్నా.

అదేం బోధపడలేదు సింగుకి.

"ఆ అమ్మాయి ఏదన్నా గొడవ చేసిందా?"

"ఏ అమ్మాయి!"

నవ్వేశాడు.

"ఆ దొంగవెధవకి భయపడుతున్నావల్లే వుందే!—అదంతా నేచూస్తాలే."

ఇంకా ఆశ్చర్యపోతున్న నా భుజంతట్టి "జాన్ నాకంతా చెప్పాడులే—నువ్వంటే వాడికి అభిమానమే" అన్నాడు మెల్లగా.

ఆతర్వాత ఇహా మరీ విసుగుపుట్టింది రోజులు గడపడానికి—పంకజం రావడం పూర్తిగా మానేసింది—ఆ నిర్లక్ష్యంతో నామీద ఏదో పగతీర్చుకొంటున్నట్టూ—నేను చేసిన పని తప్పని ఎత్తి చూపుతున్నట్టు కన్పించింది.

పోలీసుల భయంచూపి, ఏమీ చెయ్యలేక పోయిన నన్ను పరిహసిస్తున్నట్టుగా మేడ ముందు ఎలక్ట్రిక్ స్తంభానికి చేరబడి నిలబడేవాడు మాణిక్యం

పదిరోజులాగి "నన్ను బదిలీ చేస్తారా! రాజీనామా యిచ్చేదా?—యిక్కడ ఈమనుషులూ, వాతావరణం మధ్య నలిగిపోతున్నాను" అని ఉత్తరం రాశాను సింగుకి—

మరునాడే జవాబు వచ్చింది—"నీ కిష్టం లేకపోతే వచ్చేయ్—మనిషిని పంపుతాను. కాని కొండపల్లి పెద్ద అవకాశం, జీవితంలో పాఠం నేర్చుకోవడానికి"—అని వ్రాశాడు.

నాకు నవ్వొచ్చింది—నిజమే. పెద్ద పాఠం నేర్పడానికి అవకాశమే.

మర్నాడు మాణిక్యం స్తంభం దగ్గర నిల్వడితే లోపలికి పిలిచాను.

ఒక పిచ్చాసుపత్రి నుంచి యిద్దరు వ్యక్తులు పారిపోయి ఒక చోట కలుసుకొన్నారు.

ఒక వ్యక్తి: ఓరేయ్ నాబుర్ర ఎక్కడో జారిపోయిందిరా నీకు కనబడిందా!

రెండవ వ్యక్తి: నీ జేబుకు చిల్లుందేమో చూసుకోరా!

తాడూరి దుర్గాప్రసాద్
(తాడేపల్లిగూడెం)

వచ్చి "ఏం" అన్నాడు.

"రేపే వెళ్ళిపోతున్నాను"

నమ్మకంలేక విస్తుపోయి చూశాడు—

"అవును, నిజం"

"మంచిది సార్—మీరు చాలా తెలిసినవారు—అందుకనే నా చెయ్యికదల్లేదు—ఎప్పుడు వెళ్తారు?"

"రేపు ఉదయం"

నమస్కారంచేసి వెళ్ళిపోయాడు.

సాయంకాలం పంకజం కన్పిస్తుందేమోనని ఆ యిళ్ల వేపు ఒంటరిగా వెళ్ళాను. కనిపించలేదు. ముల్లుగుచ్చుకొన్న రాయి దగ్గర ఓగంట కూర్చొని వచ్చేశాను.

జాన్ కన్పిస్తే "పంకజం కన్పించిందా?" అని అడిగాను.

"లేదు సార్—వాళ్ళ బంధువుల దగ్గరికి—పక్క ఊరు పంపేసిందట వాళ్ల అమ్మ"

క్షణం విస్తుపోయేను.

"రేపు ఉదయమే వెళ్లిపోవాలి—నా ట్రంకు బట్టలు సర్దమను" అని చెప్పాను.

తెలతెలవారకుండానే వాకిట్లోకి వచ్చి కూచున్నాడు మాణిక్యం. నేను నిర్ఘాంతపోయేను. "సామాను రైలుకి చేరవేసేపనంతా నాకు వదిలెయ్యండి బాబూ. జీప్ స్టేషన్‌కు చేరేటికి పీటన్నిటితో అక్కడుంటాను—చెయ్యి సాయంకూడా తెచ్చుకున్నాను" అన్నాడు.

స్టేషన్లో—ఎదురుగ్గా సిమెంటు బెంచిని ఆనుకుని నిలబడ్డాడు మాణిక్యం చేతులుకట్టుకొని—జాన్ యింకా వాడిమీద కోపంతో కొరకొరా చూస్తూంటే నవ్వి దగిరికి వచ్చి భుజంమీద చెయ్యి వేసేడు "నీమీద నాకేం కోపం లేదురా—నీకోపంమీద మాత్రం కోపం వచ్చింది"—

రైలు కదుల్తూంటే కిటికీ దగ్గిరికి వచ్చేడు. "నేనేం చెప్ప ఎదవని కానండి—కానిమనిషినయిపోయేను"—అన్నాడు.

నేను నిర్ఘాంతపోయాను. ఒక్క వాక్యం నాకర్థం కాలేదు. మాణిక్యం యింకా అలాగే నిలబడి ఉన్నాడు.

వాణ్ని తప్పు అర్థం చేసుకొన్నానేమో ననిపించింది. వాడి తీరుపోయే అంతేనేమో. ఏది ఏమయినా మాణిక్యంలో యీమార్పు చాలా వింతగానే వుంది. ఈ వ్యక్తిత్వాన్ని ఎందుకు దాచుకున్నాడా అన్న ఆశ్చర్యం వదల్లేదు. చివర అని పోయిన రెండు వాక్యాలూ తీరని సమస్యలయాయి—

* * *

కొన్ని సంఘటనల్ని మనం మరిచిపోము. ఆ సంఘటనలే మనల్ని మరిచిపోతాయి. అలాగే కొండపల్లి ఖిల్లా విషయమూను—

"నువ్వు ఓడిపోయావ్—ఆడది నిన్ను జయించి, వెనక్కి తిరిగే సరిక్కి యింత నిస్సహాయంగా నిన్ను వదిలేసి పోయింది" అని నవ్వేడు సింగు.

"ఆడది కాదు—కన్నీళ్లు" అందామనిపించింది. అవన్నీ నా బలహీనతను దాచుకోవ

డానికి నేను చేసే దొంగతనాలని సింగు అనుకొంటాడేమోనని మాట్లాడలేదు.

కన్నీళ్లలో స్త్రీ చరిత్ర ప్రారంభమయి చిరునవ్వుతో ముగుస్తుంది. మొదటిది ప్రణయం, రెండవది ప్రళయం.

పంకజాన్ని ఎందుకు గుర్తుంచుకోవాలా? అని పదేపదే అనుకున్నాను. కారణాలను ఊహించగలశక్తిని మించి ఆలోచించినకొద్దీ పెరిగిపోతోంది మనస్సులో పంకజం—ఆ కళ్లను, ఆ నిశ్శబ్దాన్నీ, ఆ కన్నీళ్లను, ఎనలైజ్ చేసి—వ్యక్తిత్వానికి రూపును యివ్వగల శక్తిలేదు నాకు.

పంకజం మనస్సును పాల్వ చేయడం దేవుడి సమస్యలలో—ప్రేమకు పరిష్కారం యివ్వడంలాగు, మంచితనానికి అవధి నిర్ణయించడంలాగు—అతిక్లిష్టమైన తెగని సమస్య ఏమో మరి.

భాషలో రూపంలేని మహాకావ్యం—మాటలకు అందని అదే తన ఔన్నత్యం—ఓ చిరునవ్వు, కన్నీరు, పిరికితనం,—యిదీ పంకజం.

ఆరేళ్ల తర్వాత మళ్లీ ఆమె కన్పిస్తుందని ఎలా అనుకుంటాను?

* * *

మా శాఖాధికారికి వీడ్కోలు యివ్వాలంటే మిగతా ఉద్యోగులందరితో పాటు విజయవాడ స్టేషన్‌కు వచ్చాను. చాలామంచి వాడు. ఉన్నన్నాళ్ళూ ఎవరికీ ఉపకారం చెయ్యలేదు. కాని ఎవరికీ అపకారం చెయ్యని అతనితాటస్థ్యాన్ని మిగతా ఉద్యోగులతో పోల్చుకుని అతను మంచివాడే అని నిర్ధారించారు, ఉద్యోగులంతా. ఈ హడావుడి వద్దంటున్నా రైలుస్టేషన్‌వరకూ సన్మానాలతో వెన్నాడారు. ఒక్కొక్కప్పుడు మంచితనం కూడా భరించరాని మోతాదులో పెరిగిపోతే సుఖాన్ని చంపేస్తుంది—బిక్కచచ్చి పూలమాలల్ని అందుకొంటూ, స్టేషన్లో అందరిచూపూ తనమీద పడడం భరించలేక గింజుకొంటున్నాడు ఉద్యోగి.

నాకు నవ్వొచ్చింది. ప్లాటుఫారంమీద పచార్లు ప్రారంభించాను.

బుక్ స్టాల్ దగ్గర ఆగబోయేసరికి స్తంభం

నిదురపోయే సెలయేరు

దగ్గర కూర్చున్న వ్యక్తుల్ని చూసి నిర్ఘాంతపోయేను—పంకజంలో అంత మార్పు వస్తుందని కలలో కూడా నేను ఊహించలేని విషయం. బొద్దుగా, విశాలంగా పెరిగిన చెట్టులాగు, వంపులన్నీ మరిచిపోయి ఒకే ఆకారంగా—బరువుగా తీరిన శరీరంలో ఎక్కడో పాతపంకజం పోలికలు ఆ కళ్లల్లో ఆ పెదాల్లో లీలగా కన్పిస్తున్నాయి- పాత పంకజానికి పెద్దగుర్తు కళ్లల్లో యింకా పిరికితనం - కాని మరీ ఆశ్చర్యపరిచిన విషయం చుట్టూఉన్న పిల్లలు. పక్కనేఉన్న పెట్టె మీద ఇద్దరుపిల్లలు కూర్చొన్నారు. ఇద్దరికీ నాలుగేళ్లు దాటిఉండవు. ఒక కుర్రాడు బలంగా శంఖంలావున్న ఆమె మెడచుట్టూ చెతులుచుట్టి మారాం చేస్తున్నాడు. వాడిని ఊరడించడం ఎలాగో తెలీక తికమక పడుతోంది.

నాకంతా వింతగావుంది. మనిషిలో అంత పెరుగుదల ఊహించలేని నేను స్తబ్ధుణ్ణయాను. వొళ్లోకి కుర్రవాణ్ని తీసుకుని ముద్దుపెట్టుకుంటోంది.

ఎప్పుడూ ఆమెగురించి ఆలోచించేందుకు ప్రయత్నించక పోయినా యిన్నాళ్ల తర్వాత కన్పిస్తే మళ్లీ ఓసారి ఎదుటికి రావాలనిపించింది. ఇంకా కొన్ని సందేహాలు అలానే ఉండిపోయాయి. చుట్టూ చూసినా ఆమెకు సంబంధించిన వ్యక్తి ఎక్కడా ఉన్నట్టు తోచలేదు.

నన్ను చూసే ఏమనుకొంటుందో- చూసి, అంతలో నవ్వి పలకరించవచ్చు- పెళ్లిగురించి అడుగుతుందేమో?-ఆ కుర్రాళ్లని చూపించి 'ఏమీ చేతకాని నీకంటె నేను చాలానయం' అని కళ్లతో మాట్లాడితే! ఏమైనాగానీ- ఓసారి పలకరించాలన్న ఉబలాటం ఎక్కువయింది.

ఎనిమిదేళ్ల క్రిందటి ఒక్క సందేహం యిప్పటికీ వదల్లేదు- అప్పటి పంకజం విముఖతకు కారణం ఆలోచిస్తే అర్థంబోధపడదు- అందుకు కారణం, మాణిక్యమా-? లేక పంకజంలో పిరికితనమా?- తెలీదు.

లేచి కొడుకుని ఎత్తుకుని గోడనున్న బొమ్మవేపు చూపిస్తోంది. బుక్ స్టాల్ నీడలోంచి కదిలాను. బొమ్మపక్కకివచ్చి నిలబడ్డాను. ఈ సారి బొమ్మని చూపించబోయి నన్ను చూసి దిమ్మరపోయింది. క్షణం భయపడిందేమో. కొడుకుని గట్టిగా గుండెకు అదుముకొంది—

నవ్వుదామనుకుంటే పెదాలు వణికాయి- శక్తిలేక క్రింది పెదవిని నొక్కి పట్టుకొన్నాను-

క్షణం ఆగి స్తంభానికి ఆనుకు నిలబడ్డది- నావేపునుంచి దృష్టి మళ్లించలేదు. ఆ కళ్లల్లో యింకా ఏ[illegible]- అలానే-

ఒక్కసారి హఠాత్తుగా చుట్టూ పరికించింది. నేను దగ్గరికి వస్తే కుర్రాణ్ని కింద దింపేసి కొంగు సరిచేసుకుంటోంది

సంజ్ఞ చేస్తూనే పలకరించాను.

ఇంకా నన్ను విచిత్రంగా చూస్తూనే వుంది. కళ్లలో మళ్లీ పాతఆశ, కోరికా - లేకపోతే నేను పొరబడ్డానేమో?-

అంతలోనే రెండు చేతులూ గుండెకు ఆనించుకుని- తొందరగా ఏదో సంజ్ఞ చేస్తోంది.

నాకు అర్థంకాదు- ఎటువేపో చూసి మళ్లీ చెప్పింది.

ఈసారి—అవును—అర్థమయింది.

"మీకో నమస్కారం చేస్తాను—నాతో మాట్లాడకండి ఆయన చూస్తే నా ప్రాణం తీస్తాడు—" ఇదీ నాకు బోధపడిన విషయం. 'ఆయన'ను ఎటువేపో చూసి సూచించింది.

మొదటిసారిగా, చివరిసారిగా పూర్తిగా క్రుంగిపోయేను. బుక్ స్టాల్ లో బుద్ధుడి అట్ట నీడ అడ్డంగా ముఖంమీదపడి నా కవళికల్ని కప్పిపుచ్చింది. పిల్లలు ఎగుడుగ్గా వలిగి ఆకలెట్టి వేపు చూస్తున్నారు. పంకజం నావేపు చూడడం వెయ్యియుగాల క్రిందటే మానేసింది. కొడుకుచుట్టూ నీలిరంగు కొంగుతిప్పి దగ్గరగా హత్తుకుని పెట్టెమీద కూచొంది—పిల్లాడి తలమీద గడ్డం ఆనించింది. మొదట ఏడుస్తుందేమో ననుకొన్నాను. దిగులుగా రైలు పట్టాలవేపు చూస్తోంది.

శరీరమంతా చెమట పోస్తోంది—నడవలేనంత నిస్త్రాణగావుంది—అంతకుమించి పంకజం నఖరి—'స్త్రీలో యింత మార్పు సాధ్యమా?' అన్న ఆలోచన మెదడుని కొరుకుతోంది—

పక్కకి అడుగు వేయబోతే సామాన్లు మోసుకొచ్చే బండివాడు కేక పెట్టాడు—సిగ్గుపడి పక్కకి తప్పుకున్నాను.

రైలు విపరీతమైన శబ్దం చేసుకొంటూ వచ్చింది. త్వరత్వరగా పిల్లలందర్నీ లేవదీసి ఎవరికోసమో నన్నుతప్ప—మిగతా అన్ని చోట్లా కళ్ళతో వెదుకుతోంది పంకజం. పక్కనే నీడలో ఉన్నానని తెలిసికూడా నన్ను చూడడం లేదు—

మెల్లిగా నడక ప్రారంభించాను—

పదిగజాలు నడిచాక ఎవరో నన్ను పిలుస్తున్నారు. పక్కకి తిరిగితే ఫ్లాస్కు పట్టుకుని అతను—అతనే! — పేరు జ్ఞాపకం లేదు—మాణిక్యం!—అదీ అతని పేరు—

నిర్ఘాంతపోయేను. 'మాణిక్యం' అన్నాను నీరసంగా. రైలుగొడవనున్న శబ్దం సగం చచ్చిపోయింది.

"అవును బాబూ... నేనే!—కులాసాగా వున్నారా? చాలా చిక్కిపోయారే.—భిలాయ్‌లో ఉద్యోగం దొరికింది బాబూ—పోతున్నాను."

చేతిలోని ఫ్లాస్కు భుజానికి తగిలించుకొన్నాను.

"వస్తాను బాబూ—పెళ్లాం, పిల్లలు

యిక్కడే వున్నాగా—అరె! మీరు చెప్ప లేదే!—పంకజం యిక్కడే ఉంద చూస్తారా ?—నాకు ముగ్గురు పిల్లలు—"

ముఖం తిరుగుతుందేమోనని భయం వేసింది. నీరసంగా నవ్వాను—

"ఇప్పుడు గాలేను మాణిక్యం—తొందర పని వుంది—సంతోషం—" అని నీడలోకి వత్తిగిలి నడిచి వచ్చేశాను—

*　　　*　　　*

ఇప్పుడిక పాతకథలకి ఓ తోకంటూ కన్పించింది. కాని పంకజం గురించి ఆలోచించిన కొద్దీ విచిత్రమైన సమస్య మాత్రమే మిగులుతోంది.

కోరికకోసం పరిస్థితుల్ని ఎదిరించడం సాధ్యమని ఊహించలేని పంకజం-సంప్రదాయాలకులొంగి అధికారానికి పిల్లల్ని కన్నది.

కాని పాత సంప్రదాయాలపై తిరుగుబాటు చేయలేని బలహీనతే మాణిక్యం లాంటి వ్యక్తిని పెళ్లి చేసుకోవడానికి కారణమయితే అరేళ్ళక్రితం కొంపెపల్లి అనుభవాలకి, అప్పటి ఆమె చిరునవ్వుకి, ఆ కళ్లల్లో ఆహ్వానానికి అర్థంలేదు.

ఆలోచించిన కొద్దీ ఈ వింతప్రవృత్తి ఒక్క పంకజానికే కాక 'స్త్రీ'కే సహజమనిపిస్తుంది. అభిరుచికంటే అనుభవం పట్ల ఆకాంక్ష ఎక్కువ స్త్రీకి. పురుషుడు కట్లా కాదు. అనుభవంకన్న అభిరుచి ముఖ్యం. అందువల్లనే సంప్రదాయాలను, నైతిక పరిధులను త్రెంచుకుపోయే శక్తి, తెగింపు పురుషుడికంటె, స్త్రీకి ఎక్కువ—

పురుషుడి ప్రేమ కథ ప్రేమని ప్రేమించడంతో ప్రారంభమయి, స్త్రీని ప్రేమించడంతో ముగుస్తుంది. కాని స్త్రీ మొదట పురుషుణ్ని ప్రేమించడంతో ఆరంభించి, ప్రేమని ప్రేమించడంలో తృప్తిపడుతుంది. అందుకనే ఆమె ఎన్నిసార్లయినా ప్రేమించగలుగుతుంది- ఎందుకంటే ఆమె ప్రేమించేది పురుషుని కాదు కనుక-ప్రేమని గనుక-ప్రేమా?- ఉఫ్ !- ఇరవయ్యో శతాబ్దపు మానవుడు అర్థం తెలీని రోగానికి అవ్యాహతంగా పుచ్చుకొనే ఒక చీప్ టానిక్— అదీ ప్రేమకి నిర్వచనం—

కాస్త ఆలోచిస్తే ప్రేమదీ ఏమీ తప్పు లేదనిపిస్తుంది —ప్రేమ జన్మస్థానం కోరిక-కోరిక జన్మస్థానం – స్త్రీ !

ఇంత ఆలోచించికూడా పంకజం జీవితం పట్ల సానుభూతి చూపించలేకపోతోంది మనస్సు. ఒక్కసారి ఆమె మాటాడగలిగితే బావుణ్ను. సంస్కారాన్ని పూరించుకోలేని ఆమె స్త్రీత్వం చేసినపొరపాటేమో అది – అనుకుందామన్నా సరికాదు-

స్త్రీ ఎప్పుడూ పొరపాటు చేయదు. తనతో గడిపినవాళ్లంతా పొరపాటుచేశారనిపించేట్లు చేస్తుంది.

ఏమైనాగానీ—పంకజం చర్యలకు వేరే అర్థం ఏమీ కన్పించదు. ఆకాశం నీలానికి, కొండ స్థిమితానికి అర్థంలేనట్టు— ★



2-11-60 బుధవారం మొదలు
8-11-60 మంగళవారంవరకు.

మేషం :

(అశ్విని, భరణి, కృత్తిక 1 పా.)

ఈవారం ఏ పనితలపెట్టినా పోటీ కనుపిస్తుంది. భాగస్థులతో కలిసి చేసేపనులలో చిక్కులు రాగల అవకాశాలున్నవి. బుద్ధిబలంతో ధన సంబంధమైన ఇబ్బందులను తొలగించుకో గలుగుతారు. క్రొత్తగా ప్రారంభించిన పనులలో తాత్కాలికంగా శ్రమ, వ్యయము కనుపిస్తవి. కుటుంబంలోని వారి అనారోగ్య కారణాలు మీ ఉత్సాహానికి అడ్డుతగులుతవి. నిగ్రహంతో ఇతరులవల్ల మాటరాకుండా సమర్థించుకోగలుగుతారు. అధికారులవల్ల మీరు అనుకున్నంత సహాయం లభించదు. విలాస సంబంధమైన ఖర్చులు పెరుగుతవి. ఎదురుచూస్తున్న వార్తలు అందే సూచనలు లేవు. 3,4 లలో ఆస్తివృద్ధి, మిత్రలాభం.

* * *

వృషభం :

(కృత్తిక 2, 3, 4 పా, రోహిణి, మృగశిర 1, 2 పా.)

స్వయంకృషితో ముందుకుపోవలసిన సమయం. అయితే అందుకు అవకాశాలు బాగుంటవి. ధనాదాయంతోపాటు హోదా పెరుగుతుంది. మిత్రులలో ఒకరిద్దరు కలహిస్తారు. కాని, చిక్కులు ఏమీ ఉండవు. ముఖ్యమైన పత్రాలు వగైరా పోగొట్టుకొనే అవకాశాలున్నవి. పెద్ద మనుష్యులవల్ల మాట సహాయం బాగా లభిస్తుంది. విశ్రాంతి మాత్రం లభించదు. అనుకున్న పనులు సమయంలో సక్రమంగా జరుపగలుగుతారు. సంఘంలో మీ పేరు ప్రతిష్ఠలు బాగుంటవి. దుబారా ఖర్చులు తగ్గి మనశ్శాంతి లభిస్తుంది. కుటుంబంలో శుభ పుణ్య కార్యాలు జరుగుతవి. అప్పులు ఇచ్చే సందర్భంలో నిష్కర్షగా ఉండటం అవసరం. 5,6 తేదీలలో అలంకార వస్తు ప్రాప్తి, వృత్తిలో అభివృద్ధి.

* * *

మిథునం :

(మృగశిర 3, 4 పా, ఆరుద్ర, పునర్వసు 1, 2, 3 పా.)

ఎవరితో ప్రసంగించ బోయినా మర్యాద, మన్ననలు బాగుంటవి. పనులు జరగటం మాత్రం సమస్యగా కనుపిస్తుంది. ఇతరులకు ఉపయోగించే పనులలో మీ బాధ్యత పెరుగుతుంది. వృత్తి ఉద్యోగాలలో మీ మనస్సును కలవర పెట్టే కారణాలు కనుపిస్తవి. కుటుంబ విషయాలలో ముందుకన్నా సుఖశాంతులు బాగుంటవి. ఖర్చులు విశేషంగా ఉన్నా ఉపయోగము, సంతృప్తి ఉంటవి. ప్రయాణ సూచనలున్నవి. గౌరవం నిమిత్తం ఆడంబరాలు పెంచుకోవద్దు. వ్యవహార రంగంలో స్వల్ప ఫలితానికే సంతృప్తి పడవలసిన సమయం. ఇతరులను గురించి మీతో చాడీలు చెప్పేవారిని నమ్మవద్దు. 2,3 తేదులలో ధన లాభం, విలువగల వస్తువులు కొనటం; మిత్ర లాభం.

గ్రహస్థితి
మిథునంలో అంగారకుడు, సింహంలో రాహువు, తులలో సూర్య బుధులు, వృశ్చికంలో శుక్రుడు, ధనుస్సులో గురు శనులు, కుంభంలో కేతువు, మీన మేష వృషభ మిథునాలలో చంద్రుడు.

* * *

కర్కాటకం :

(పునర్వసు 4 పా, పుష్యమి, ఆశ్లేష)

ఫలితం కనుపిస్తే అనుభవించటానికి అందరు పెద్దలే. సమయంలో సహాయం చేయటానికి ఎవ్వరూ కనుపించరు. మీ ఆలోచనలు సకాలంలో కార్యరూపంలోకి వస్తవి. స్నేహ ధర్మంలో మంచి చెప్పబోయినచోట కలహించుకోవలసి వస్తుంది. అందువల్ల చిక్కులు ఏమీ ఉండవు. ఆదాయం మామూలుగానే ఉంటుంది. బంధువులవద్దనుంచి అనుకూల వార్తలు వస్తవి. వృత్తి వ్యాపారాదులలో వచ్చే చిక్కులను ధైర్యంతో ఎదుర్కొని విజయం పొందగలుగుతారు. ఇంతవరకు మీరు తెలుసుకోలేకుండా ఉన్న రహస్యాలు, విశేషాలు ఈ సమయంలో తెలుస్తవి. పిల్లలమూలంగా ఆనందం లభిస్తుంది. 7, 8 లలో దేహబాధలు, వృథాశ్రమ, వస్తునష్టం.

* * *

సింహం :

(మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)

ప్రతి పనిలోను ఆందోళన, చిక్కులు లేకపోయినా ఉన్నట్లుగా తలచుకోనటం, ఇవి ఉంటవి. పాటవారు మిత్రులను నిరసన భావంతో చూస్తారు. బాహ్య విషయాలలో జయప్రదమైన కాలం. అనుకోకుండా ముఖ్యమైన మనుష్యులతో విడిపోవటం జరిగే సూచనలున్నవి. ధనాదాయం క్రమంగా పెరుగుతుంది. మీక్రింద పనిచేసే మనుష్యులతో మృదువుగాను, నిష్కర్షగాను వ్యవహరించవలసిన సమయం. పుణ్యక్షేత్రాలు దర్శించే అవకాశం లభిస్తుంది. అధికమైన ఆలోచనలవల్ల అసౌఖ్యం కనుపిస్తుంది. స్నేహితులవద్దనుంచి వచ్చే వార్తలు నిరుత్సాహాన్ని కలిగిస్తవి. 3, 4 తేదీలలో అదృష్ట సూచనలు, గొప్పవారి స్నేహం, గౌరవ ప్రాప్తి.

* * *

కన్య :

(ఉత్తర 2,3,4 పా, హస్త, చిత్త 1, 2 పా)

ఇతరులదృష్టిలో మీ అంతస్తు పెరిగినట్లు కనుపించేసమయం. అయితే తటస్థభావంతో ఉండటంవల్ల కొంతభారాన్ని తొలగించుకో గలుగుతారు. మీ శక్తి, సలహాలు, ఇతరులకు ఉపయోగించినంతగా, మీకు ఉపయోగించుకోలేక పోతారు. ధనవ్యయంతో జరుగవలసిన పనులు ఆరంభించతగిన సమయం కాదు. కుటుంబ విషయాలలో జోక్యం కలిగించుకోనకుండా ఉండటం మంచిది. అభిప్రాయభేదాలు రాగల అవకాశాలున్నవి. వారం రెండవ భాగంలో పరిస్థితులలో క్రమంగా అనుకూలమైనమార్పులు కనుపిస్తవి. వృత్తి ఉద్యోగాలకు సంబంధించిన శుభవార్తలు తెలుస్తవి. వస్త్రాభరణాలు కొంటారు. 5, 6 లలో శుభ కార్యాలలో పాల్గొనటం, ఇష్టవస్తు ప్రాప్తి, అకస్మాద్ధనలాభం.

* * *

ఈవారపు ధరలు

బంగారు ధర 5, 6 తేదులలో మందీ అవుతుంది. వెండి ధ 7, 8 లలో గిరాకీ వస్తుంది. పసుపు ధరలో గిరాకీ ఆరంభించి 4, 5 లలో కొద్ది మందీ కనుపిస్తుంది. మరల పెరుగుతుంది.

వేరుశెనగపప్పు, నూనె ధరలు కొద్దిగా తగ్గే సూచనలున్నవి. నూవులనూనె ధర వారం రెండవభాగంలో మందీఅవుతుంది.

చింతపండు ధర కొద్దిగా మందీ వస్తుంది. గోధుమల ధర మందీ. మినుములధర మందీవచ్చి రెండవ భాగంలో పెరుగుతుంది.

శెనగల ధరలో మందీ కనుపిస్తుంది. మిర్చి ధర పెరుగుతుంది. వారాంతంలో తగ్గుతుంది.

తుల:

(చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ, 1, 2, 3 పాదాలు)

ఎదటివారిమాటలు నమ్మకుని ఏ పనిలోను దిగవద్దు. ధనవిషయంలో ఇబ్బంది బడవలసి వస్తుంది. మీ సలహాలు, మీ సహాయాన్ని అపార్థంచేసుకునే వ్యక్తులుంటారు; జాగ్రత్త. సంఘంలో గౌరవం పెరుగుతుంది. కాని ఫలితం తక్కువ. ప్రయాణాలు చేయవలసి వస్తుంది. విలువగలవస్తువులు కొనే ప్రయత్నాలు ఫలిస్తవి. ఇంతకుముందుకన్నా మీ ఆరోగ్యం బాగుంటుంది. అనుకున్న ప్రకారం సకాలంలో బాధ్యతలను నెరవేర్చుకుని విశ్రాంతిగా ఉండగలుగుతారు. పండితులతో సాంగత్యం, ఆధ్యాత్మిక విషయాలయందు ఆసక్తి పెరుగుతవి. వారం రెండవభాగంలో అకస్మాత్తుగా ఉద్రేకం రాగల సూచన లున్నవి. 7, 8 తేదీలలో కలహాప్రసంగాలు, ధనలాభం, స్త్రీవారి మైత్రి.

* * *

వృశ్చికం:

(విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ)

వృత్తి ఉద్యోగాలలో శ్రమ విశేషంగా ఉంటుంది. త్రిప్పటతో కూడిన కార్యక్రమాలు అధికం. బంధువర్గంలో మంచిపేరు లభిస్తుంది. విలాస, సుఖాలకై ఖర్చులు పెరుగుతవి. తోటివారు మిమ్మలను మాటలతోనే సంతృప్తిపరచటానికి చూస్తారు. ఇతరులచేతికి పోయిన వస్తువులుగాని, డబ్బుగాని తిరిగివచ్చే సూచనలు లేవు. అకస్మాత్తుగా స్నేహితులవద్దనుంచి కష్టవార్తలు తెలుస్తవి. మీ నిత్య కార్యక్రమాలలో అశ్రద్ధ, పొరపాట్లుచేసి దిద్దుకొనటం సంభవిస్తుంది. కుటుంబంలోనివారి ఆరోగ్యం అసంతృప్తికరంగా ఉంటుంది. 5, 6 తేదులలో శుభసూచనలు, సంతోషవార్తలు.

* * *

ధనుస్సు:

(మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ ప్రథమ పాదం)

సందేహాలు పెట్టుకుని చేజిక్కిన అవకాశాన్ని వదులుకుంటారు. అయితే దైవానుగ్రహంవల్ల ఇతరులసహాయం లభించి ఫలితం దక్కుతుంది. హోదా పెరుగుతుంది. కుటుంబంలో మీ మాటకు విలువ కనుపిస్తుంది. సుఖం లభిస్తుంది. శుభకార్య ప్రయత్నాలు ఒక నిర్ణయానికి వస్తవి. సాటివారితో లోగడ చెప్పినమాటను నిలబెట్టుకో గలుగుతారు. ఉష్ణాధిక్యంవల్ల ఆరోగ్యం లోపిస్తుంది. వారం రెండవభాగంలో మీకు సంబంధం లేకపోయినా కలహ ప్రసంగాలకు గురి కావలసివస్తుంది. ముఖ్య వస్తువులు పోగొట్టుకుంటారు. విలువగలవస్తువులు కొనతగినసమయం. 2, 3, 4 తేదీలలో సంఘ కార్యాలు బంధువులవద్దనుంచి శుభ వార్తలు.

* * *

మకరం:

(ఉత్తరాషాఢ 2, 3, 4 పా, శ్రవణం ధనిష్ఠ 1, 2 పా)

క్రమంగా వృత్తిలో మంచి మార్పు రాతగిన సమయం. బంధు మిత్రుల ఆదరణ బాగా లభిస్తుంది. ధనసహాయం లభిస్తుంది. అయితే శ్రమ విశేషంగా ఉంటుంది. లోగడ ఆశపెట్టుకుని ఉన్న ఫలితం చేయిజారి పోవచ్చు. కుటుంబంలోని వారి ఆరోగ్యం అసంతృప్తికరంగా ఉన్నా ఇంతకు ముందుకన్నా మేలుగా తోస్తుంది. మీ రహస్యాలను బయటకు లాగటానికి ప్రయత్నించే మనుష్యులుంటారు. జాగ్రతగా ఉండండి. ప్రయాణాలు నిలుపుకోవలసివస్తుంది. తాత్కాలికంగా బాధ తోచినా ముందు ముందు అనుభవంలో ఫలితం బాగుంటుంది. వ్యవహారాలు ప్రస్తుతం ఎటూ తేలవు. 4, 5 లలో అలంకారవస్తు ప్రాప్తి; తలవని తలంపుగా ధనలాభం.

* * *

కుంభం:

(ధనిష్ఠ 3, 4 పా, శతభిషం, పూ. భాద్ర 1, 2, 3 పా.)

ఏ పని ఎందుకు చేస్తారో ముందుయోచన ఉండదు. అందువల్ల ఫలితంబాగానేఉంటుంది. విలాసవినోదాలలో ప్రశాంతం గాజరుగుతుంది. మిమ్మలను కలహాలకు దించవలయుననే ఇతరుల ఆలోచనలు వ్యర్థంలోనే అగిపోతవి. స్త్రీ విషయాలు, సూక్ష్మ విషయాలు తెలుసుకొనే ప్రయత్నాలు ఫలిస్తవి. తలవని తలంపుగా ఉత్సాహము, పట్టుదల పెరుగుతవి. స్నేహితులవద్దనుంచి కష్టవార్తలు రాగలవు. కుటుంబంలో ఇంతకు ముందు కనుపిస్తున్న సమస్యలకు పరిష్కార మార్గం కనుపిస్తుంది. ఖర్చులు మాత్రం మితిమీరుతవి. ఇతరులకు సహాయం చేయటంలో మీ సుఖాన్ని మరచిపోతారు. 5, 6, 7 ల్లో సుఖసంతోషాలకై ఖర్చులు; శత్రుజయం.

* * *

మీనం:

(పూర్వాభాద్ర 4 పా, ఉ. భాద్ర, రేవతి)

కార్యభారం అధికం, అంతకంటే ఆలోచనలతో ఆరోగ్యానికే భంగంరాదగిన సమయం. ధైర్యము, పట్టుదల ముఖ్యంగా మిమ్మలను ముందుకు తీసుకునిపోతవి. ఫలితం సామాన్యంగా ఉన్నా కార్యం సాధించగలుగుతారు. సంఘంలో మీమాటను చలామణి చేసుకోగలుగుతారు. వృత్తి ఉద్యోగాలలో శ్రమపడి అభివృద్ధిని సాధిస్తారు. మీ విషయంలో స్నేహితులకు కలిగిన దురభిప్రాయం తొలగిపోయి ఆదరాభిమానాలతో మెలగుతారు. సాధ్యమైనంతవరకు ప్రయాణాలు మానుకొనటానికి ప్రయత్నించండి. సాహసకార్యాలకు పోవద్దు. 7, 8 తేదీల్లో దేహబాధలు, కష్టవార్తలు, వస్తునష్టం.

★

శారద

[illegible] హనుమంత రావు

"ఆ...అదిగో...ఆ అమ్మాయే, మధూ!"

పచ్చగడ్డిమీద మేనువాల్చి పైన కన్పిస్తున్న నక్షత్రాలని లెక్క పెడుతున్న మధు ఒక్కసారిగా లేచి కూర్చున్నాడు.

..."అదిగో...ఆ ముగ్గురూ లేరూ?... వారిలో కుడిపక్క పిల్లే మా శారద..."

మగతగా నిద్రపట్టడంచేత కొద్దిగా మూతలుపడిన కళ్లను రెండు చేతులతోను నులుముకుని ఆవైపుగా చూచాడు మధు... మంచినీళ్ళబావి...బిందెలతో ముగ్గురు అమ్మాయిలు...కుడిపక్కగానున్న అమ్మాయికేసే దృష్టి మరలించాడు...పక్కనున్న పిల్లలతో కిలకిలా నవ్వుతూ మాట్లాడుతోంది...ఏం సరసం జరుపుకుంటున్నారో, ఒకరిమీదొకరు నీళ్లు జల్లుకొంటున్నారు ... మధు ఆమెకేసి తదేకంగా చూశాడు ... మేలిమి బంగారు ఛాయ ... మన్మథపాటి ఒత్తు... కోలమొహం...ఎంతో అమాయకంగా కనిపించిందతనికి...ఎంతో నిరాడంబరంగా ఉంది ... వయస్సు పదిహేడు, పద్దెనిమిది సంవత్సరాల ప్రాంతం...తనివితీరా చూచే లోపలే వాళ్లు ముగ్గురూ బిందెలలో నీరు నింపుకుని వెళ్లిపోయారు...

..."ఏం, సరీగ్గా చూశావా?"

మధు, తాను తదేకంగా అటువైపే చూడటంతో మూర్తి ఏమనుకున్నాడో అని, సిగ్గుపడి తల దించేసుకున్నాడు.

..."ఏం, నచ్చినట్లేనా?" మూర్తి అడిగాడు.

మధుకి నోట్లోంచి మాట రావటంలేదు. మెల్లిగా అన్నాడు, "అసలు ఆ అమ్మాయిని చూడటానికి నేనర్హుణ్ణా? ఎంత అందంగా ఉంది!"

మూర్తి ఒక్క క్షణం శ్వాస పీల్చుకుని మొదలెట్టాడు: "నేనెంతో ఆలోచించే నిన్ను చూడమన్నాను, మధూ! మా చెల్లాయిని సుఖపెట్టగలవాడు నీవు తప్ప వేరొకడు లేడు అన్న భావం నాలో నాటుకుపోయింది. శారద అందానికీ, గుణాలకీ నీవే తగినవాడివని నా అంతరాత్మ ప్రబోధిస్తూవచ్చింది. అందుకనే నిన్ను వచ్చి చూడమన్నాను. నీవు సరేనంటే..."

మధుకి ఒళ్లు పులకరించింది. "అటువంటి అప్సరసే నాకు భార్య అవుతూంటే,—ఇక నేమీ అభ్యంతరం లేకపోతే—, అది నా అదృష్టం కాదా, మూర్తీ?" అన్నాడు మెల్లిగా.

మూర్తి చాలా ఆనందపడ్డాడు. "నాకు చాలా సంతోషంగా ఉంది, మధూ! ఇంటికి వెళ్లి నాన్నతో చెప్దాం, పద!" అంటూ లేచాడు.

మధుసూదనరావు, సీతారామమూర్తి బి. ఏ. లో క్లాసుమేట్సు. మూర్తి కొద్దిగా పొట్టిగా, లావుగావుంటాడు. పచ్చనిరంగు. ఎక్కువగా అందరితోను కలిసే స్వభావం కాదతనిది. బి. ఏ. చదివినంతకాలం మధు ఒక్కడితోనే సాన్నిహిత్యం ఏర్పడింది. మధు పొడుగ్గా ఉంటాడు. ఎత్తుకుతగినలావు; చామనఛాయ. సంగీతం అంటే చెవి కోసుకుంటాడు. కాని స్వతహాగా మాత్రం ఏమీ పాడలేడు. అందుకనేకామోసు "విని ఆనందించటంలో ఉన్న సంతృప్తి పాడడంలోకూడా ఉండదేమో" అని అంటూ వుంటాడు. మూర్తీ, మధులిద్దరు ప్రాణమిత్రులు. తనువులు వేరైనా అభిరుచులొకటే. బి. ఏ. పూర్తి చేసినతరువాత మూర్తి పైచదువు మానేసి ఊళ్ళో తండ్రికి సహాయంగా ఉంటూ వచ్చాడు. మధు ఆపైన ఎం. ఏ. పూర్తిచేసి, వైజాగ్ లో ఒక సంవత్సరంనుంచీ లెక్చరర్ గా పనిచేస్తున్నాడు. మూర్తికి చిన్నతనంలోనే వివాహం జరిగింది. మధు ఇంకా అవివాహితుడే. ... ఒకవారంరోజుల క్రిందటే (చాలా రోజులతరువాత) మూర్తి వద్దనుంచి, మధుకి ఒక ఉత్తరం వచ్చింది. "నీకొక సంబంధం ఉంది. తప్పక రావలసింది" అని...మధు మూర్తి ఊరికి వచ్చాడు. వచ్చినతరువాత చెప్పాడు మూర్తి మధు చూడబోయేది తనచెల్లెలినే అని. "అయితే యిక చూడటం ఎందుకు?" అన్నాడు మధు. కాని మూర్తి మధుని ఒప్పించి శారదని చూపించాడు. శారదకి తెలియకుండానే, తన అంగీకారాన్ని తెలుపుతూ ఆ మర్నాడే మధు వైజాగ్ కి తిరిగి వెళ్ళిపోయాడు.

• • •



నెల తిరిగేలోగానే శారదా మధుల వివాహం జరిగింది. వివాహమయి ఆనాటికి మూడోరోజు. ఆరోజు రాత్రే అతని శోభనం. రాత్రి ఎనిమిదిగంటలయింది. అతడిమనసులో విచిత్రమైన ఊహలెన్నెన్నో వచ్చి అతణ్ణి ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

"నిజంగా తానెంత అదృష్టవంతుడు! తనూ, శారదా ప్రక్క ప్రక్కనే నుంచుని ఫోటోలు తీయించుకుంటున్నప్పుడు 'రాధా మాధవు'ల్లా ఉన్నారన్న మామ్మమాట జ్ఞాపకం వచ్చింది.

అవును తన జీవితాన్ని సార్థకం చేయగల భార్య వచ్చినప్పుడు ఎందుకుండరు?.. "ఒరేయ్ నాకు కావలసింది. 'అందం' కాదు అంటూనే 'అప్సరస' నే కట్టేసుకున్నా వేమిటిరోయ్?" అన్న సుధాకర్ మాటలు జ్ఞాపక మొచ్చాయి. తనలో తానే నవ్వుకున్నాడు. ఇంక తనకేం కావాలి? తనూ, శారదా పరవశంలో ఈ ప్రపంచాన్నే మరచిపోరూ?' ...మూర్తి వచ్చాడు ఇంతలో ... మధు చేతుల్ని తనచేతుల్లోకి తీసుకుంటూ, మూర్తి అన్నాడు.

"మధూ! ఇక నీచేతుల్లో పెట్టాం మా శారదని! ఎల్లా చూసుకుంటావో...నీకూ శారదలాంటి వొక చెల్లెలుంటే తెలిసొచ్చేదనుకుంటాను మా బాధ"......మూర్తి కళ్ళల్లో నీళ్లు తిరిగాయి ... మూర్తిబాధని అర్థం చేసుకొన్నాడేమో! మధు మెల్లిగా అన్నాడు:

"నేనేమన్నా రాక్షసుణ్ణనుకున్నావా, చెప్పు మూర్తీ?...శారదని పువ్వుల్లో పెట్టుకొని పూజిస్తాను...నా హృదయ పీఠంలో నిలుపుకుంటాను. చాలా"... మూర్తి కళ్ళుతుడుచుకొని, "ఈ రోజు మీ మొదటిరాత్రికదూ? మీరు ఇవాళ పొందుతున్న పవిత్రమైన అనుభూతుల్నే మీ దాంపత్యజీవితంలో ప్రతీరోజూ పొందాలని నేను భగవంతుణ్ణి మనసారా ప్రార్థిస్తున్నాను." అంటూ వెళ్ళపోయాడు.

...మూర్తి వెళ్ళినతరువాత సుధాకర్ వచ్చాడు. ఎప్పుడూ నవ్వించే స్వభావమితనిది. మూర్తిలాగానే సుధాకర్ కి కూడా చిన్నప్పుడే పెళ్ళయింది. అయితే భార్య గడుసరి. పైగా ఇతను చెప్పిందల్లా చేయక పోవటమే ఆమెపని. సుధాకర్ మధుతో అన్నాడు :-


"చూడు, మధూ! నీకన్న ముందు పెళ్లి చేసుకొని సంసారంచేస్తున్న అనుభవంతో ఒక్క విషయం చెబుతాను విను. నీవు గది మూయగానే, నీభార్య లోపలికి రాగానే, చాచి, గూబ అదిరిపోయేలా, లెంపకాయ కొట్టేసి, వెంటనే దగ్గరికి తీసుకో. ఇకఛస్తే నీమాటకు ఎదురుచెప్పదు ... భయమంటూ వుంటుంది. లేకపోయిందా? నాలాగే నివు తయారవుతావు..." మధుకి నవ్వాగలేదు. "సరే! ప్రయత్నిస్తాను" అన్నాడు. ఒరేయ్! నిజంగా అంతపనీ చేస్తావేమిటి? జాగ్రత్త.. మీ ఆవిడ ఆజన్మాంతం నన్ను తిట్టుకుంటుంది." అంటూ నవ్వుతూ వెళ్లిపోయాడు.

మధుని చక్కగా అలంకరించిన పడక గదిలోనికి తీసుకువెళ్లేరు. అప్పటికి పదకొండున్నర అయింది...అతనికి మనస్సు ఉండవలసిన స్థానంలో లేదు...ఏవేవో ఊహాలు స్ఫురిస్తున్నాయి ... ఒంటరితనం భరించడం కష్టంగాతోచింది...పన్నెండుకి పదినిముషా లుండనగా. శారదని లోపలికి పంపి, బయట గొళ్ళెం వేసేసింది మూర్తి భార్య...

సాభిప్రాయంగా తలుపువైపు చూశాడు మధు. అక్కడ శారద నిలబడివుంది. ఒక్క నిమిషం నిశ్శబ్దం...మెల్లగా నవ్వుకుంటూ లేచి వెళ్లి లోపలనుండి గొళ్లెం వేశాడు. శారద ప్రక్కనే వెళ్లి నుంచున్నాడు... ఆమె తల వంచుకొని వుంది. చూపుడువ్రేలితో ఆమె చిబుకాన్ని పట్టుకొని ముఖం పైకెత్తాడు. "చూడు శారదా! ఇంకా సిగ్గుపడతా వెందుకు నన్ను చూసి. మనము ప్రేమలేని తాళ్లతో మనని పవిత్ర బంధనం చేశే కాగు మన పెద్ద వాళ్లు!"

...శారద మధుకేసి చూసింది...అతను వ్యక్తపరచే భావాలలో నిజమెంతో పరీక్షిస్తున్నదేమో! నిర్మలంగా, ఈషణ్మాత్రం కల్మషంలేని అతనిముఖాన్ని పరికించి చూసింది..."ఏమిటి, శారదా, అలా చూస్తున్నావు? నేనేం రాక్షసుడిలా కనిపించటం లేదుకదా?" నవ్వుతూ అడిగాడు మధు. ఇంకొకసారి తలయెత్తి, అతని ముఖాన్ని చూసింది...అంతే...వెంటనే కాళ్ల మీద పడిపోయింది. మధుహృదయం ద్రవించిపోయింది. "ఎందుకింకా భయం, శారదా! నిన్ను నా ప్రాణంకన్నా అధికంగా చూసుకుంటా...చాలా?...ఇక లే"...శారద లేవ లేదు; మధు కాళ్లమీదే ఉంది. మధు తిరిగి అన్నాడు: "పిచ్చిపిల్లా! నిన్ను నాహృదయ పీఠంలో నిలుపుకుంటానన్నానుగా? ఇంకా నమ్మకం కుదరలేదా నామీద?" అని. శారద ఇంకా లేవలేదు. మధుకి కొంచెం ఆశ్చర్యం వేసింది.

"ఏమిటి శారదా? నన్ను పరీక్షిస్తున్నావా? లేక నాతో పరిహాసమాడుతున్నావా? అయితే నేనే పడుకోబెడతాలే" అంటూ క్రిందకివంగి, రెండుచేతులతోను ఆమెని మృదువుగా ఎత్తుకొని నడచివెళ్లి, మంచంమీద పడుకోబెట్టాడు. శారద గిలగిలా తన్నుకోవడం మొదలెట్టింది... మధుకేమీ తోచలేదు. గాభరాపడిపోయాడు." అల్లావున్నావేం శారదా? నన్ను చూసి అంతగా భయపడవలసిన పనేముంది? నేను..." అతనికి మాటలు రాలేదు. శారద



తన్నుకోవడం ఎక్కువయింది. అప్పటికిగాని శారదకి వచ్చింది 'మూర్ఛ' అని తెలియలేదు. నిలువునా నిర్విణ్ణుడైపోయాడు మధు.

"ఈ శుభసమయంలో ఏమిటీ విపరీత్యం శారదా?" అంటూ నిల్చుండిపోయాడు. శారద ఇటూ, అటూ కదిలిపోతోంది. మధు తలుపుకొట్టాడు. ఇటువంటి సమయాల్లో ఎవరూ, ఏ పరిస్థితిలోనైనా తలుపుతీయరు తెల్లవారేదాకా. ఇక్కడా అంతే జరిగింది. శారద నోట్లో మంచినీళ్ళుపోశాడు మధు. ప్రక్కకిపడిపోకుండా తానూ ప్రక్కనే కూర్చున్నాడు. పదినిమిషాలు గడిచాయి. శారదకేమీ తగ్గలేదు. పైగా తన్నుకోవడం మరీ ఎక్కువయింది. మధు ఇంక ఉండబట్టలేకపోయాడు. బలంగా తలుపుకొట్టాడు. గొళ్ళెంతీసి తలుపు తెరిచింది మూర్తిభార్య... "ఓ. అన్నయ్యగారా?...శారదేమో అనుకున్నాను...ఏమిటో అంత అవసరం?" అంటూ నవ్వింది. ఆత్రుతగా మధు, 'ఏమిటోనండీ! శారదకి మూర్ఛవచ్చినట్లుంది. గిలాగిలా తన్నుకు.."

పూర్తిగా వినకుండానే, 'ఆ' అంటూ ఆమె పరుగెత్తుకొని వెళ్ళి మూర్తితల్లినీ, తండ్రినీ లేపుకొని వచ్చింది. వారు శారద నోట్లో ఏదో మాత్రవేశారు. శారద తన్నుకోవడం కాస్త తగ్గింది.

"నీవు కొంచం పక్క గదిలోకి వెళ్ళి కూర్చో నాయనా! శారదకేమీ భయం లేదు. ఇది మామూలేగా!" అంటూ మూర్తి తండ్రి అక్కణ్ణించి వెళ్ళిపోయాడు. మధుకి పంచప్రాణాలు ఎగిరిపోయాయి. ఆయన ఆఖరి మాటతో!...'మామూలు'...ఏమిటి మామూలు? శారదకి ఫిట్స్ రావడం మామూలేనా? అయితే మూర్తి తనతో ఈ విషయం ఎందుకు చెప్పలేదు? తాను వైవాహిక జీవితంమీద పెట్టుకున్న ఆశలన్నీ అడుగంటిపోలేనా? ఏం, ఆ మాత్రం చెప్పలేకపోయాడా మూర్తి? తన జీవితం నాశనం చెయ్యటం ఎందుకు? ...బుర్ర వేడెక్కిపోయింది... ఏమీ తోచటంలేదు. సుధాకర్ పక్కనపోయి పడుకున్నాడు...

"ఏరా! నిజంగా నేనుచెప్పిన పనంతా చేసేవేమిటి?...లేకపోతే, ఏమిటీ విపరీతం?"... సుధాకర్ మాటలు శూలాల్లా గుచ్చుకుంటున్నాయి. కళ్ళుమూసుకొని నిద్రపోవటానికి ప్రయత్నించాడు. కాని నిద్ర పట్టలేదు... ఎటుచూచినా శారద రూపమే కనబడుతోంది...నవ్వుతూ తనను పిలుస్తున్నట్లు, తాను పరుగున ఆమెను చేరినట్లు, ఆమె వెంటనే క్రింద పడిపోయినట్లు, పీడకలలు — అంధకారబంధురమైంది తన జీవితం- ఇక అక్కడ తను ఉండిమాత్రం చేయగలిగిన దేముంది?...మధు లేచి నిల్చున్నాడు. ఆ గదిలో కనపడిన తన సామానన్నింటినీ హోల్డాల్‌లో కట్టివేశాడు...

శారద

ఇంట్లో అందరూ నిద్రలో ఉన్నారు...ఎవరికీ మెలకువకలుగనీయనంత మెల్లగా తలుపు తీసి, స్టేషన్‌కి చేరుకున్నాడు.

ఇంకా పూర్తిగా తెల్లవారలేదు...ఒక్క అరగంటలోపలే రైలెక్కి, శారదాసమక్షంలో సంతోషంగా ఉందామనుకున్న మధు, ఆమెకి దూరమైపోయాడు.

* * *

మధు వెళ్ళిపోయి పదిరోజు లయింది. మూర్తి తోటలో ఒక్కడూ కూర్చుని ఉన్నాడు. అతని చేతిలో మధు వ్రాసిన ఉత్తరం వొకటి ఉంది. అందులోని కొన్ని వాక్యాలు అతను ఎంత వద్దనుకొన్నా జ్ఞాపకమొస్తూ, అతణ్ణి అమితంగా బాధపెడుతున్నాయి...

...'కొద్దిపాటి మంచితనంతో, ఆశయాలతో, జీవించ ప్రయత్నిస్తే 'అనుభవాలకి హద్దులు ఉంటాయి' అనుకొన్న అభిప్రాయం తప్పని తెలిసింది'...

...'ప్రాణ మిత్రుడివి కదా అని సర్వం నీ చేతిలో పెడితే, ప్రాణమే తీసుకొంటావా'

...'నాభావి జీవితానికి శారద వింత మెరుగులు దిద్దుతుందని చెప్పావు...నమ్మాను... మోసపోయానని తెలుసుకొనేవరకే పరిస్థితులు చెయ్యిదాటిపోయాయి.

ఆఖరి వాక్యమే అతనికి కొద్దిగా ఉపశమనమిచ్చింది...

సబ్-ఎడిటర్: [ఎడిటరుతో] సార్! మన పత్రికలో మూడవ పేజీలో నాలుగు లైన్లు ఖాళీగా ఉన్నాయిసార్.

ఎడిటర్: అదిగూడ అడగాలటయ్యా! ఏదో ఒకటివేయ్. ఆఁ...విశాఖపట్టణంలో విమాన ప్రమాదమని వెయ్యిపోఁ...

సబ్-ఎడిటర్: [మరికొంత సేపటికి తిరిగివచ్చి] ఏడవ పేజీలో 2 లైన్లు ఖాళీగా ఉన్నాయి సార్!

ఎడిటర్: అబ్బబ్బ! అన్నీ చెప్పాలా..."3 వ పేజీలో వేసిన విమాన ప్రమాదం పొరబాట"ని వెయ్యిపోఁ... 'బాల్యమిత్రులు'


...'శారద నీ చెల్లెలే కావచ్చు. కాని ఇప్పుడామె నా భార్య! నీవు చేసిన తప్పులకు వేరొకరి జీవితం నాశనం కావటం నాకిష్టంలేదు. శారదని త్వరగా పంపించవలసింది'

అప్రయత్నంగా మూర్తి కళ్ళవెంట రెండు బిందువులు రాలి ఉత్తరం మీద పడ్డాయి... బరువైన హృదయంతో అతనింటికి మరలాడు.

* * *

ఏమయితేనేం; తనను తాను సంబాళించుకొని, కాపురం పెట్టాడు మధు. మొదటి రోజునే సహృదయంతో శారదతో చెప్పాడు: "నీవు నావలన భయపడి మూర్ఛలు తెచ్చుకోవలసిన కారణమేమీ నాకు కనపడటంలేదు. నేనూ మనిషినే...నాకూ హృదయంవుంది...నీబాధని తెలుసుకొన్నాను. నీకేలోటూ రాకుండాచూసుకుంటూఆనందంగా గడపాలనే నా కోరిక కూడా. ప్రతి చిన్న విషయానికీ బాధపడకుండా చూసుకో... అంతకన్నా నేను వేరేచెప్పవలసిందేమీలేదు" అతనిమాటలు శారద హృదయాన్ని హత్తుకున్నాయి...అంతే...ఆ నాలుగు రోజులూ చాలా ఆనందంగా గడిచాయి. అయిదవ రోజున శారదవెంట వచ్చిన అన్నపూర్ణమ్మగారు వెళ్ళిపోయారు. ఆమె వెళ్ళిపోగానే శారద వంటచేయటం మొదలెట్టింది. ఆమె చేసిన వంటల్ని ఎంతో మెచ్చుకుంటూ భోజనం చేసి, కాలేజికి వెళ్ళాడు మధు ఎంతో సంతోషంగా.

ఇంటికి వచ్చేసరికి అయిదయింది. సరిగ్గా అప్పటికే జడవేసుకోవడం పూర్తిఅయింది శారదకి. దువ్వెనలోంచి చిక్కుతీస్తోంది. మధు వస్తూనే అన్నాడు, "శారదా, నీవు పోయి తొందరగా ముఖంకడుక్కొని రా... ఇవాళ సినిమాకివెళ్దాం" అని...శారద తల వంచుకొనే, మెల్లిగా అంది. "నేనురానండి! ఆసినిమాలో ఏమన్నా హృదయాన్ని బాధించే సన్నివేశాలుంటే మళ్ళీ పడిపోవలసివస్తుంది. అంతమందిలో బాగుండదు" అని. మధు సంతోషం వొక్కసారిగా కరిగిపోయింది. "నిజమే! నాకాఊహ తట్టనే లేదు", నిరాశాజనకంగా ఉన్నాయి ఆ మాటలు—కోటు విప్పి హేంగర్‌కి తగిలిస్తూంటే జేబులో ఏదో ఎత్తుగా తగిలింది. అప్పుడు జ్ఞాపకం వచ్చినట్లుంది నవ్వుతూ అన్నాడు: "శారదా, నీకోసం ఏంతెచ్చానో చెప్పుకో ఇవాళ?" అని..."ఏమిటండీ అది ...చెప్పరూ?" ఆత్రుతతో అంది శారద. అయితే నువ్వువెళ్ళి త్వరగా ముఖంకడుక్కొని రా! అప్పుడు చెప్తాను" అన్నాడు. శారద బాత్ రూంలోకి వెళ్ళిపోయింది. మధు బట్టలు మార్చుకున్నాడు. ఈలోపల. శారద ముఖం తుడుచుకొనివచ్చి మధుప్రక్కన నిలబడింది. ఎంతో ప్రశాంతంగా, అందంగా



"అరే ఎవరూ చూట్టలేదే"

—వి. జి. కృష్ణమూర్తి.

కనబడింది శారద మధుకళ్లకి. అలాగే చూస్తూ కూర్చున్నాడు ఆమెకేసి. "ఏమిటండీ అలా చూస్తున్నారు? నేనేమన్నా వింతగా కన్పడుతున్నానా?" ఎంతో అమాయకంగా ఉంది ఆ ప్రశ్న...'ఎంత ముద్దుగావున్నావు శారదా!' ఇంకా చూస్తూనే అన్నాడు. 'ఆ ఊరుకోండురూ!' అంటూ శారద మాట మార్చింది. "ఇంతకీ ఆ తెచ్చినదేమిటో చెప్పనేలేదు!"...మధుకి అప్పుడు జ్ఞాపకం వచ్చింది. అవును మర్చిపోయాను...నువ్వు కళ్ళు మూసుకోవాలి, మరి"అంటూ లేచాడు.

శారద కళ్ళు మూసుకొంది. ఆమె ప్రక్కగా చేరాడు మధు. "ఇదిగో, నువ్వు గట్టిగా శ్వాసపీల్చు" అంటూ ఆమెజడలో తను తెచ్చిన మల్లెపూలదండ కూర్చి, జడ ముందుకు వేశాడు. ఆమె ఏమిటోననుకుని గబగబా శ్వాసపీల్చింది. వెంటనే క్రిందపడిపోయింది. "ఏమిటిశారదా, మళ్లీ ఏమొచ్చిందని పడిపోయావ్!" మధు గాబరాతో అన్నాడు. శారద మాట్లాడలేదు. తన్నుకోవటం మొదలెట్టింది. మళ్ళీమూర్ఛవచ్చింది. మధు ఆమెని మంచంమీద పడుకోబెట్టాడు. అలమారులోనున్న సీసాలోంచి ఒకమాత్ర తీసి ఆమె నోటిలో వేశాడు. శారద తన్నుకోవటం మెల్లి మెల్లిగా తగ్గింది. అయిదు నిమిషాల్లోనే ఆమెకి స్పృహ వచ్చింది. ప్రక్కనే కూర్చుని పరిచర్యలు చేశాడు మధు. అరగంటలో కళ్ళు తెరిచింది శారద. మధునప్పు చూసింది. "ఏమిటి, శారదా! మళ్ళీ పడిపోయావేం?" ఎంతో జాలిగా ఉంది ఆ ప్రశ్న. తల క్రిందికి దించుకుంటూ అంది శారద, "...నేను హోమియోపతీ మందు తీసుకుంటున్నాను కదండీ? ఈ వైద్యానికీ, కాఫీలూ, సువాసన పదార్థాలూ మొదలైనవాటికీ పొత్తు కుదరదు. వాటివల్ల రోగం ఎదురు తిరుగుతుంది. మీరేమో మల్లెపూలు ముడిచారు. మరి!"... మధుతల తిరిగిపోయింది. "సరే! నువ్వు పడుకొని విశ్రాంతి తీసుకో కొంతసేపు" అంటూ తను పక్కగదిలోకి వెళ్ళిపోయాడు. పడక కుర్చీలో కూర్చొని ఆలోచనాసాగరంలో మునిగిపోయాడు..."ఏ విధంగా తయారైంది తన జీవితం! భార్య చక్కగా పూలు ముడుచుకొని ఎదుట నిలబడితే చూడలేడు; కలిసి ఒక్క సినిమా చూడలేడు. తను..." అలాగే నిద్రపోయాడు. రాత్రి ఎనిమిది గంటలకి నిద్రలేపింది శారద. "ఎలా వుంది నీకు శారదా?" అని అడిగాడు..."నాకేం? బాగానే ఉన్నానండీ...ఏదో ఓ గంట ఉంటుందంతే...ఆ తరువాత మామూలు మనిషినే." అంది శారద. 'ప్రశాంతతకోసం మనుష్యులందరూ వాహ్యాళికి వెళ్ళే సాయంకాల సమయంలోకూడా తాము ఇల్లు వదిలి వెళ్ళలేక పోయామే' అన్న భావం మనస్సులో మెదుల్తూండగా, బరువుగా నిట్టూర్చి, భోజనానికి లేచాడు మధు.

* * *

పదిహేనురోజులు గడిచాయి.

చిన్న చిన్న విషయాలకే బాధపడే శారద హృదయం గాయపర్చకుండా ఉండాలని మధు సకలప్రయత్నాలు చేసేవాడు. ఆకస్మికంగా వచ్చే ఆమె మూర్ఛలవల్ల అతనికి ఎన్నో నష్టాలు వాటిల్లుతూండేవి...ఒక రోజున తాను పాతికరూపాయలు ఖర్చు చేసికొన్న 'టీ సెట్టు' కడుగుతూండగా, మూర్ఛవచ్చి పడిపోయింది శారద... సెట్టంతా విరిగిపోయింది. అయినా శారద ఎక్కడ బాధపడుతుందో అని అతను ఆమెని ఏమీఅనలేదు...ఇది జరిగిన మూడురోజులకే వేరొక అనర్థం జరిగింది. దాసీమనిషి రాని కారణంచేత ఆ రోజు శారదే ఇల్లు ఊడుస్తోంది. గాజుబీరువాని పక్కకి నెట్టి, ఊడుస్తుండగా మూర్ఛ వచ్చేసింది...పట్టుతప్పి, గాజుబీరువా బోరగిలా పడిపోయింది. శారదకి స్పృహవచ్చినతరువాత చూస్తే బీరువా గాజు పూర్తిగా విరిగిపోయింది...అందులో ఎంతో ప్రేమతో మధు దాచుకుంటున్న గాజుసామానులు, గ్రామఫోను రికార్డులు కూడా తునాతునకలైపోయాయి...అప్పుడే కాలేజీనుంచి తిరిగివచ్చిన మధు ఇదిచూచి స్తంభించిపోయాడు... ఆ సన్నివేశంలో కూడా గొప్ప ఆత్మనిగ్రహం చూపించాడు మధు. తనకెంత బాధకలిగినా, శారదపై మాత్రం నోరు జారలేదు...బహుశః ఈ విషయం పూర్తిగా మరిచిపోయేవాడేమో కూడా...కాని...ఆ రోజు తిరిగి తిరిగి వచ్చి పడుకున్నాడు. భోజనము కూడా సరిగ్గా చేయలేదు. రాత్రి నిశ్శబ్దముగా ఉంది. పగిలిపోయిన బొమ్మల ముక్కలన్నీ వెయ్యి కంఠాలతో అరుస్తున్నట్టు భ్రాంతి కలిగింది. మనస్సుకి శాంతి కలగటం లేదు. ఏదో చెప్పలేని బలహీనత తన్ను లొంగదీసుకుంది. గ్రామఫోన్ రికార్డు ముక్కలు వెక్కిరించినట్టున్నాయి. ఇంత కాలంనుంచీ అణుచుకుంటున్న హృదయ భారం ఒక్కసారిగా పెల్లుబికింది...ఇక ఏం చెప్పాలి?......

ఆ మర్నాటినుండీ మధు తనను తాను సంబాళించుకోలేక పోయాడు. శారదమీద విసుగూ, కోపం ప్రారంభమయాయి. ఇంట్లో శాంతి, సుఖమూ దూరమైపోయాయి. ప్రతి చిన్న విషయానికీ శారదని కసురుకోవటం మొదలెట్టాడు. శారద మధులో కలిగిన మార్పుని చూచి భయపడిపోయింది... అయినప్పటికీ మధుతో ఎంతో శాంతంగా, అణకువగా ప్రవర్తించేది......ఆరోజున మధు ఇంటికి వచ్చేసరికి ఎనిమిది దాటింది. అతను విసుగ్గా కూర్చుని బూట్లు విప్పుకొంటున్నాడు. "క్లబ్బుకి వెళ్ళారేమిటండీ; ఇవాళ?"......ఇంకా పూర్తికాకముందే మధు రెచ్చిపోయాడు, "ఏం? అక్కడన్నా శాంతంగా కూర్చోకూడదా? నేనొక్క క్షణం సుఖంగా ఉండటం నీకిష్టం లేదు".....శారద నిశ్చేష్టురాలైపోయింది ఈ మాటతో......'మిమ్మల్ని వెళ్ళొద్దని నేను అన్నానా చెప్పండీ?' అని మెల్లిగా అంది. కాని మధు ఆమెని అర్థంచేసుకొనే పరిస్థితిలో లేడు. "ఎందుకు మాటలు మారుస్తావు? నేను సుఖంగా ఉండటం నీకిష్టం లేదని స్పష్టంగా చెప్పెయ్యకూడదూ?" అని నిర్దయగా అన్నాడు. శారదకి కళ్ళ నీళ్ళు తిరిగాయి ఈ మాటలతో. "నేను కొన్న ముహూర్త మెటువంటిదో! ఎప్పుడూ ఏడుపులేకదా ఇంట్లో" అంటూ లోపలికి


కొద్ది సన్‌లైట్ చాలా బట్టలను ఉతికింది
-అట్లు చేసినట్టిది దాని అధిక నురగ
SUNLIGHT SOAP
Rs. 10,000 Reward!
నాయనమ్మ మెచ్చుకొంటున్నది: అనేక సంవత్స రాల అనుభవంగల నాయనమ్మ సన్‌లైట్ సబ్బుతో లక్ష్మి ఉతికిన బట్టలను చూచి చిరునవ్వుతో మెచ్చుకొంటున్నది. షర్టులు, దుప్పట్లు, తువ్వాళ్లు ఈ బట్టలన్నిటినీ తెల్లగాను కాంతిగాను, ఉతుకుటకు లక్ష్మికి కొద్ది సన్‌లైట్ చాలును. సన్‌లైట్‌యొక్క సమృద్ధయిన నురగ చాలా బట్టలను బాదకుండానే ఎంతో బాగుగా ఉతుకును. మీ కుటుంబ మందరి బట్టలను ఉతుకుటకు సన్‌లైట్ సబ్బును వాడండి.
సన్‌లైట్ సబ్బు బట్టలను తెల్లగాను కాంతిగాను ఉతుకును
S.268-X52 TL
హిందుస్థాన్ లీవర్ లిమిటెడ్‌వారి ఉత్పత్తి

వెళ్ళాడు......శారద మళ్ళీ పడిపోయింది. ఆమెని మంచంమీద పడుకోబెట్టి తానే భోజనం పెట్టుకొని, నిద్రపోకూడదు ఆలోచిస్తూ మధు.

బరువెక్కిన కళ్ళతో మర్నాడు నిద్ర లేచాడు మధు. కాఫీతాగి, ఏవో పేపర్లు దిద్దుకుంటూ కూర్చున్నాడు. శారద ఏదో అల్లుతోంది......... "టైమెంత?" మధు అడిగాడు. రేడియో పెట్టూ, "చాలా పొద్దు పోయింది లెండి! ఇక స్నానానికి లేవచ్చు" అంది శారద సరసంగా...... "ఏమిటా తెలి తిక్క సమాధానాలు? ఎంతయిందో సరిగ్గా చెప్పలేవూ?" చాలా విసుగ్గా అన్నాడు మధు... శారదముఖం చిన్నబోయింది ... "ఎందుకండీ, అల్లా కసురుకుంటారు? సరైన టైము తెలుసుకోనటానికే రేడియో పెట్టు న్నాను. గడియారం మున్నానే..." మధు కోపంతో అందుకున్నాడు: "విరక్కొట్టావు కమా? చాలా మంచిపని చేశావు. ప్రతీ విషయానికీ 'నేనూ ఉన్నానంటూ' బయలేరడం, నాశనం చెయ్యడం! ఆ పనన్నీ నేనే చేసుకోనీ వాణ్ణిగా! ఇంట్లో ఒక్క క్షణం సుఖం, శాంతీ లేదుకదా! ఇటువంటి వాళ్ళసలు పెళ్ళిచేసుకోవట మెందుకు? ...అవున్లే... లేకపోతే నాలాంటివాళ్ళని చంపడం, ఎలా?" ఆ వేళంలో అనేశాడు... శారద నీమాటలు గాయపరిచాయి, తల తిరిగి పోయింది; కన్నీళ్ళు తుడుచుకొంటూ అంది: "ఎందుకండీ, అలా అంటారు? నాకీ జబ్బు ఉందని అన్నయ్య మొదటనే మీకు చెప్ప లేదు?" మూర్తి ప్రసక్తి వచ్చేసరికి పిచ్చికోపం వచ్చింది మధుకి. మరీ రెచ్చిపోయాడు... "ఓ అన్నయ్య శేం? చెప్పాడు...ఛీ! వాడు పురుషుడు, నమ్మేనుకదా అని ఇంత ద్రోహం చేస్తాడా? ...అతడూ ఒక మనిషేనా?"..శారదకి ఏడు పాగలేదు; సరిగ్గా నిలుచోలేక పోయింది. కళ్ళు తిరగడం మొదలెట్టాయి. మధు ఆగ లేదు. "అతడికి బుద్ధిలేకపోతే నీకన్నా లేక పోయిందా, చెప్పమనడానికి?...నన్నసలు బాధించటానికేగా నువ్వే గడప ఎక్కింది? ఇప్పుడైనా నీకు సుఖంగా ఉందా?"... మళ్ళీ శారద పడిపోయింది. ఈసారి మధుకి భయం కలుగలేదు. పైగా కోపం మరీ ఎక్కు వయింది..."ఇంకేం పనుంది? ఏమన్నా అంటే సత్యాగ్రహం! మంచి ఆయుధం సంపాదించుకున్నావులే!..." శారద తిన్న కోపటం మొదలెట్టింది. ఎంత కోపంతో ఉన్నా మధుకి ఆమెని మంచంమీద పడుకో బెట్టక తప్పలేదు. దాసీమనిషితో శారదని చూడమని చెప్పి తాను కాలేజీకి వెళ్ళి పోయాడు.

నాలుగింటికి అతని ఆఖరి పీరియడ్ అయిపోయింది. ఇంటికిపోవడానికి మన స్కరించలేదు. బీచికి పోయి కూర్చున్నాడు.

శారద

అతనికి శారదే జ్ఞాపకంవస్తోంది. "తను వివాహం చేసుకొన్నది ఈ విధంగా పరితపించ డానికేనా? తన బ్రతుకులో పరిమళమే పోయింది...శారద ఉండిమాత్రం తనకేం లాభం?...అతనికి మధ్యాహ్నమే తను క్లాసులో ఇచ్చిన లెక్చరు జ్ఞాపకమొచ్చింది. 'ఫర్ సేకెన్ మర్ మన్' అన్న పద్యం పూర్తి చేశాడు. "మర్ మన్" అనేది సగం మానవా కారం, సగం చేపాకారం కల జీవం ... మార్గరేట్ అనే ఒక యువతి ఒక మర్మన్‌చే ఆకర్షింపబడి, అతణ్ణి పెళ్ళి చేసుకొని, సముద్ర గర్భంలో జీవిస్తూ, పిల్లల్ని కూడా కంటుంది.

> **మిడిమిడి జ్ఞానం**
>
> ఇంగ్లీషు సరిగా రాని ఒక పెద్దమనిషి, పరీక్ష ఫస్టు క్లాసులో ప్యాసయిన ఒక విద్యార్థి తండ్రితో ఇలా అన్నాడు:
>
> పెద్దమనిషి: (కంగ్రాట్యులేషన్స అనుటకు బదులుగా) చాలా థేంక్సండీ, మీవాడు ఫస్టుక్లాసులో ప్యాసయ్యాట్ట.
>
> తండ్రి: (తెల్లబోతూ) మా వాడు ప్యాసయితే మధ్యన మీ రెందుకండీ థేంక్సు చెప్తారు?
>
> పెద్ద: (తన తప్పును తెలుసుకొని) అదికాదండీ, మీ వాడిని మా అల్లుడుగా చేసుకుందా మనుకుంటున్నాము, మరి అటువంటప్పుడు మా అల్లుణ్ణి (కాబోయే) అంత కష్టపడి చదవించినందుకు మీకు థేంక్సు చెప్పాలా? వద్దా? మీరే చెప్పండి
>
> తండ్రి: ఓహో! అదా సంగతి. దాపరికేముంది లెండి అంతా దైవాధీనం.
>
> వై. క్రిష్ణమూర్తి (విశాఖపట్నం)

కొన్ని సంవత్సరాల తరువాత ఒక ఈస్టర్ పండుగనాడు, చర్చికి వెళ్ళి, ప్రార్థించిరావడానికి అనుమతిపొంది, భూమిమీదికి తిరిగి అనుగిమస్తుంది. తిరిగి మార్గరెట్ రాదు. మర్మన్, అతని పిల్లలూ ఆమెని సంస్మరిస్తూ బాధపడటంతో కథ ముగుస్తుంది." లెక్చరు ముగించగానే, లత లేచి, "అయితే, మార్గరేట్ కేరక్టర్ ఎటువంటిదని వ్రాయాలి సర్?" అంటూ ప్రశ్నించింది. మధు సమాధానం చెప్పాడు..."మార్గరేట్ తనకు తానే సమ్మతించి మర్మన్‌ని చేసుకుంది. ఆమె వల్లన అతనికి పిల్లలు కలిగారు. ఆమె కర్తవ్యం ఏమిటి అప్పుడు? తన పిల్లల్నీ, భర్తనీ మోసం కోవడమేకదా? తనజీవితం పాపపంకిలం అయిపోయిందని చర్చికివెళ్ళి పవిత్రగ్రంథాలు తిరగవేస్తే ఉత్తములైపోతుందా?...తన జీవితంలో ఒక ముఖ్యసోపానమే నిర్వర్తించలేకపోయిందామె"...అతనికి శారద జ్ఞాపకంవచ్చింది ఈ సమయంలో. ఆ వేళంతో ముగించాడు...

"తను సుఖపడలేకపోయినా, తనవలన ఇతరులకి బాధకలిగేటట్లుమాత్రం ఎవరూ ప్రవర్తించకూడదు. ఈ దృష్ట్యా మార్గరేట్‌కి మనసానుభూతి నందించలేము ..." పీరియడ్ అయిపోయినతరువాత తాను వెళ్ళి పోతూంటే, లత నవ్వుతూ తన స్నేహితురాలితో అంటున్న మాటలు వినపడ్డాయి: "బహుశః మన మాష్టారుగారికి తన జీవిత సర్వస్వం అర్పించే భార్య దొరికివుంటుంది! చెప్పినదల్లా చేస్తూ, ఎప్పుడూ ఆయనగార్ని వదలకుండా ఉంటుంది కామోసు...అందుకనే మాష్టారుగారు 'మార్గరేట్'ని క్షమించలేకపోయారు"—

ఈ మాటలు జ్ఞాపకం రావడంతో మధు ఆ వేళప్రారంభించాడు...'శారద ఎలాంటిదో లతకేం తెలుసు?'...అనుకున్నాడు ఏమైనాసరే, చూస్తూ చూస్తూ తనచేతులారా జీవితం నాశనం చేసుకోలేడు ... తను ఇక శారదతో కలిసి ఉండలేడు. శారదని వాళ్ళయింటికి పంపించివేసి తను తిరిగి సంసారం ఏర్పాటుచేసుకోవాలి. ఇది తన ఆశయాలకి విరుద్ధమైనా చేయక తప్పదు. ఇవాళే ఉత్తరం వ్రాసెయ్యాలి మూర్తి వాళ్ళకి, శారదని వచ్చి తీసుకు వెళ్ళమని...

నిశ్చల మనస్కుడై ఇంటికి చేరుకొన్నాడు. బయట గది తెరిచేవుంది... బూట్లు విప్పుకుంటూ ఉంటే లోపలి గదిలో నుంచి ఖమాస్ రాగంలో వీణపాట వస్తోంది. ...అది అతనికి విసుగు కలిగించింది. అతనిప్పుడు సంగీతాన్ని విని ఆనందించే పరిస్థితిలో లేడు. "అబ్బ! ఏమిటా గోల? రేడియో కట్టేసెయ్" విసుగ్గా అన్నాడు. రేడియో కట్టబడలేదు. అతనికి కోపం ఎక్కువయింది. "మనుషుల కొకసారి చెప్తే అర్థం అవుతుంద

"...లేదేమో కష్టమంటే నీక్కాదూ చెప్పేది?"
"...లేదేమో. ఇంకా కష్టపడలేదు. మధుకి పిచ్చికోపం వచ్చేసింది. తనను తాను సంబాళించుకోలేకపోయాడు. "చెప్పు నీక్కాదూ!" అంటూ అరుస్తూ లోపలికి పరుగెత్తాడు... కాని... గుమ్మం దాటిన వెంటనే ఆగిపోయాడు... అతని ముఖకవళికలు మారిపోయాయి... విసుగూ, కోపమూ బదులు సంతోషరేఖలు ప్రస్ఫుటించాయి అతనిలో ... తనకళ్ళను తానే నమ్మలేకపోయాడు... అవును శారదే!... వీణ వాయిస్తోంది... ఎంత అద్భుతంగా వాయిస్తోంది! తను నిజంగా శంకరశాస్త్రి రికార్డ్ వస్తోందనుకున్నాడు... 'శారదా' అని మెల్లిగా పిలిచాడు మధు. ఇంతవరకు అతన్ని గమనించని శారద ఆ పిలుపుతో ఒక్కసారిగా మధువైపు చూసింది. వెంటనే పాట ఆపేసింది. మధు ఆమెదగ్గరగా వెళ్ళి, "ఏం శారదా? నేను వినకూడదా, నీపాట? అని జాలిగా అడిగాడు. శారద తలవంచుకొని, 'మీకు విసుగు కలిగిస్తుందేమోనని...' అంది ... మధు చాలా బాధపడ్డూ అన్నాడు. 'ఎంత కష్టాల్లోనైనా సంగీతం విని ఆనందించగల హృదయం వుంది శారదా! అయినా వినడానికైనా అర్హత వుండాలిగా!... నీకంత బాగా వీణ వచ్చని నాకు తెలియదు. అదైనా ఇప్పుడు తెలియకపోతే, నేనేం

శారద

చేసేవాణ్ణో..." శారద భయపడుతూ అడిగింది, 'ఏం చేసేవారండీ?' అని. అప్రయత్నంగా మధు కళ్ళవెంట నీళ్లుతిరిగాయి. 'ఆ ప్రశ్న మాత్రం నన్నడగకు శారదా!' అంటూ కాళ్లుకడుక్కోడానికి వెళ్లిపోయాడు..

భోజనం చేస్తున్నప్పుడు, "నీకు వీణ వాయించటం వచ్చని ఎప్పుడూ చెప్పలేదే?" అన్నాడు మధు ఎంతో లాలనగా. శారద కొంచెంగా సిగ్గుపడింది. కంచంలోకి చూస్తూ అంది: "అన్నయ్య చెప్పాడేమో అనుకున్నానండీ! పెళ్ళికిముందే వీణ పాడయింది. బాగుచేయించటానికి ఇచ్చాను. ఇవాళ అన్నయ్య వచ్చినప్పుడు తీసుకొచ్చాడు". మధు ఆశ్చర్యంగా "మూర్తి వచ్చాడా ఇవాళ? ఏడీ?" అంటూ అడిగాడు. అభిమానం ఉట్టిపడింది ఆ ప్రశ్నలో. శారద ఆశ్చర్యం ప్రకటించింది: "మీ కాలేజికి రాలేదండీ? తొందరగా మళ్లీ ఊరికి వెళ్ళిపోవాలని, నేనెంత పట్టుపట్టినా ఉండకుండా వెళ్ళిపోయాడు. వస్తే ముందు మిమ్మల్ని కాలేజిలో కలుసుకుంటానని అన్నాడు. వీలుపడలేదేమో మరి." మధుకి బాధకలిగింది. మూర్తి కావాలనే తనను కలుసుకోకుండా వెళ్ళాడని గ్రహించాడు.

మంచంవాల్చి పక్క వేస్తున్నప్పుడు "నీవు వీణ ఎప్పుడు నేర్చుకున్నావు?" అని శారదనడిగాడు మధు. శారద చెప్పింది: "పదో యేటప్పటినుంచీ నాకీ మూర్ఛలు వచ్చేవి. మనసంతా పాడవకుండా దేనిమీదైనా లగ్నంకావాలనీ, ఎప్పుడూ సంతోషంగా ఉండేటట్లు చూడాలని డాక్టర్లు చెప్పేవారు. అందుకని వీణ చెప్పించారు. ఎప్పుడూ అదే వాయించుకుంటూ కూర్చునేదాన్ని."

"మధు ఏ ధ్యాసలో ఉన్నాడో శారదవైపు చూస్తూ ఒక్కసారిగా అన్నాడు: "రేపట్నుంచి క్లబ్బుకి వెళ్ళను, శారదా! ఇంటికి నాలుగుగంటలకల్లా వచ్చేస్తాను. సాయంకాలంపూట అలా షికారుకి వెళ్తూవుందాం... రోజూ నాకోగంట వీణ నేర్పుతూవుండు. పాడ్డానికి కంఠం లేకపోయినా కనీసం ఉన్న అభిలాషను వాయిస్తూనయినా తీర్చుకోవచ్చు..."

శారద ఆశ్చర్యచకితురాలై పోయింది... ఇతనిలో కలిగిన మార్పును చూసి ఆమె నమ్మలేకపోతోంది. "ఇంతటి కళాత్మక హృదయమా ఇతనిది? అది తను గ్రహించలేకపోయానే?" అనుకుంది. 'తప్పకుండానండి!' అంటూంటే ఆమెకళ్లు వికసించాయి.

శారద వంటింటిపని సవరించుకోవడానికి లోపలికి వెళ్ళిపోయింది. శారద వచ్చేదాకా ఏదైనా పుస్తకం చదువుకుందామని టేబిల్ దగ్గరకు వెళ్ళాడు మధు. మూర్తి వ్రాసిపెట్టిన లేఖఒకటి దానిమీద వుంది. ఆత్రతగా తీసి చదువసాగాడు.

"మధూ!

నీ వొకసారి నాకో పుస్తకం ప్రెజెంట్ చేస్తూ, దానిమీద – ప్రేమ్‌చంద్ వాక్యం కోటేసు – "దాంపత్య జీవితానికి అమరానందాన్ని కలుగచేయడానికి మూలకందమైనది ఆత్మీయపరిజ్ఞానం. అదే ముఖ్యమైతే..." అంటూ ఏమేమో వ్రాశావు. జ్ఞాపకం వుందా? ఈ నిజాన్ని నీ వంతవరకు తెలుసుకున్నావో నేను గ్రహించలేకపోతున్నాను. నీగురించి మీపక్కయింటివాళ్లనివాళ అడిగాను. నీవు కొన్నాళ్ళనుండి శారదను విసుగ్గానూ, కోపంగానూ చూస్తున్నావని చెప్పారు. ఇదేనా నీవు దాంపత్యజీవితంలో చూపించే 'ఆత్మీయపరిజ్ఞానం?' శారద ఎప్పుడైనా నీమాటకు ఎదురుతిరిగిందా? నీవు కోపంలో అన్న ప్రతిమాటా దానిహృదయాన్నెంత బాధించిందో గ్రహించగలిగావా? నీ ప్రవర్తనే ఇలాగుంటే దాని మూర్ఛలూ అవీ ఎలా తగ్గుతాయనుకున్నావ్? మనం చదువుకొనేరోజుల్లో, 'ఏమీ బాధలనుభవించని అమ్మాయిని చేసుకొని సంసారం చేసేకంటే, ఒక వ్యధితహృదయాన్ని చేసుకొని ఆమెకు సంతోషం ప్రసాదించటంలో

గొప్పతనం వుంది. ఇదే ఆశయంగా పెట్టుకోవాలి జీవితంలో' అంటూ ఏమేమో అనేవాడివే! ఏమయ్యాయి ఆ ఆశయాలు? మనుషుల నర్తంచేసుకొని, నీ ఆశయాల నణచుకోకుండా జీవిస్తా వనుకున్నాను... కాని పొరపడ్డా ననిపిస్తోంది...

నేనే నిన్ను మోసంచేశా ననుకున్నావట కదూ?...ఏమోమరి. నే నెంతోమంది వైణికుల్ని చూశాను. మా శారదలాగా వాయించేవారెవరూ నాకుకనపడలేదు. అటువంటికళా హృదయాన్ని నీకు అర్పించటం మోసమా? నాకు తెలిసినంతవరకూ మూర్ఛరోగాలు ఎవరినీ జీవితాంతం పీడించలేదు. దాని ప్రభావం కొన్ని సంవత్సరాలు మాత్రమే ఉంటుంది. ఆతరువాత దానంతటదే పోతుంది. ఆసమయములోనే రోగికి ఆత్మబలం చేకూర్చాలి. మా శారదకు కరువైన ఆత్మబలం, సంతోషం నీ వివ్వగలుతా వనుకున్నాను... కాని... కాదనిపిస్తోంది...ఏంచేస్తాం? ... అనుభవించాలి......"

మధుకళ్ళలో నీళ్ళు తిరిగాయి. శారదా, మాటలను తను సరిగ్గా అర్థంచేసుకోవలేక పోయానే అని బాధతో కుమిలిపోతున్నాడతను. 'ఇక జన్మలో మీమనసుల్ని కష్టపెట్టను' అని మనస్సులో అనుకున్నాడు.

శారద చేతులు తుడుచుకుంటూ వచ్చింది. మధు ఆమెవైపు చూశాడు. ఎంతనిర్మలంగా అమాయకంగా ఉందో ఆమె!

"శారదా! నిన్నెంతగానో దుఃఖపెట్టాను కదూ?" హీనస్వరంతో అన్నాడు.

శారద కళ్ళల్లో నీళ్లుతిరిగాయి ఈమాటలో. ఆమెసంతోషం వర్ణనాతీతం. మధుని సముదాయిస్తూ, "ఏమిటండీ అలా అంటారు? మీ రెంతో మంచివారు కాకపోతే నాలాంటి అభాగ్యురాలికి ఆశ్రయమిస్తారా? నే నెంతో అదృష్టవంతురాలిని" అంటూ అతని చేతుల్లో వాలిపోయింది.

*   *   *

జీవితసాగరంలో ఒడుదుడుకులు లేని కుటుంబాలు అంటూ ఉండవు. చాలామంది వాటిని ఎదుర్కోలేరు. సాహసించి ఇటువంటి పరిస్థితులను కొనితెచ్చుకొనేవారి సంఖ్యే అరుదు. ఆ కొద్దిమందికూడా తాము ఎవరికోసమైతే త్యాగానికి సిద్ధపడుతున్నారో, వారివద్దనుండి ఒక ప్రత్యేకమైన అనుభూతి పొందకపోతే, తమ జీవితాన్నే ఒక వ్యర్థమైనదిగా పరిగణించడం మొదలెట్టారు.

శారదా, మధూల విషయంలోకూడా ఇంతే జరిగింది. మధు శారదవలన పడే బాధలకి ఉపశమనం శారద వీణాగానాన్నుండి వచ్చింది. హర్షపులకితుడయ్యాడు అతను. ఆ మానవాకారంలోనే అపరశారదను దర్శనము చేసుకోగలిగాడు.

*   *   *

తెల్లవారుజామున నాలుగుగంటలసమయం. మధుకి మెలుకువ కలిగింది. టేబుల్ లైట్ వేసి, అయిదు నిమిషాలపాటు వ్రాశాడేమిటో...మంచంమీద శారద పడుకునే వుంది. ప్రక్కగా కూర్చున్నాడు. 'ఎంత నిర్మలంగా ఉందో శారద వదనం?'... అలాగే చూస్తూ కూర్చున్నాడు. అలారం మోగింది. శారద కళ్ళు నులుముకుంటూ లేచి అలవాటుప్రకారం మంగళసూత్రం కళ్ళకద్దుకొంది. మధు ఆమెవంకే చూస్తున్నాడు ఇంకా... "అల్లా చూస్తున్నారేం? నేనేం వింతగా కనపడటం లేదుకదా?" చాలా అమాయకంగా అడిగింది...

"ఏం, చూడకూడదా?" మధు పెంకిగా అడిగాడు.

"రాత్రల్లా పడుకోలేదండీ?" శారద మాటమార్చింది.

"పడుకున్నాను శారదా! ఇప్పుడే లేచాను. మూరకి ఉత్తరం వ్రాసి ఇలా కూర్చున్నాను" అన్నాడు.

"ఏమని వ్రాశారేమిటి?" కొద్దిగా భయపడుతూనే అడిగింది శారద.

"టేబుల్ మీదఉంది, చూడు" అన్నాడు మధు.

శారద పక్కకు చెదిరిన పమిటను సర్దుకుంటూ మంచందిగింది. టేబుల్ లైట్ వెలుతురులో ఆఉత్తరం చదువుకొంది; "మూర్తీ!...శారదంటే ఏమిటో ఇప్పుడు తెలుసుకున్నాను...ఇకనుంచి నా ప్రాణం కన్నా అధికంగా చూసుకొంటాను. ఇంతవరకు ఆమెను సరీగ్గా అర్థం చేసికొనక మిమ్మల్నందరినీ బాధపెట్టినందుకు నేనెంతో సిగ్గుపడుతున్నాను" ... శారద అమితాశ్చర్యంతో మధువైపు చూసింది.

"కాసేపు వీణ వాయిస్తావా?"...మధు అడిగాడు.

ముఖ ప్రక్షాళనం చేసుకొనివచ్చి, వీణ ముందేట్టుకొని, భూపాలం ఆలాపించింది శారద. మంచంమీద పడుకొని శారద పాట వింటున్న మధు తన్మయత్వం పొందాడా గానంతో...'ఎంత పుణ్యం సంపాదించిందీ?' అనుకున్నాడు.

పాట పూర్తవగానే మధు అన్నాడు: 'ఇవేళ తొందరగావచ్చి...'

"వచ్చి ఏంచేస్తారేమిటీ?" మధ్యలోనే చిలిపిగా అడిగింది శారద.

"నీ పాటకు తాళం వేస్తూ కూర్చుంటాను" అన్నాడు.

శారదముఖం హాసప్రఫుల్లమైంది. మంచం మీద కూర్చుంటూ నిజంగా "మీలాంటివాళ్ళు మానవకోటిలో..." అని ఏమో అనబోతూంటే,

"జంతుసమానులు కదూ?" అన్నాడు లేచి కూర్చుంటూ మధు.

"కాదు! దేవతా స్వరూపులండీ!" అంటూ అతని భుజం మీద వాలిపోయింది శారద

★



వనితాలోకం

ముఖారవిందం


భూపతిరాజు సరస్వతి

భగవంతుని సృష్టిలో ప్రతివారూ అందంగానే ఉంటారు. అసలు అందం అంటే ఏమిటి? మనకున్న అవయవములన్నీ అంత పెద్దవిగాగాని, అంత చిన్నవిగా గాని లేకుండుటయే అందం. ముఖము తెల్లగా ఉన్నంతమాత్రమున, అందమైనవారు అవరు. నల్లగ నున్నంత మాత్రమున, అందవిహీనులు కారు. ప్రతి స్త్రీకి తను అందముగా ఉండవలెననీ, తన అందము ఇతరులచేత ఆకర్షింపబడవలెననీ, కోరుకుంటుంది. ఆ కోరిక వారు కొంత కృషిచేసిన ఫలించును. ఒక స్త్రీకి ముక్కు, మూతి, కనులు ఎంత అందముగా ఉన్నా, ఆ స్త్రీ నల్లగా ఉండిన, ఆమె అందముగా లేదందురు. అట్లనుట పొరపాటు. "నలుపు నారాయణ మెచ్చు" అన్నారు. కొంతమంది తెల్లగానేవుంటారు, ఎందుకు? పాలిపోయినట్లుగా ఉంటారు. కనుక తెలుపు, నలుపులో అందచందాలు నిర్ణయించలేము. వారి అంగసౌష్టవం, ముఖమున గల కళను బట్టి అందమును నిర్ణయించవలెను.

అందరి కండ్లకు కొట్టవచ్చినట్లు కన్పించేదే అందం. మనము ఒక స్త్రీని చూచిన వెంటనే, "అబ్బ" అనిపిస్తే ఆ స్త్రీ అందమయినదనుకోవాలి. అంతేగాని చూడగా, చూడగా, అందముగా కనిపించిన స్త్రీ అందగత్తె అనిపించుకోదు. స్త్రీకి అందము నివ్వటానికి ముఖములోని అన్ని అవయవములు ముఖ్యమే. ముఖ్యముగా కండ్లు విచ్చిన తామరరేకుల్లా ఉండి ఎప్పుడూ కళకళలాడుతూ ఉండాలి. స్త్రీ కళ్ళల్లోనే ఎల్లప్పుడూ లక్ష్మి తాండవిస్తూవుంటుంది. కళ్ళకు అందం చేకూర్చే వస్తువులలో కాటుక ఒకటి అని చెప్పక తప్పదు. కాని ఆ కాటుకను కళ్ళ అందమునకు విపరీతముగా వాడరాదు. కొంతమంది కళ్ళకు అందమని కనుల చివరలకు పొడిగించెదరు. అది చాలా వికారమైన పని. మనము అందమునకు ఎన్ని వస్తువులు ఉపయోగించినను అవి అందముకొరకు ఉపయోగించితిమని ఎదుటివారి మనస్సుకు తట్టరాదు. కొంతమంది కళ్ళు పెద్దవిగా కనుపించవలెనని కళ్ళక్రింద కూడా వ్రేలెడు మందమున కాటుక పులుముకొందురు. అది వారి అందము వృద్ధిచేయుటకు బదులు, వికారమునకు దారితీయును. కనుక కాటుకను కన్నుక్రింది రెప్పలకు మాత్రమే సన్నగా పూయవలెను. అట్లు పూసిన చాలా అందముగా ఉండును. ముక్కు చప్పిడిముక్కుగా లేకున్నయెడల చాలును. ఇక ఏవిధముగనైన ఉండవచ్చును. పెదవులు సన్నగనుండి, తెల్లగా, నల్లగా కాక, కొంచెము ఎరుపుగా ఉన్నయెడల నోటికి అందముగా ఉండును. ఎర్రగా నుండవలెనని లిప్‌స్టిక్ పూయరాదు. శీతాకాలమందు పెదవులు పగిలిన వికారముగా కనుపించుటయేగాక, మనకు బాధను కలిగించును. అందుచే ఆ కాలమునందు వెన్న, నూనె, వేజులైను ఇటువంటివి పెదవులకు పూయవలెను. అందమునకు వెంట్రుకలు కూడా ముఖ్యమైనవి. వెంట్రుకలు ఒంకీలు తిరిగి ఉండిన అందము. ఎక్కువ ఒంకీలు తిరిగితే స్త్రీలకు వికారముగా ఉండును. కొంతమంది వెంట్రుకలు ఎంత పొడవైనవైనను, గుఱ్ఱపు జూలువలె బిరుసుగా నుండును. వాటికి ఎటువంటి టానిక్కులు వాడనవసరము లేదు. తల వెంట్రుకలకు కొబ్బరినూనెకంటె శ్రేష్ఠమైనది లేదు. కొబ్బరినూనెలో బావంచాలు, కచ్చోరాలు మెత్తగా గుండచేసివేసి రోజుకు రెండుసార్లు ఈ నూనె రాసుకున్నయెడల వెంట్రుకలు నల్లగా, పట్టువలె మెరయుచూ అందముగా ఉండును. కొంతమంది స్త్రీలకు వయస్సు చిన్నదైనను, తల వెంట్రుకలు నెరియును. అటువంటివారు వాటిని పెరికివేయరాదు. తలలో తెల్లవెంట్రుక లున్నయెడల కొబ్బరినూనెలో జీడివిత్తనములు నానవేసి అది తలకు వ్రాసికొనిన [illegible] వారి తెల్లజుట్టు నలుపు రంగుకు తిరుగును.

ముఖము నునుపుగా, కాంతిగా నుండవలెనన్న సబ్బు ఎక్కువ వాడుట తగ్గించుకొనవలెను. ముఖం సబ్బుతో రెండుసార్లకన్న ఎక్కువ తోమరాదు. సబ్బులో కాస్టిక్ సోడా ఉన్నదను విషయము అందరికీ తెలిసినదే. చర్మానికి కాస్టిక్ సోడా తగిలినయెడల మోటుదేలి, మచ్చలు మచ్చలుగా ఏర్పడును. స్నానమునకు ముందు నూనెగాని, వెన్నగాని ముఖమునకు రాసి 15 ని॥ తరువాత స్నానము చేయవలెను. ప్రతిదినము ఇట్లు చేసినయెడల ముఖమునకు నునుపు, కాంతి వచ్చును. స్నానానికి, నలుగుపిండికాని, సీకాయ పిండిగాని చాలా శ్రేష్ఠమైనది. స్నానానికి ముందు నలుగు పిండిలో పాలు కలిపి అది రాసుకోవచ్చును. ఈ విధముగ కూడా ముఖము సౌందర్యవంతంగా మారగలదు. వారమునకు ఒక పర్యాయము, ముఖమునకు, శరీరమునకు పసుపు నలుగు పెట్టుకొనిన మంచిది. ఈ విధముగా చేసినయెడల ముఖకాంతి తగ్గదు. ముఖ్యముగా వంటచేయు స్త్రీలు ప్రతిరోజు ముఖమునకు పసుపు రాసుకొనవలెను. పసుపు వ్రాసికొనుటవలన ముఖముపైనున్న చిన్న చిన్న వెంట్రుకలు, చిన్న చిన్న కురుపులు మచ్చుకైనా లేకుండాపోవును. కేరళలో గల స్త్రీలు ప్రతిదినము స్నానమునకుముందు ముఖమునకు కొబ్బరినూనె రాసుకొనుటచేతను, ప్రతిదినము, నిదురించునపుడు ముఖమునకు కొబ్బరినూనె రాసుకొనుటచేతను, వారి ఆకారం ఎట్లున్నను, ముఖము నున్నగానుండి మెరయుచూ, దారపుపోగు పెట్టినను జారిపోవునంత మెత్తగా ఉండును. ఇటువంటి కృషిలేని మన బుగ్గలపై వెన్న ముద్ద పెట్టినను అది పెట్టినచోటనే యుండును.

ముఖమునకు వికారమును కలుగజేయునవి మొటిమలు. వీటిని వయసుకాయలనియు అందురు. శరీరం పెరుగునపుడు ఇవి లేచునని కొందరి అభిప్రాయము. కాని ఎంతవరకు నిజమో చెప్పలేను. నాకు బాగుగా తెలిసిన



విషయ మేమిటంటే, శీతకాలములో, వేసవి కాలములో మొటిమలుముఖముపై లేస్తాయి. తీపి పదార్థములు ఎక్కువగా తినుటవలనను, పగలంతా ముఖముపై పడిన దుమ్మును కడుక్కోకుండా నిదురించుట చేతను, మొటిమలు లేచును. అందుచే రాత్రి పరుండునపుడు ముఖమును చల్లని నీటితో కడుక్కొని, కొబ్బరినూనె రాసుకొని పరుండిన మొటిములు లేవవు. మొటిమలు లేచాయని గిల్లరాదు. అట్లు గిల్లిన అవి ఇంకను పెరిగి చివరకు మచ్చలుగా తేలును. సాధ్యమైనంతవరకు వాటికి గృహవైద్యము చేయవలెను. అప్పటికి తగ్గనియెడల డాక్టర్లచే తకపరీక్ష చేయించుకొనవలెను. మొటిమల నివారణకురోజూ 1½ గంటలకుఒకసారిచల్లని నీళ్ళతో ముఖము కడుక్కోవలెను. అప్పుడు సబ్బును ఉపయోగించరాదు. 2, 3 గంటలకొకసారి తప్పక ఒక గ్లాసు చల్లని మంచి నీరు త్రాగవలెను. ముఖమును సున్నిపిండితో రుద్దిన ఎటువంటి హాని కలుగదు. మందార మొగ్గలు, లేక పసుపుచెట్టు పువ్వు, మొటిమలపై మర్దనచేసిన నివారణమగును. ముఖమునకు "స్నో" రాసుకొనుముందు మొటిమలపై స్నోతో మర్దనచేసిన నివారణమగును. మొటిమల మచ్చలు పడకుండ ఉండుటకు రంగులేని తెల్లనైన అయోడిన్ ద్రావణములో దూదిముంచి మొటిమలు మచ్చలు ఉన్నచోట్ల వ్రాసిన అవి మాయమగును. కాని దానివలన ఎటువంటి భయములేదు. స్నానముచేయుటకు బద్ధకించరాదు. ఎందుకనగా మన శరీరముపై, ముఖముపై మట్టిపడి గ్రంధులు పూడుకొనిపోవును. శరీరములో గల మలినములు శరీరములోనేయుండి తరువాత అవి మొటిముల రూపమున బైటకు వచ్చును.

ఇంక, అందానికి కట్టుకూడా అవసరము. స్త్రీ ముఖము ఎంత అందంగా ఉన్నను ఆమె కట్టుకూడా ముఖ్యమైనది. స్త్రీ ముఖ్యముగా గమనించవలసిన విషయ మేమిటంటే, తను కట్టుకున్న బట్టలు తన శరీరానికి సొగసుగా, తగిగా ఉన్నవా? లేదా? అని గమనించవలెను. పొట్టిగఉన్న స్త్రీలు అడ్డచారల చీరలు వాడరాదు. అట్లు వాడినయెడల మరీ పొట్టిగ కనుపింతురు. చాలా పొడవుగనుండిన స్త్రీలు అడ్డగీతల చీరలు కట్టినయెడల కొంచెము పొడవు తగ్గినట్లు కన్పించెదరు. ఆ విధముగనే పొట్టిగానున్న స్త్రీలు సన్నని అంచులుగల చీరలు వాడినయెడల చాల బాగుగా కన్పించెదరు. నల్లగనున్న స్త్రీలు ఎప్పుడూకూడ తెలుపు, నలుపు వాడరాదు. అట్లు వాడినయెడల వారినలుపు మరీ కొట్టవచ్చినట్లు కనుపించును. నలుపురంగువారు లేతరంగులుగల చీరలను ధరించినయెడల ఆకర్షణీయముగా కన్పించెదరు. కొంచెము ఎరుపు రంగును బోలిన స్త్రీలు ముదురు రంగులను వాడవచ్చును. వారికి ఎక్కువ ముదురాకుపచ్చ చాలా ఆకర్షణీయముగా కన్పించును. పొడవుగానున్న స్త్రీలు పెద్ద అంచులుగల చీరలను కట్టుకొనిన కొంచెము పొడవు తగ్గినట్లుగా కన్పించుదురు. ఇన్ని హంగులు చేసినగాని, స్త్రీ ఇతరుల కంటికి అందముగా, ఆకర్షణీయముగా కన్పించదు. పైచెప్పిన విధముగా స్త్రీలు అందముకొరకై కృషిచేసిన తప్పక వారికి ఫలితము దక్కును. ★

వరుసలూ - నెరసులూ

నండూరి రాజ్యలక్ష్మి

కొందరు మన మెవరమో తెలియక పోయినా ఆప్యాయత కనబరుస్తూ, మన మంచిచెడ్డలన్ని విచారించి, మనకు ఎంతో ఆత్మీయులై పోతారు. బంధువులనందరినీ వదిలి ఉద్యోగరీత్యా ఏదూరదేశాలలోనో ఉన్న వాళ్ళకు ఈ మాటలు అమృతంలాగ ఉంటాయి. అసలు అంత ఆప్యాయంగా మాట్లాడటం కూడా ఒకకళే! అట్లా మాట్లాడటం అందరికి చేతగాదు సరిగదా, నేర్చుకుంటే వచ్చేది కూడా కాదు. పెద్దపెద్ద పట్టణాలలో ఇలాంటివాళ్ళు హఠాత్తుగా ఎదురుబడి, మన ముక్కూ మొఖం తెలియకపోయినా, తియ్యగా మాట్లాడుతూ ఉంటే, మనకు ఒక్క క్షణం ఆశ్చర్యంతో మాటకూడా రాదు. ఇట్లా ఆప్యాయంగా మాట్లాడేవాళ్ళల్లో కూడా రెండు రకాలు ఉన్నారు. మొదటిరకం వాళ్ళు మనసులో ఏదో ఒక ఉద్దేశ్యం పెట్టుకొని, ఆత్మీయులు అవడానికి ప్రయత్నిస్తారు. అంటే అవతల వాళ్ళనుంచి ఏదో ప్రతిఫలం ఆశించి అన్నమాట! ఇంక రెండో రకం, ఏవిధమయిన అపేక్షా లేకపోయినా, ఊసుపోక కాలక్షేపం బఠాణీలలాగ పరిచయం చేసుకొని, వాగుతూ ఉంటారు. నాకు ఈ మొదటి కోవకు చెందిన వ్యక్తి ఒకసారి తటస్థపడ్డది.

అప్పుడే నేను మా ఊరునుంచి హైద్రాబాదు వచ్చాను. అంతా క్రొత్త. చుట్టుప్రక్కల వాళ్ళెవరూ తెలియదు. ఇంక వంట చేసే ప్రయత్నంలో కూరలన్ని ముందరేసుకొని కూర్చున్నాను. ఇంతలోనే "ఏవమ్మా చెల్లాయ్!" అన్న తియ్యటి కంఠం వినిపించింది. వెనక్కి తిరిగి చూసేసరికి గుమ్మంలో ఒక ముప్ఫయిఏళ్ల అపరిచితవ్యక్తి నిలబడి ఉంది. అసలు ఆవిడ ఎవరో, ఆవిడ పిలచేది ఎవర్నో మొదట నాకు అర్థంకాలేదు. తెల్లబోయి చూస్తున్న నన్ను తిరిగి, "వంట మొదలుపెట్టావమ్మా?" అంది. నేనుగాక ఆ ఇంట్లో మరొక ఆడపురుగు లేకపోవడం వల్ల నన్నే అని అర్థం చేసుకొని "రండి. కూర్చోండి" అన్నాను జరుగుతూ. "అయితే ఇంకా వంట మొదలుపెట్టలేదన్నమాట" అంటూ ఆవిడ వచ్చి నాప్రక్కన కూర్చొని నాతోపాటు తనుగూడా గోరుచిక్కుడుకాయలు వలవడం మొదలుపెట్టింది. "లేదండీ! ఇంక చెయ్యాలి" అన్నాను నేనుగూడా మాట కలుపుతూ. అట్లా మాట్లాడుకుంటూ సవాశేరు గోరుచిక్కుడుకాయలు ఒలవడం అయ్యే సరికి ఆవిడ నాకు ఆత్మీయురాలై పోయింది. ఆ కూర్చున్న కాసేపులో నాకు ఆచుట్టుప్రక్కల అందరిగురించి చెప్పింది. తన సంసారంలో బాధలన్ని గాథలుగా వివరించింది. నా ఆరాలన్ని తెలుసుకుంది. "వెళ్లొస్తానమ్మా" అంటూ ఒక్క అంగలో మెట్లదిగింది. వెడుతున్న ఆవిడను చూసి, 'ఎంత మంచిమనిషి' అనుకున్నాను. చప్పున అత్తారింటిలో ఉన్న మా అక్కయ్య గుర్తుకు వచ్చింది.

ఆమర్నాడు మధ్యాహ్నం ఆవిడ మళ్లీ వచ్చింది. 'ఏం చేస్తున్నావు చెల్లాయ్?' అంటూ. "రండి" అని ఆవిడని ఆహ్వానించాను. నాచేతిలో ఉన్న శరత్ బాబు నవల చూసి "చరిత్రహీనులా? మీ ఇంట్లో ఏమేమి పుస్తకాలు ఉన్నాయమ్మా?" అంటూ అలమర దగ్గరకు వెళ్లి తీసిచూడటం మొదలుపెట్టింది. "ఎక్కువగా లేవండీ!" అని శరత్ నవలలు రెండు తీసి ఆవిడకు ఇచ్చాను. ఆవిడ మా ఇంట్లో కూర్చున్న అరగంటలో ఎంతో హాయిగా తీయగా మాట్లాడి 'మా ఇంటికి ఓసారిరా!' అని చెప్పి వెళ్లిపోయింది. మరొక్కసారి ఆవిడ ఆప్యాయత, మంచితనం నన్ను ఆశ్చర్యపరిచింది. 'నిన్ను చూస్తే అచ్చు మా చెల్లాయిని చూసినట్టే ఉంది' అంటూ వాళ్ళ గులాబి అంటువి రెండుపూలు ఒక రోజున కోసిఇచ్చింది. ఆవిడ అడిగినప్పుడల్లా లేదనకుండా కావలసినవి అప్పుగా ఇస్తూ ఉండేదానిని. మా ఇంట్లో నవలలూ - పత్రికలూ నిరాటంకంగా ఆవిడ తీసుకెళ్ళేది. నేనంటే అంత ప్రేమ ఆవిడకు ఉన్నప్పుడు నేను ఈమాత్రం అన్నీ ఇవ్వకపోతే బాగుంటుందా! అని, ఆవిడ అడిగినవల్లా ఇస్తూ ఉండేదానిని. ఈవిధంగా ఆఅపూర్వవ్యక్తికీ నాకూ సంబంధ బాంధవ్యాలు కలిశాయి. నేను అది ఒక అదృష్టంగా భావించాను. ఒక వారం రోజుల తర్వాత వాళ్ళింటికి ఒకసారి వెళ్లాను. వెళ్లగానే నన్ను మొట్టమొదట ఆకర్షించింది ఎదురుగా ఉన్న పుస్తకాల బీరువా. దాని నిండా రకరకాల నవలలూ నాటకాలూ ఉన్నాయి. పుస్తకాలంటే వల్లమాలిన పిచ్చిగల నేను ఠాగూర్ నవలలు రెండిమ్మని ఆవిడను అడిగాను. అంతకు ముందుదాకా ఎంతో ఉషారుగా మాట్లాడుతున్న ఆవిడ ఒక్కసారి షాక్ తిన్నట్టయింది. ఆవిడలో వచ్చిన ఆ మార్పేమిటో నాకు అర్థంకాలేదు. ఆవిడ ఒక ఐదునిమిషాల్లో తేరుకొని, ఆముదం తాగినట్టు ముఖంపెట్టి ప్రాణాలన్ని ఎవరో తీసుకుంటున్నట్టు ఒక నవల తీసిఇచ్చింది. 'ఇది మొదట చదవమంటూ' ఇదేవిధంగా మరొక రెండు మూడుసార్లు ఏవో అవసరాలు వచ్చి అడిగితే, అమితబాధపడిపోయింది. ఇట్లా కొన్ని జరిగాక గాని నాకు ఆవిడ తత్వం అర్థం కాలేదు. ఆ ఇల్లాలికి తీసుకోనేగుణమే గాని, ఇచ్చే గుణం లేదని నాకు ఆతర్వాత గాని తెలవలేదు. ఇంత ప్రేమా, ఆప్యాయత నటనన్నమాట! ఆవిడ చాతుర్యానికి మాటలు తీరుకూ ఆశ్చర్యపోయాను.


అప్పులకు వచ్చేవాళ్ళల్లో కొందరు ఆవిడనూ, వాళ్ల పుట్టింటి వాళ్ళనూ పొగిడి వాళ్ల అబ్బాయికి జలుబుచేసినందుకు విచారించి, అందుకు మిరియాల రసం వైద్యం చెప్పి, తమకు కావలసినవి తీసుకొని చక్కాపోతారు. పెద్దవాళ్లు ఈ ధోరణిలో ఉంటే, చిన్నపిల్లలకు కూడా ఇవే అలవాటౌతాయి. వాళ్ళు కూడా చేతులూ, మొఖమూ తిప్పేస్తూ, మనతో - మనపిల్లలతో కలిసిపోయి ఆత్మీయులైపోతారు. అది ఆ వయసులో కాలక్షేపానికి అయినా, పెద్దయ్యాక ఆప్యాయంగా మాట్లాడటంవల్ల చాలా సాధిస్తారు.

ఇంక మొగవాళ్ళ సంగతి. ఇవి మరీ తమాషాగావుంటాయి. అవన్నీ వ్రాయాలంటే చాలావుంటాయి. ఒక పెద్దమనిషి తనకు ఏయే ఊళ్ళలో ఎంతెంత మొత్తాలు అప్పులు రావలసిందీ చెప్పి ఎదుటాయన ఎంతఆర్థిక ఇబ్బందిలో ఉన్నాడో కనుక్కొని, తనకు రావలసిన పది వేలలో రెండువేలు అప్పిస్తానని హామీఇచ్చి, 'ఒక అయిదురూపాయలు అప్పు ఇప్పుడు ఇయ్యి బ్రదర్! నాలుగురోజుల్లో ఆడబ్బుతో కూడా ఇస్తాను' అంటాడు. అర్థగంటసేపు ఆయన అంతవివరంగా ఆరా అడిగినప్పుడు తీరా వెధవ అయిదురూపాయల దగ్గర వెనక్కి తీస్తే, రేపు ఆయన ఇస్తానన్న అంత పెద్దమొత్తం ఇవ్వడేమోనని, ఆ అవతలాయన ఎంత అవసరానికి దాచుకున్నా సరే ఠక్కున తీసి చేతిలో పెట్టి ఊరుకుంటాడు. ఈ విధంగానే రైళ్ళల్లో కూడా కొందరిని ఆత్మీయులుగా చేసుకొని, వాళ్ళకు తమ పుత్రికారత్నాలను అంటగట్టి తమబాధ్యత వదిలించుకుంటారు. ఇట్లా ఆప్యాయతవల్ల ఎన్నైనా పొందవచ్చు.

చప్పున ఒకతమాషా సంఘటన చిన్నకథ లాంటిది జ్ఞాపకం వస్తోంది. ఇది అబద్ధమనుకున్నా నాకేమి అభ్యంతరంలేదు. కేవలం అలాంటి వ్యక్తులు కూడా ఉన్నారని పరిచయం చెయ్యడమే నా ఉద్దేశం. ఒకానొక ఛోటారచయిత బడారచయిత అవాలని వెలరోజులు తీవ్రంగా ఆలోచించి ఒక అయిడియా తట్టగా వెంటనే అది అమలులో పెట్టేశాడు. దాని ఫలితంగా ఆయన దేన్నయితే సాధిద్దామనుకొన్నాడో, దాన్ని పొందటం జరిగింది. ఆయన తనకు తెలిసిన వాళ్ళను, తెలియనివాళ్ళను పరిచయం చేసుకొని, కష్టసుఖాలు విచారించేస్తూ వాళ్ళల్లో ఒకడయిపోయాడు. రైళ్లల్లో, సభల్లో

సన్మానాలలో కనపడిన వాళ్ళనందరిని ఆత్మీయులుగా చేసుకున్నాడు. ఇట్లా ఆయన కొన్ని వందలమందితో స్నేహం సంపాదించాడు. సాధారణంగా కొత్త పత్రికలలో ఒకటి-రెండుసార్లు పేరుపడితేనే అదొక గొప్ప. అలాంటిది ఆ రచయితని సాక్షాత్తు తమ రెండుకళ్ళతో చూడటమే కాకుండా పరిచయభాగ్యం కలిగిందంటే మరి అది అదృష్టంగా భావించరూ? ఇట్లా ఆయన జనంతో, జనం ఆయనతో సంబంధ బాంధవ్యాలు కలిశాయి. ఆరచయిత ఏదైనా ఊరు వెళ్లాల్సివచ్చినప్పుడు మధ్యస్టేషన్లలో తన ఎరిగిఉన్న వాళ్లందరికి 'నేను ఫలానా రోజు, ఫలానా ట్రైనులో బెజవాడ వెడుతున్నాను. మిమ్మల్ని దర్శించి చాలా రోజులయింది. శరీరం ఇక్కడే ఉన్నా మనసంతా మీదగ్గరే ఉన్నది. మీతో నేను అతిముఖ్యమయిన విషయం ఒకటి మాట్లాడాలి. కాబట్టి దయుంచి శ్రమ అనుకోక, మీరు స్టేషనుకు రావలసిందిగా కోరుతున్నాను' అని వ్రాసేవాడు. ఈ విధంగా ఒక పాతిక కార్డులు ఖర్చుచేసేవాడు. ఆ ఉత్తరాలు అందుకున్న వాళ్ళందరూ తలొక రూపాయి పెట్టి పూలమాలలుకొని, హడావుడిగా ప్లాట్ ఫారం అంతా తిరుగుతూ, తమకు కనపడ్డ అందరినీ పోగుచేసి, రైలు ఆగగానే సెకండ్ క్లాసు కంపార్టుమెంటు దగ్గరకు పరిగెత్తడం జరిగేది. ఆ రచయిత ఆ వచ్చినవ్యక్తిని కలుసుకొని, కుశలప్రశ్నలు వేసి, అసలైన విషయం మాట్లాడుకోకుండానే రైలు కదిలినందుకు విచారిస్తూ, మరొకసారి కలుసుకుందామని చెప్పి, సెలవు తీసుకొంటాడు. ఇట్లా ఆయన తనువెళ్లాల్సిన ఊరు చేరేలోగా ఒక ఇరవై పూలమాలలు ప్రేమతో స్వీకరించి ఆ ప్లాట్ ఫారం మీద ఉడాయి బెట్తాడు. అక్కడా ఇదే తతంగం జరుగుతుంది. దీంతో అక్కడున్న వందలాది జనానికి ఒకరచయిత వచ్చినట్టు తెలిసి ఆయన చుట్టూ మూగడం, ఆయన రచనలు చదివినా చదవకపోయినా ఆయనను ఒక మహాకవిగా ఎంచడం జరగేది. ఇట్లాఆయన కొన్ని కార్డులతో-కొన్ని తియ్యటిమాటలతో బోలెడంత పబ్లిసిటి సంపాదించాడు. ఆయనకు చాలా పేరువచ్చింది. కానీఈకథ ఇట్లాగే కంటిన్యూ కాలేదు. మధ్యలో హఠాత్తుగా ఒక అవాంతరం వచ్చిపడింది. అంతదాకా ఎంతో తెలివిగా నడుపుకొస్తున్న రచయిత పప్పులో కాలేశాడు. కొన్ని వందలసార్లు ఇంతమందితోనూ "నువ్వంటే నాకు ఓపలేని ప్రేమ. నీతో ఒక ముఖ్యవిషయం చెపదామంటే పడటంలేదు" అని అనడంవల్ల వాళ్ళు ఇంక ఆ విషయం నమ్మడం మానేస్తే, తనమీద అభిమానం పోతుందనుకొని, అన్ని వందల మందితోనూ "ఇది నా జీవిత రహస్యం. నీకు తప్ప మరొకడికి చెప్పలేను. నువ్వు నాకు ఆప్తుడివి గాబట్టి చెపుతున్నాను. ఇది ఎవరితోనూ అనబోకు" అంటూ ఒక చిన్న కథ అల్లి అందరితోనూ చెప్పాడు. ఆ విన్నవాళ్ళు ఎవరికివారు "ఆహా! ఆ రచయిత గారికి నేనంటే ఎంత అభిమానం!" అని మురిసిపోయారు. కానీ అట్లాగే ఉండలా. కథ క్లైమాక్సు నందుకుంది. అంతిమందీ ఈ రచయితను ఒకానొక సభలో సన్మానం చేస్తుంటే హాజరయి ఒకళ్ళని ఒకళ్ళు కలుసుకొని, ఆ రచయితగురించి చర్చరాగా, ఆ జీవిత రహస్యంగూడా బయటపడింది. ఎవరికి వాళ్లు అది తనొక్కడికీ తెలుసునని అంతదాకా అనుకోడంవల్ల, ఇది బయటపడిపోవడంతో తెల్లబోయారు. చివరికి ఆ రచయితా ఇట్లాజరిగినందుకు వెల-వెలబోయినా, ఆయన ఈ పథకం ప్రకారం దేన్ని సాధించాలనుకున్నాడో దాన్ని సాధించాడు. దీంతో కథ కంచికి వెళ్లింది. ఇది కేవలం ఉదాహరణకోసమే అనుకున్నా నాకేమీ అభ్యంతరంలేదని మొదటే చెప్పాను. ఈ కథవల్ల పబ్లిసిటీకోసం గూడా ఆంతర్యంగా మాట్లాడతారని అర్థమయిందనుకొంటా.

పరాయివాళ్లు ఎవరో ఆత్మీయంగా మాట్లాడతారంటే, అది నమ్మదగ్గ విషయం గాదు. ఎందుకంటే, అందుకు ఆంతర్యశుద్ధి ఏముంటుంది? ఇట్లా కాలక్షేపానికి మాట్లాడేవాళ్లతో అయితే ఫర్వాలేదు గానీ, ఏదో ఆశించి మాట్లాడేవాళ్లతో చాలా ప్రమాదం. అత్త



గౌనుల డిజైనులు

(శ్రీ) శేషయ్య.

వనితా వాణి



మూర్ఛ బాధ

ఈమధ్య 'వనితా వాణి' వనితలకు చాల ఉపకరిస్తున్నది. తలనొప్పి, అల్లిక, వంటలు మొదలైనవాటినిగూర్చి సోదరీమణులు చక్కగా ప్రతివారికి ఉపయోగించునట్లు వ్రాస్తున్నారు. పదమూడేండ్ల కుఱ్ఱవానికి ఐదేండ్లనుండి మూర్ఛజబ్బు చాలబాధిస్తున్నది. ఎన్ని మందులు వాడినా ఫలితం శూన్యం. ఎన్ని ఆస్పత్రులు త్రిప్పినా అంతే. చివరకు ఫిట్సువచ్చి దుమ్ములు కూడ జారిపోవటం, ప్రాక్చరవటం జరుగుతున్నది. కాబట్టి సోదరా సోదరీమణులు. ఎవరికైనా మూర్ఛనుగూర్చి మందు తెలిసియుంటే పత్రికాముఖాన తెలియపర్చి మూర్ఛనుండి రక్షించమని ప్రార్థన.

ఎస్. ఎమ్. అమీగన్ని సాహేబం
(సాంబల్‌పూర్)

వరింసలూ - నేసులూ

గారితో ఆప్యాయంగా ఉండి కోడలివిూద, కోడలికి ఆత్మీయంగా ఉండి అత్తగారితో చాడీలు చెప్పే అమ్మలక్కలు సవాలక్షమంది ఉన్నారు. ఈ కలహభాషిణిలు వెన్నలా, కరిగిపోయేలా ఒకప్రక్క మాట్లాడుతూనే మరొక ప్రక్క ఆ కొంపకు నిప్పు అంటిస్తారు. తల్లీ-కూతుళ్లకు, అత్తా-కోడళ్లకు, వదినా-మరదళ్లకు తగాదాలు పెట్టటంలో ఈఆప్యాయతను సాధనంగా పెట్టుకుంటారు. అందుకని వీళ్ళవిషయంలో మటుకు మనం చాలా జాగ్రత్తగా ఉండాలి. ఎవరయినా ఆప్యాయంగా మాట్లాడారంటే, అందులో అనేక అంతరార్థాలు ఉంటాయని మనం ముందే అనుకోవాలి. ప్రతిరోజూ ఇలాంటివాళ్లు మీకూ-నాకూ అందరికీ తటస్థపడుతూనే ఉంటారు. వీళ్ళని సంస్కరించటం మనకు కాదుగదా దేవినుండి దిగివచ్చినా వరికీ చేతగాదు. వాళ్ళది ఒక దివ్యసృష్టి. వాళ్ళగురించి మనం విచారించటం గూడా అనవసరం. కానీ మనం జాగ్రత్తగా ఉండాలి. తస్మాత్ జాగ్రత్త!

★

ఆరోగ్యమే అందం

28-9-60 వారపత్రిక వనితావాణి శీర్షికలో "సౌందర్యపోషణ" గురించి బి. పద్మావతిగారు చాలా బాగా రాశారు. వారు అన్నట్లుగా "ఆరోగ్యమే అందానికి పునాది" అన్న వాక్యము అక్షరాలా నిజము. ఆరోగ్యముగాయున్న యువతుల మొహాలు ఎంతో కళగా వుంటాయి. మొటిమలతో చాలామంది మొహాలు మచ్చలుపడి అందవిహీనంగా తయారవుతున్నాయి. అడ్వర్టయిజు మెంట్లు చూసి, రకరకాల స్నోలు పౌడర్లూ వాడుటకన్నా, రచయిత్రిగారన్నట్లు మిరియము రాసి మొటిమమీద పెడితే మొటిమలు త్వరగా తగ్గిపోతాయి.

ఇంకో సంగతి ... ప్రొద్దున్నే లేస్తూనే కొంచెము పటికను చన్నీళ్ళలో కలిపి మొహాము కడుక్కొంటూవుంటే చాలా వరకు వున్న మొటిమలు తగ్గిపోతాయి. "సౌందర్యపోషణ" గురించి రాసిన బి. పద్మావతి గారికి ధన్యవాదాలు పత్రిక ద్వారా తెలియచేస్తున్నా.

మన వనితావాణి సోదరీమణుల్లో ఎవరికయినా, సోన్‌పప్పిడీ, జామూన్, చేయు విధానము తెలిసివుంటే చెప్పవలయునని కోరుచున్నాను.

మదనపల్లె రమణాదేవి,
(కడప).

టొమాటో ఊరగాయ

సోదరీమణి భానూహారనాథ్ గారు మీరు టొమాటో ఊరగాయ పెట్టటం తెలియజేయమన్నందులకు చాలా సంతోషము. టొమాటాలు ఎన్ని ఊరగాయ పెటదలచితే అన్నీ ముందుగా కడిగి ఒక శుభ్రమైన బట్టతో తుడిచి ఆరబెట్టవలెను. ఆతరువాత వీటిని ముక్కలు పెద్దవిగా కోసెదరో లేక చిన్నవిగా కోసెదరో అది మీ యిష్టముగా కోయవచ్చును. కోసినప్పుడు వాటి రసము పోకుండా కత్తిపీట క్రింద ఒక పాత్ర అనగా గాజుగాని స్టీలుగాని ఉంచవలెను. ముక్కలన్నీ తరిగిన తరువాత వాటికి తగ్గ ఉప్పు పసుపు వేసి గాజు జాడీలో పెట్టి మూతపెట్టవలెను. కోసినప్పుడు పడిన రసము కూడా వేరుగా ఒక గాజు గిన్నెలో ఉంచవలెను.

మరునాడు ముక్కలు వేరేగా దానితో ఉప్పు పసుపు వేయుటవల్ల ఊట దిగును. అది వేరేగా, మొదట కోసినప్పుడు వచ్చిన రసము వేరేగా ఈ మూడు ఒకరోజు ఎండ బెట్టవలెను. ఆమరునాడు ఊరగాయకు సరిపడ్డ నూనె ఒక పావులో కొద్దిగా వేడిచేసి దానిలో ఇంగువ చిన్న గరిటెడు మెంతులు వేసి పొడిచేసి కలిపి ఒక పాత్రలో ఉంచవలెను. టొమాటాలకు తగ్గ మిరపపొడి, ఆవాలుపొడి ఇవికూడా వుంచి ముందుగా పొడి ముక్కలు ఒక చేటలో గాని లేక గాజు పళ్లెము గాని స్టీలు పళ్లెముగాని దానిలో వేసి మిరపపొడి కారము పొడి బాగా కలిపి ఉప్పుచూచి చాలకపోతే వేయవచ్చు.

అప్పుడు జాడీలో ఈ ముక్కలన్నీ వేసి వేరేగా ఉంచిన నూనె దానిలో పోయవలెను. తరువాత రెండు రకములుగా ఉన్న ఊట అనగా వాటితాలూకు రసము పోయవలెను. రెండు రోజులు మూతపెట్టవలెను. ఊరి చాలా బాగుంటుంది. మరియొకటి వంటనే అన్నీ కలిపి పెట్టారు. అది ఒక రుచిగా ఉండును. మొత్తముమీద రెండు పెట్టి చూడండి.

జయరామ రత్నమ్మ
(బిలాస్‌పూర్)

కన్నడ భోజ్యలక్ష్మి

అలనాటి శ్రీనాథుడు లాగా నేను 'వనితాలోక' విహారం చేస్తుంటే ఇవల పి. సుచరిత గారి కన్నడపు వంటల ఘుమఘుమ ఎటు చూసినా కడులుకుంటున్నది. ఇదెక్కడి అన్యాయం? ఎప్పుడూ కన్నడపు వంటలేనా? 'తల్లీ కన్నడ భోజ్యలక్ష్మి దయలేదా తెల్గువారం గదా'. తెలుగు వంటకాలూ, కొత్తవి, కావాలి.

వే. సుందరి (విజయవాడ) ★

హరి వంశము

మధురాపర్వము-6

ఏతౌహత్వా గజేంద్రేణ
మల్లైర్వా స్వయమేవవా
పురీం నిర్యాదవీం కృత్వా
విచర్యిమష్యాహంసుఖీ॥
తతస్తౌ పతితౌ దృష్ట్వా
వసుదేవః సబాంధవః
ఛిన్నమూలో నిరాలమ్బః
సభార్యో వినశిష్యతి॥
యే చేమే యాదవా మూర్ఖాః సర్వేకృష్ణపరాయణాః
వినశిష్యంతి ఛిన్నాశా దృష్ట్వాకృష్ణం నిపాతితం॥

—కంస వాక్యం (హరివంశం)

కంసుడు తిరిగి తన మందిరములను చేరుకున్నాడు. అంధకుడుగూడ అతనితో తిరిగి ఆ మందిరములను చేరినాడు. ఆ చేరునందాక వారు తిరిగి ఒకరితో ఒకరు మాట్లాడుకొనలేదు. అప్పుడు కంసుడు అంధకునితో ఇట్లా అన్నాడు:

"అంధక! నేను విముక్తుడనైనాను. భృశదుఃఖితుడనైనాను. ఈ కుఱ్ఱలు ఎవరో విగతభీకులు, మహాబలవంతులవలె వున్నారు. కంసుని ధనస్సునే వారు విరిచినారు. నీవు ఎన్ని అయినా సహించవచ్చు. లోక విగర్హితమైన ఈ చేష్టను సహించడం ఎట్లా! పురుష కారము హీనము, దైవము అధికము అని అంటావు. అంతేగదా! కాని ఆ దైవం అని చేతులు కట్టుకొని పురుషకారాన్ని వదలుకుంటామా? చూడు! దేవకిసంతానంవల్ల నాకు మరణం వున్నదని గదా నారదుని వాక్యము. నేను ఆ దేవకి బిడ్డలను ఆర్గురిని చంపివేసినాను. ఇంక మిగిలినవాడు ఒక్కడు! వీడు అష్టమ గర్భమో! సప్తమగర్భమో తెలియదు. ఈ తెలియనిచావు నేను చాల చచ్చినాను. ఇక ఛావను. మహామాత్ర!"

అంధకుడు ఏమీ మాట్లాడలేదు. తాను వచ్చిన పనియేమో ఇంకా తీరలేదు. భగవంతుని ఆజ్ఞను తాను కంసునకు తెలియజేయవలసివున్నది. ఆ ఆజ్ఞయేమో తనకు ఇంకా అర్థముకాలేదు; అర్థముకాకను పోలేదు. కంసుడు తన్ను ఇంకా మాట్లాడనీయుటలేదు.

"మధురేశ్వరా! ఏమి సెలవు?"

"మహామాత్ర! వచ్చినావా! నీవు పోయి చాణూరముష్టికులను నా ఆజ్ఞగా ఇక్కడికి తీసుకొనిరా?"

"చిత్తము మధురేశ్వరా!"

మహామాత్రుడు చాణూరముష్టికులను తేగా పోయినాడు. కంసుడు అంధకుని వంక చూచినాడు. చూచివికటంగా నవ్వినాడు. "అంధక! పురుషకారం అంటే అర్థమైనదా?" అన్నాడు.

అంధకునకు నవ్వురాలేదు. కంసుణ్ణిచూడగా జాలివేసింది.

"కంస! నీవు రేపు ఉండవు."

కంసుడు అప్రతిభుడై అంధకునివంక చూచినాడు.

"కంస! రంజకునివధ వృత్తాంతము విన్నావుగదా! అది రంజకునివధకాదు- కంస! నీవధ!"

అంధకుని మాటలేమో కంసునకు అర్థముకాలేదు. రంజకుని భార్యలు, చుట్టములు తనదగ్గరకువచ్చి, ఎవ్వరో నల్లనయ్య అతనిని భగ్నశిరస్కుణ్ణి చేసినట్లు చెప్పుకున్నారు. తాను వారిని ఓదార్చి ఆ నల్లనయ్యను శిక్షిస్తానని చెప్పిపంపినాడు. ఇప్పుడు తిరిగి అంధకుడు రంజకుని వృత్తాంతమును ఎత్తినాడు.

"అంధక! నాకు నీమాటలు అర్థముకావుటలేదు."

"కంస! కంస! నీకు అర్థముకావు. కాని నేను ఆ భగవంతుని ఆజ్ఞను పాలించవలసివున్నది. కంస! రేపు నీవులేవు."

"కంస! భగవంతుడు నీయందు జాలిచేస్తున్నాడయ్యా! జాలి చేస్తున్నాడు. నీవస్త్రములను గ్రహించి, మాలకరిసుదామునిపోలి, నిన్ను అనుగ్రహిస్తున్నాడు. అదే నాకు అర్థముకాలేదు."

"అంధక! మాలకరి సుదామునకు, నాకు సంబంధము ఏమిటి? భగవంతుడు ఏమిటి? అనుగ్రహించడం ఏమిటి? నీకు మతియేమైనా భ్రమించినదా! వృద్ధుడవు!"

"కంస! కుబ్జను ఎరుగుదువుగదా! అది నీదాసి! దాని మనస్సు గొప్పది. దానిశరీరము నీ బుద్ధివలె త్రివక్రము. దానిని భగవంతుడు ఋజ్విని చేసినాడు. కంస! నీకు ఉత్తరగతులు ఋజువులుగా కల్పించబడుతున్నాయి. నీకు మరిజన్మలేదు."

కంసునకు అంధకుని ఏమి అనవలెనో తెలియడములేదు. అతనివి అవి ప్రలాపములో! కంసునకు అర్థముగుటలేదు. అంధకుడు యాదవులలో వృద్ధు. వసుదేవపక్షపాతి! ఇప్పుడు కృష్ణుని పూనుకొనివచ్చి ఈ దౌత్యము నడుపడము ఏమిటి? కంసునకు, కాలనేమికి, ఏమీ అర్థముగుటలేదు.

"కంస! భగవంతుడు నీ ధనస్సును విరిచినాడు. నిన్ను రేపు ఎట్లుల విరచునో, నేను ఆధనస్సును అట్లుల విరిచినాడు. నీ తలపెట్టిన ధనుర్మహం ధ్వంసమైనది. నీ దైత్యతత్వము ధ్వంసమైనది. కంస నీవైన కాలనేమి నేడే నిహతుడైనాడు. నీవు వట్టికంసుడవు మిగిలినావు. రేపు నీవుగూడా మిగలవు. పరమమైన గతిని పొంది శాశ్వతుడవు అవుతావు: కంస! నాకు ఇదే ఆశ్చర్యము! నీకు ఇది భగవంతుని శిక్షయా! భగవంతునిగతియా!"

కంసుడు ఏమీ మాట్లాడలేదు. అతనిలో అప్పుడు ఏభావమూ లేదు. తన్నుతాను మరిచిపోయినవాడైనట్లు కంసుడు అంధకుని దిక్కు నిలబడి ఏకాగ్రముగా తిలకిస్తూ వున్నవాడు; తిలకిస్తున్నట్లే వున్నాడు. అంధకుడు ఆరూపుముందు, అంతవరకు నిల్చినవాడు ఇప్పుడు నిల్వలేకపోయినాడు. అప్పుడు కంసునకు నవ్వువచ్చినది.

"అంధక! నీవు వచ్చినపని అయినది. ముగుసలివి. ఇంతవరకు నిలబడియే వున్నావు. అదిగో ఆ ఆస్తరణంమీద ఆసీనుడవుకా! నీతో నాకు కొంచెం పనివున్నది."

అంతలో చాణూరముష్టికులు వచ్చినారు. మహామాత్రుడు

హరిత శివశర్మ

హరివంశము

వెంటగొనిరా వచ్చినారు. కంసునకు ప్రత్యుత్తరము ఇచ్చు అవకాశము అంధకునకు లభించలేదు. తనతో కంసునకు పనియేమో ఆయనకు అర్థముకాలేదు. తాను వచ్చినపని అయిపోయినది. తనకు తెలియకనే, తాను భగవంతునియాజ్ఞను పాలించినట్లయినది. అదే అంధకునకు ఆశ్చర్యమైనది. తాను ఆమాటలు కంసునితో ఎటుల చెప్పగల్గినాడు? చెప్పినాడుపో! కంసుడు ఆమాటలు విని తన్ను ఎటుల సహించినాడు. అంధకుడు అప్పుడు ఆ కంసుని చూచి ఆశ్చర్యపడినాడు.

చాణూరముష్టికులు చేతులుజోడించి వినమితశిరస్కులై కంసునియందు గౌరవము, భక్తి నెరపుతూ ఒక్కదిక్కుగా నిలబడినారు. కంసుడు వారిని కూర్చుండుమనలేదు. వారిదిక్కు చూడలేదు. అంధకునియందే బద్ధదృష్టియై ఉన్నత ప్రస్తరణముపై ఆసీనుడైవున్నాడు. అంధకునిలో సాగుతున్న ఆలోచనలతీగను పసిగట్టినాడు కాబోలు, తిరిగి కంసుడు అంధకుని సంబోధించాడు.

"అంధక !"

"కంస ! తాత ! మధురేశ్వర !"

"నీవు దూతవు. ఆ యాదవుడు, వాసుదేవుడు నిన్ను నా సమ్ముఖమునకు పంపినాడు. నేను మధురేశ్వరుడను."

"అవును ! అవును !"

"అంధక ! యాదవులపాప నాకు గిట్టదు. ఈ యాదవులు రాజులుకారు. వీరికి మూర్ధాభిషేకార్హత లేదు. యయాతి శాపము వున్నదిగదా! అది వారిని దయ్యమై పట్టినది. నీవును యాదవుడవే!

"అవును ! అవును !"

"అంధక ! యాదవులు ప్రతిభగలవారు. సింహాసనము వెనుక వుండి నాటకములు ఆడవలెనని వారి ఊహ ! నేను మధురేశ్వరుడను, ఆ ఆటను సాగనీయలేదు."

"అవును ! అవును !"

అంధకునితో కంసుడు మరి మాటాడలేదు. చాణూర ముష్టికులదిక్కుముఖుడై వారిని పల్కరించినాడు: "చాణూర ! ముష్టిక ! నా ఆజ్ఞను వినండి. మల్లతనంలో మీకు లోకం ఎదురు అంటూ లేదు. మీ వీరపతాక భువనమండలి అంతటా చెల్లుతున్నది. నన్ను చేరినదగ్గరనుంచి నేను మీకు చేసిన మేలు ఎట్టిదో మీరే ఎరిగివున్నారు. ఇప్పుడు మీ వల్ల నేను నా చేసినదానికి ప్రత్యుపకారం కాంక్షిస్తున్నాను." అని కంసుడు ఆగినాడు. కంసుని అభిప్రాయ స్వరూపము ఏమో! చాణూర ముష్టికులు, అంధకుడు, మహామాత్రుడు అందరు ఔత్సుక్యవంతులైనారు. కంసుడు అంధకుని చూచి మందహాసంచేస్తూ చాణూర ముష్టికులతో ఇట్లా అన్నాడు: "చాణూర ! ముష్టిక ! మీరు మహావీరులు. మహాబలులు. బాహుబలశాలులు. జగద్విఖ్యాతులు. వీరధ్వజోచ్ఛ్రితులు. జగత్తులో మల్లులందరి పూజలకు, సత్కారాలకు అర్హులు. ఇప్పుడు మీ వలన నాకు ఒకపని కలిగింది. అది మహత్కార్యం. మీరు తేజస్సుతో దానిని సాధించి పెట్టవలసి వుంది" అని కంసుడు మరల ఆగినాడు. కంసుని తలంపు ఏమో తెలియక అంధకుడు, చాణూర ముష్టికులు, మహామాత్రుడు, గుసగుసలు పడినారు. కంసుడు అంధకుని చూచి వికటహాసం చేస్తూ చాణూర ముష్టికులతో ఇట్లా అన్నాడు: "బలరాముడు, కృష్ణుడు, అనే ఇద్దరు గోపాలార్భకులు మా వ్రజంలో కారెనుసుతనంతో ప్రవర్తిల్లుతూ వచ్చిన సంగతులు మీరూ ఎరిగివున్నారు. వారికి ధైర్యం సంగతి తెలియునా! స్థైర్యము సంగతి తెలియునా! భయౌచిత్యాలు ఎరుగుదురా! చాణూర! ముష్టిక! వారు వట్టి ముష్కరులు. ఆ మాష్కర్యం శీలించడంచేత ఇవి యేమీ వారు ఎరుగరు. వాళ్ళు బలవంతులు కాదంటామా! అనడానికి లేదు. వారూ బలవంతులే. కొంచెం శ్రమవంతులుగూడాను. ఇప్పుడు వారిని నేను మీతో మల్లుతనం నెరపడానికి ఆహ్వానించాను. వారు కూటబుద్ధులు. మల్లుతనంలో మీకు ఎదురై ఏమైనా చేద్దామని చూస్తారు. వారిని మీరు కనికరించవద్దు. వారిని పాలార్చవద్దు. గారించవద్దు. నిపాతనంతరం ఒక్క ఊపుతో వారిని మీరు ఆఘాతించాలి. అప్పుడు మీ వలన నాకు మహోదారమైన శుభం జరిగినట్లు అవుతుంది. మీ ప్రఖ్యాతి మరింతగా అధికం అవుతుంది."

ఈ మాటలు చెప్పి కంసుడు చిళ్ళ చిళ్ళలుగా అసకృద్ధాసం చేశాడు. ఆధ్వనులు గాలులలో వికటంగా మారుమ్రోగాయి. చాణూర ముష్టికులు భుజాస్ఫాలనం చేస్తూ, కంసుని ఆజ్ఞయందు, అభిప్రాయమునందు, తమ గౌరవాన్ని ప్రకటించారు. అంధకుడు ఒక్కడు కంసుని మనస్సు అర్థముకానివానివలె నిస్తబ్ధుడైనాడు. మహామాత్రుడు మధురేశ్వరుని తెలివికి సంతసించుచున్నట్లు మందహాస ముఖారవిందుడైనాడు. కంసుడు తిరిగిచాణూరముష్టికులను సంబోధించిఇట్లాఅన్నాడు: "చాణూర! ముష్టిక! ఈ రామకృష్ణులు, ఈ సంకర్షణ వాసుదేవులు, బాలురని మీరు సంకోచించవలసిన పనిలేదు. వారు బాలురయ్యు చపలులు. విక్రియాపరులు. వారిని నియుద్ధంలో మీరు నిరస్తం చేయాలి! అప్పుడు నాకు మీరు ప్రత్యుపకారం చేసినట్లు అవుతుంది. వర్తమానమునందు, ఉత్తరకాలమునందు మిమ్మల్ని నేను మరచిపోకుండా చేసుకోవలయును సుమా!"

చాణూర ముష్టికుల సంతోషము భూమి పట్టలేదు. ఆకాశము పట్టలేదు. ఇంతటి సన్మానము ఒప్పారగా తమ్ము మధురేశ్వరుడు ప్రార్థించడమే వారికి గొప్ప అయిపోయినది. రాజు ప్రార్థనం విని, ప్రార్థనీయ బాహాఘనులైన చాణూరముష్టికులు, అతని యెదర ఘటితాంజలులై ఇట్లా అన్నారు: "మధురేశ్వర! స్నేహ సంయుక్తమైన మీ వాక్యపద్ధతి మాకు నచ్చింది. మేము హృష్టమానసులమైనాము. మీరు మాకు ఇంతగా చెప్పవలెనా? మాకొలది యేమిటో మీకు తెలియనిదా! ఆ గొల్లలు మాకు ఒక లెక్కా! కారు. వారు బలవంతులే అని ఒప్పుకుంటాము! వారు మీరి బలంచూపిస్తే—ఊరకుంటామా! మాకు అగపడిన వెంటనే పైబడతాము. అప్పుడు గనుక వారు ఇంచుక సైచి పెనగగల్గితే, నిల్వక బీరుపోయినట్లయితే, ప్రభువులు చూస్తూవుండగా, వంటకట్టెయలను విరిచినట్లు, వారిని విరిచివేస్తాము. ప్రభువులు ఇది ఒక పెద్దపనిగా మనస్సులో అనుకుంటూ వుండటమే మాకు ఆశ్చర్యం అవుతున్నది. మాకు ఎదురు నిల్వడం అంటే, ఈ ధాత్రిలో సర్వమల్లులకు ప్రాణములు పీచుపీచుమంటాయే! అట్టి మాకు, ఈ అర్భకులు, ఈ ఆభీరులు, ఈ గోపకిల్బిషులు, ఒకలెక్కా! మేము ప్రభువుల సేవకులము. ప్రభువుల ఆజ్ఞను పాలిస్తాము. విశ్వశ్రీలను ప్రభువులు భుజించుటకుగా మేము వున్నాము."

కంసుడు వారిమాటలకు సంతృప్తిపడెనో, లేక వారి ఔద్ధత్యమును చూచి, వికత్థనములు విని, జాలిపడెనో, అంధకునకు అర్థముకాలేదు. వారిమాటలు వినగా కంసునిముఖమున తలుకొత్తిన మందహాసము ద్విధాభావసమ్మిశ్రమై, చీకటిగాక, వెల్గుగాక, ఇదమిద్ధమని చెప్పరానిదయ్యె, కంసుని ఆత్మవోలె, జ్ఞానముకాక, అజ్ఞానముకాక ప్రకాశించింది. ఆ మందహాసంతో కంసుడు మల్లులవాగ్వివవైభ

వాన్ని కన్నులతో తిలకించాడు. చెవులతో ఆలకించాడు. నవ్వుతూ వారితో ఇట్లా అన్నాడు: "మీరు చెప్పినయంతపని చేయగల సమర్థులు. రేపు రంగంలో ఇంతటి మగతనాన్ని మీరు చూపించగలరు. మీకు పేరొక్కనగల తమగములను రంగభూమిలో ప్రత్యేకింపజేయిస్తున్నాను. నేటికి ఇళ్లకు వెళ్లండి." రాజునాజ్ఞ విని మల్లులు పెలుచన బాహువులు ఆస్ఫాలించి, సింహనాదంచేసి, ప్రముక్కి, వీడ్కొని, యథేచ్ఛగమనంగా గృహోన్ముఖులై కదిలిపోయినారు. వారు కన్పించినంతమేర కంసుని నవ్వులు విచారసూచకములో, ఆనందదాయకములో, చివ్వలుగా ప్రసరించినాయి. వారు అగోచరులు కాగా, కంసుడు మహామాత్రునిదిక్కై మందహాసంచేసినాడు. ఆ మందహాసము మహామాత్రునిగుండెలలో చురకత్తియనుపోలి కదలాడింది. ఆ మందహాసమును చూడగా మహామాత్రునకు ఎందుకో భయమైనది. కంసుడు చిరునవ్వులుగా ఒక్కసారి మహామాత్యుణ్ణి, ఒక్కసారి అంధకుణ్ణి తిలకిస్తూ, మహామాత్రునితో ఇట్లా అన్నాడు.

"మహామాత్ర!"

"ప్రభు"

"కువలయాపీడం క్షేమమా!"

"క్షేమమే మహారాజ!"

"రేపు కువలయాపీడాన్ని సమాజ ద్వారంవద్ద నిలుపు."

"చిత్తము మనురేశ్వరా!"

"నీవే దానిని నడిపించవలయును సుమా!"

"ప్రభువుల ఇష్టము, మహారాజా!"

"కువలయాపీడము అన్ని ఏనుగులవంటిది కాదు. అది బలము గలది. మదలోలాత్మమైనది. చపలమైనది. మహామాత్ర! నరవాసన గిట్టనిది. దానోత్కటకటము, చండము అయినది. ఇప్పుడు నీవు దానిని నేనుచెప్పినట్లు ప్రయోగించవలసి వున్నది. నిన్ను నేను మహా ఆప్తుణ్ణిపోలి విశ్వసిస్తున్నాను. నిన్ను మంత్రినిచేశాను. ఇప్పుడు నీవలన ఈపని కల్గింది."

"చిత్తము! మహారాజా!"

"మా మేనల్లుండ్రు వున్నారే, వాళ్లు వట్టి అడవిమనుష్యులు. గొల్లలలో పెరిగి గొల్లతనం నేర్చుకున్నారు. ప్రల్లదులై పాతకపు బుద్ధితో ప్రవర్తిస్తున్నారు. వారిమీదకు మల్లులను పంపుతున్నాను. వారివలన వారికి కీడు జరుగుతుంది."

"అవును! మహారాజా!"

ఆ మాటకు అంధకుడు గల్లున నవ్వినాడు. ఎందుకు నవ్వినాడో మహామాత్రునికి అర్థముకాలేదు. అర్థమై కంసుడు కోపారుణితనేత్రుడైనాడు. "అంధక! నా ఆలోచన యేమో, తెలిసినదా! ఈ రామకృష్ణులను, ఈ వసుదేవుని సంతానాన్ని, కువలయాపీడంచేత త్రొక్కించివేస్తాను. మహామాత్ర! ఆపని నీవు చేయవలసివుంది. రేపు వారు ఈ రాజగృహంవాకిట్లోకి రాగానే నీవు కువలయాపీడాన్ని వారిమీదకు తోలాలి. వాళ్లు ఖలులు. విగతాయుధంగా వస్తారు. ఇందులో నీవు అరవాయిగొనవలసింది లేదు. ఆ ఏనుగును వారిమీదకు పంపించు. అంధక ఆ రామకృష్ణులు, కువలయాపీడాన్ని తప్పించుకు పోగలరంటావా? అదియముని కారాగారం వంటిది. దాన్ని వదలిపోవడం మాటలంటావా? క్రోధానలాకులఘోరాక్షాన్ని, గండమండలపరిస్రుత్ మదస్రోతాన్ని, బలవద్వీర విదారణ ప్రకటితాభ్యాసాన్ని, సాక్షాత్ మృత్యువును, ఈ బాలకులు, కికురించిపోగలరంటావా! అంధక! లోకాన్ని నేను నిర్యాదవం చేస్తాను. నేను ఎవణ్ణి! కంసుణ్ణి! నేను ఎవణ్ణి! నేను ఎవణ్ణి!! వసుదేవుణ్ణి సబాంధవంగా హతమార్చివేస్తాను. ఛిన్నమూలుణ్ణి, నిరాలంబుణ్ణి చేస్తాను. సభార్యంగా నాశనం చేస్తాను. అంధక! మీరు, యాదవులు పరమమూర్ఖులు. మీరంతా కృష్ణపరాయణులు. ఆ కృష్ణుడు రేపు చావగా, మీ ఆశలు గూడా చచ్చిపోతాయి. మీరు గూడా ఆశలు కూలినట్లు కూలిపోతారు. ఈ కృష్ణుణి నేనుచంపగలనా! అనినీ అనుమానం. నేను చంపను. కువలయాపీడం చంపుతుంది. అది చంపలేకపోతుందిపో! మల్లులు చంపివేస్తారు. అంధక! ఇది తప్పదు. ఇది తప్పదు"... అంటూ కంసుడు వికటమైన అట్టహాసం చేసినాడు. ఆ అట్టహాసము వేయికంఠములుగా ఆ రాజమందిరం అంతటా మ్రోగింది. ఆమ్రోతలో కంసుడు తిరిగి ఇట్లాఅన్నాడు: "అంధక! ఈ నారాజ్యంలో ఒక్క యాదవవంశీకుడు మిగలకుండా చేసి, నేను సుఖినౌతాను. మాతండ్రి, ఉగ్రసేనుడు వున్నాడే, అతడు గూడా యాదవుడేగదా! అందుకే ఆయన్ను నేను పరిత్యజించాను. తల్లిని పరిత్యజించాను. ఆమెముఖముగూడా నేను చూడటములేదు. అందరిని నేను పరిత్యజిస్తున్నాను. రేపటితో మీకూ నాకూ తీరిపోతుంది."

అంధకుడు ఏమీ అనలేకపోయినాడు. అతనినోట మాట రాకపోయినది. అతడు కంసుణ్ణి అట్లా చూస్తూ కూర్చుండిపోయినాడు. కంసుడు ఆ మందిరంలో అటుగా, ఇటుగా తిరుగుతూ, యాదవాన్వయద్వేషాన్ని వెళ్ళగ్రక్కుకుంటున్నాడు. కొంతసేపటికి అంధకుడు తెప్పరిల్లి కంసుని సంబోధించి ఇట్లా అన్నాడు:

"కంస! నీవు ఎవ్వడవు? యాదవుడవు కాదా?"

"ఛీ! నేనా! నేను ఎవ్వడను. నేను ఎవ్వడనుకాను. నేను ఎవ్వడనూ కాను" అంటూ కంసుడు తిరిగి వికటాట్టహాసంచేసినాడు.


"నీవు ఎవ్వడవు కాకపోవడమేమి? కంసా! నీవు కాలనేమివి?" అని అంధకుడు అన్నంతలో కంసమందిరం అంతటా విచిత్రమైనహాసం, భయంకరమైన హాసం, వికటమై, భీకరమై విన వచ్చింది. ఆకహకహాట్టహాసాన్ని విని కంసుడు అదిరిపడినాడు. "అంధక! మహామాత్ర! ఎవ్వరు వారు! ఆ కహకహాట్టహాసం చేస్తున్నది ఎవ్వరు? ఆధ్వనియేమి? ఎవ్వరు ఆ విలయతాండవం చేస్తున్నది! అహో! నా గుండెలలో ఈ పదతాడనము ఏమి? ఈ ముక్తమూర్ధజ, ఈ హారశోభితసర్వాంగి, ఈ మకుటోజ్జ్వలభూషిత, ఈ నీలపీతాంబరధర, ఈ గజకుంభోపమస్తని, ఈ ఘనవిస్తీర్ణ జఘన, చంద్రవక్త్రి, చతుర్భుజ, విద్యుద్విస్పష్ట వర్ణాభ, బాలార్కసదృశేక్షణ, ఎవరు? ఆ నృత్యమేమి? ఆ నవ్వేమి! ఆ చుట్టూ చీకటులను పోలి ఆ భూతగణములేమి! ఆ విపరీత ప్రకాశమేమి! ఆ అనుత్తిమ పానమేమి? ఆ మహాహాసం ఏమి! అంధక! ఆమె నీకు కన్పించడంలేదా! ఆ గజ్జెలమ్రోత నీకు వినిపించడంలేదా! మహామాత్ర! ఆ భయంకరాట్టహాసం నీచెవులకు సోకడంలేదా! అహోబత! ఈ రౌద్రరూపం దుర్నిరీక్ష్యంగా వుంది. తల్లీ! ఏమి అంటున్నావు! తల్లీ ఏమి అంటున్నావు. నా శత్రువువచ్చి, నన్ను మ్రందిస్తున్నప్పుడు, నా శరీరంనుండి స్రవించే కవోష్ణ రక్తాన్ని అనుభవిస్తావంటున్నావా? తల్లీ! వెళ్లిపోతున్నావా! అంతర్ధానం చెందుతున్నావా! తల్లీ! తల్లీ! నీవు యాదవలోకసంరక్షకురాలవా! నన్ను ఏమి చేస్తావు? నన్ను ఏమిచేస్తావు?"

— కంసుడు మరి మాట్లాడలేకపోయినాడు. స్వీయాస్తరణాన్ని పట్టుకొని, నిర్వీర్యుడైనట్లు నిలబడిపోయినాడు. అతనిముఖం పాలిపోయింది. అతడు అక్కడివారిని చూడలేకపోయినాడు. తల ఎత్తకయే అంధకుని సంబోధించి ఇట్లా అన్నాడు:

"అంధక! ఇది దుర్నిమిత్తమా? శుభమా?"

"కంస! తల్లి నిన్ను అనుగ్రహించింది. భగవంతుడుగూడ అనుగ్రహించినాడు. నీవు మహావీరుడవు! కంసుడా! నీవు భీరువవు."

★




(గతవారం తరువాయి)

ఈ బంధంలో చిక్కుకుని, వలలో పడ్డ చేపల్లా ఇద్దరూ ఒకరికొకరు ఏమీ చేయలేక ఊరుకున్నారు. కాసేపు అల్లా గడచింది. ఆ కాసేపూ చల్లచల్లగా గాలివీచింది. ఏదో చల్లని ఊహ తోచింది. అప్పుడు ఉషాకన్య ఇల్లా అంది.

"చూడండి. మీ రెవరో నాకు తెలీదు. నేనెవరో మీకు తెలుసని నాకు తెలుసని మీ రనుకుంటే పొరబాటు. నేనెవరో మీకు తెలీదని నాకు తెలుసు. అయినా అంత చనువు అంతగా అంత ఇదిగా మీ రెందుకు తీసుకుంటారో నాకు తెలీదు. మీకు తెలుస్తే చెప్పండి. ఆడపిల్ల ఒంటరితనం మగవాళ్లకు తుంటరితనం తెచ్చిపెడుతుందని మా అమ్మలు ఎప్పుడూ చెబుతూ ఉంటారు. మీ కథ మా అమ్మల మాటకు సాక్ష్యం ఇస్తుంది. సరే. నేను ఇల్లుబయలుదేరి చాలా సేపయింది. ఇంటిదగ్గర అమ్మలసలే ఇవాళ ఎందుకో బెంగగా వున్నారు. ఇంతకీ నేను రాకపోయేసరికి ఎంత హడిలిపోతున్నారో, మరి నేవస్తాను. మీరు వెళ్లిరండి." ఆ మాటలనేసి ఉషాకన్య పూలసంచీ పట్టుకుని రెండడుగులు వేసి మళ్లీ వెనక్కి తిరిగి చూసింది భయంకొద్దీ. ఆ పరదేశి మళ్లీ వెంటపడి రావడంలేదు. అలానే కూర్చున్నాడు. ఉషకు భయానికి బదులు ఆశ్చర్యంవేసింది. ఆశ్చర్యం కాసేపట్లో ఆనందంగా మారింది. అదీ స్థిరంగా ఉండలేదు. ఆ అబ్బాయిమీద ఏదో రకమైన తోరదోర భావం కలిగించింది.

బెజవాడ సదానందం

"పాపం అనవసరంగా అన్నాను. చాలా మంచివాడు," అని మెచ్చుకుంది. తనకు తను నచ్చచెప్పుకుంది. దోరతలపులు జాలిగా మారి .నడక మందగించింది. ఆ అబ్బాయిని విడిచి వెళ్ల లేకపోయింది ఉష, కాని అడుగులు పడుతునే వున్నాయి. అడుగులు దూరం అవుతుంటే అతను తనకు దగ్గరౌతున్నాడు. అలా



అలా అతన్నే తలుచుకుంటూ నడచిపోతున్న ఉషాకన్య ఉన్నట్టుండి ఉలిక్కిపడి గావుకేకపెట్టి పడిపోయింది.

వికటాట్టహాసం చేసుకుంటూ ఎవడో ఆకాశమార్గంలో ఉషవైపు నిప్పుచూపులు దూసిపోస్తూ ఎగురుతూ వెళ్లాడు.

ఈ కేక విని పరదేశి పరుగుపరుగున వచ్చి ఉషను లేవనెత్తి కౌగలించుకున్నాడు. భయం లేదని చెప్పాడు. లేడిపిల్లలా ఉష వణకిపోయింది. ముచ్చటలాడే మొహం నిండా ముచ్చెమటలు పోశాయి. ఆమె భయంతీరి వళ్లు తెలిసేటప్పటికి పరదేశి కౌగిలిబిగువు సడలించింది. తాను అతనికి అంతదగ్గరగా ఉన్నట్టు తెలీగానే సంకోచం, సిగ్గూ ముంచుకొచ్చి, అతనే లేకపోతే తానేమయ్యేదో ననే ఊహ కలిగి అతని గుండెలమీద వాలిపోయింది.

అమ్మలు ముగ్గురూ అంతలో ఉషను వెతుక్కుంటూ పరుగు పరుగున అక్కడకి వచ్చారు. వాళ్లు వచ్చి ఈ వింత చూసి మస్తుగా విస్తుపోయారు. మనకూన నెఱజాణ లెమ్మనుకున్నారు. సైగమనే సైనోడు సరిఅయిన సమయానికే వచ్చాడనుకున్నారు.

వాళ్లను చూసి ఉష, ఉషను చూసి ఆ అబ్బాయి సిగ్గుతో చితికి పోయారు.

'వాయబ్బో! మరీ అంత సిగ్గా ఇక్కడే ఒలకపోసుకోకే ఉషా - అంత సిగ్గుపడేదానివేనా ఇంత పనీ చేశావు. నరే ముందు పద అవతల కొంప మునుకుపోతోంది' అంది సునంద.

ఉష ఆ మాటలు విని అడుగు ముందుకు వేస్తూ అతనివంక చూడనట్టు చూసి కళ్లతో సెలవు అడిగి తీసుకుంది.

'ఏం జరిగింది' అన్నాడు పరదేశి. 'నడివీథిలో భాగోతం ఎందుకు రాకుమారా, మా కుటీరానికి రా. అంతా నీకే తెలుస్తుంది' అన్న అమ్మ మాటమీదుగా అతను కూడా కుటీరం చేరాడు.

అంతా కుటీరంలో కూర్చున్నారు. "ఇప్పుడటు చప్పుడు చేస్తూ ఓ శకునపక్షి వచ్చింది చూసే వుంటారు" అంది సునంద.

"అవును చూశాను. ఆయనా చూశారు. ఆయనే చూడకపోతే-అప్పుడు నన్ను ఆయన చూడక పోయినట్లయితే మీరు నన్ను చూసే వాళ్లే కాదు" అంటూ కంట నీరెట్టుకుంది ఉష.

'ఇంతకూ ఆ శకునపక్షి ఎందుకొచ్చిందండీ?' అంటూ మర్యాద భావంలో మరీ అడిగాడు పరదేశి.

'అదంతా ఒక పెద్ద కథ' అంటూ నిట్టూర్చింది సునంద.

ఆ కథంతా చెప్పింది సుజాత. ఉష తన ఆత్మకథ తొలిసారిగా విన్నది. ఏవిటో అయిపోయింది. 'ఎక్కడి ఉదయపురి. ఎక్కడి ఉష' అనుకుని జాలిపడింది. అమ్మనీ, నాన్ననీ చూడాలని తహతహలాడింది.

"ఆ దుర్ముఖి ఈ రోజున-అంటే మా ఉషాదేవి పదహారో పుట్టిన రోజు ప్రొద్దుకూకేలోగా నూరేళ్లు నిండేట్టు శాపం పెట్టింది. అందుకు



చల్లని తల్లి

కలువకొలను సదానంద

నేలతల్లీ, నింగితేడూ
చెలిమిచేసే తోటలో-
జిలుగు మబ్బుల పలుకరించే
నీలికొండల కోటలో-
దాచుకొన్నది ప్రకృతి సుందరి
తనదు బంగరు మూటలు!

దోచుకొన్నా కొంచెమైనా
తరగవా సిరిపంటలు!
ముదురుపచ్చని గుబురుమొక్కలు,

మింటి కెగసే తరువులు,
వంగి ఊయెలలూగు తీగెలు,
రంగు రంగుల పూవులు,
ఈలవేసే పిల్లగాలులు,
నిలువ-చల్లని నీడలు,
నాట్యమాడే భ్రమర బాలలు,
పాటలాపని పికములు...
ఇంత సంపద ప్రోగుజేరెను
వింతగా చిట్టడవిలో!
ఎంత దీసిన తరుగునా ర
వ్వంత-ఆ నట్టడవిలో?...

ప్రొద్దు పడమరకు తిరిగింది!

ఆ నట్టనడి చిట్టడవిలో-లయతప్పకుండా గోడ్డళ్ళ మ్రోత వినిపిస్తోంది. పొదరిండ్ల చల్లని నీడలలో 'తుర్రు' మని అటూ యిటూ తిరుగాడుతూ-పిచ్చుకలు, గోరువంకలు, పూరేళ్ళు మొదలైన అడవి పిట్టలు రకరకాలుగా ధ్వనిచేస్తున్నాయి. నెత్తి మాడే ఎండ! వేడి గాడ్పులు! చురుక్కుమని సూదుల్లా పొడిచే ఆ ఎండలో-ఒక కట్టెలమ్మేవాడు తాను కొట్టిన కట్టెలను ప్రోగు వేసుకుని మోపుగట్టుకుంటున్నాడు. నల్లరాయిలా గట్టిగా వున్న అతడి ఒంటిమీద నీళ్ళు కుమ్మరించినట్టు చెమట కారుతోంది. అతడు ఆ అడవిలోవున్న ఆనందాన్ని అనుభవించడంలేదు. ఉయ్యాల లూగే

ఉషా కన్యా కథ

వరుగుడుగా మేమో వరం ఇచ్చాం. ఆవరం ఇప్పుడు ఇక్కడే వుంది." అన్నది సుజాత.

'ఏదీ' అన్నాడు పరదేశి. 'ఏదో చెప్పాలా' అంటూ నవ్వింది ఆమె. 'అయితే చెబుతున్నా విను. ఇంతకు ముందు దుర్ముఖి దూత శకునపక్షి వచ్చి ఉష ఆచూకీ తెలుసుకుని ఎగిరిపోయినప్పుడు ఆమెను ఘట్టిగా కౌగలించుకుని కాపాడింది ఆవరమే' అన్నది ఆమె. పరదేశికి అర్థమైంది. కాని స్పష్టంగా తెలియలేదు. ఉష అక్కడినించి పారిపోయి మరో గదిలో మంచం మీద పడుకుని భయం, సిగ్గు వీటిలో మునిగిపోయింది. ఆనందం అప్పుడప్పుడు ఆమెతో దోబూచులాడుతోంది.

'మరేంలేదు నాయనా. నీవెవరో మాకు తెలుసు. నీవు పుట్టింది ఈ అమ్మాయికోసం. ఆ అమ్మాయి పుట్టింది నీకోసం. మేం ఇచ్చిన వరం మరేంలేదు. ఖంగారు పడకు. పడినట్లు నటించకు. పదహారేళ్ళ క్రితం నీవు ఒక చిలిపిపని చేశావు. ఆ పని మరొక్కసారి మేం చెప్పినప్పుడు చేయాలి.' అన్నది సునంద.

అతడు తికమకపడిపోయాడు. "ఎవరు వీళ్ళు? ఎరుగున్నవాళ్ళకు మల్లే తెగ చెప్పుకుపోతున్నారు. వర సలుకలుపుతున్నారు?" అనిపించింది.

"నీవు వీరసింహ మహారాజు కుమారుడివి. ఉదయభారవి నీ పేరు అవునా?" అంది సునంద.

'అవును. అసలు సంగతి చెప్పండి' అన్నాడు ఉదయ భారవి ఆశ్చర్యంలో పడిపోతూ.

'నీకు ఉదయపురి సామ్రాట్టు విశ్వనేత తెలుసుకదూ?' అని అడిగింది మళ్లీ సునంద.

"అయ్యో! తెలీకేమండీ, మా నాన్నగారూ వారూ దేహాలు రెండైనా, రాజ్యాలు రెండైనా మనస్సు ఒక్కటే అయినవారు. బాగా ఎరుగున్నాను. అదంతా ఒక కథలెండి. వాళ్ల అమ్మాయికీ నాకూ పెళ్లిచేద్దా మనుకుంటూ ఉంటారు. కాని అదో రహస్యం. ఆ అమ్మాయి పాపగా ఉండగానే శాపంవల్ల మాయం అయిందిట. అలాగని నాతో చెప్పారు. కానీ నిజంగా మాయం అవుతే ఇంకా పెళ్లిమాట ఎందుకు తలపెడతారు. ఇదో గమ్మత్తురా అని అప్పుడే అనిపించింది నాకు ఆ విషయం మీకేమైనా తెలిస్తే కాస్త నాతో చెప్పండి" అన్నాడు రాకుమారుడు.

(ఇంకా ఉంది.)

(బడిలో లెక్కల మాష్టారు)

(పిల్లలతో) : మీరు అల్లరి చేయకండి. తెలిసినవాళ్లు మాట్లాడవద్దు. తెలియనివాళ్లు లేచి నిలబడండి. (ఎవరూ చెప్పలేకపోతే)

మాష్టారు:— ఏరా గోపి, నీవైనా చెప్పు.

గోపి : (మాట్లాడడు)

మాష్టరు ! ఏమిరా మాట్లాడవేం?

గోపి : తెలిసినవాళ్లని చెప్పవద్దన్నారుగదండీ.

ఎస్. ఆర్. ఎస్. శాస్త్రి (నూజవీడు)

తీగెలు, రంగురంగుల పువ్వులు, నాట్యమాడే తుమ్మెదలు, పాటలు పాడే కోయిలలు—యివేవీ అతన్ని ఆకర్షించడంలేదు. ఈ అందాల సంపదను దోచుకోడానికి అతను రాలేదు. అతడు కట్టెలకోసం వచ్చాడు. వాటిని పట్టణంలో అమ్మి, ఆ డబ్బుతో ఆ రోజు సంసారం గడుపుకుంటాడు.

ఉదయంనుంచి కట్టెలు కొట్టి, అతడు బాగా అలసిపోయాడు. నాలుక తడి ఆరిపోయినది. దాహం వేస్తూవుంది. కొండవాగు అక్కడికి చాలా దూరం. అతడు కట్టెలు మోపు గట్టికున్నాడు. గొడ్డలిని మోపులోనే చెక్కాడు. దేవదారు చెట్టు నీడలో కాస్సేపు విశ్రమించాడు. లేచి, మోపు నెత్తిన బెట్టుకొన్నాడు. చేతిలో మరొక లావుపాటి కట్టె పట్టుకున్నాడు. గసలు బోస్తూ, వడివడిగా నడక సాగించాడు.

చిట్టడివి దాటుకొన్నాడు. కొండ మలుపు తిరిగాడు. దూరంగా... భూదేవి కట్టిన చీరె గాలికి రెపరెపలాడినట్లు—పైరుపచ్చలు అటు యిటు చిన్న గాలికదులుతూ కనిపిస్తున్నాయి. కొండమలుపులో—దారి ప్రక్కన—ఒక చిన్న పర్ణశాల వుంది. దాని కొకప్రక్క రెండు నేరేడుచెట్లూ, మరొకప్రక్క ఒక మామిడిచెట్టు వున్నాయి. చుట్టూ గుబురుగా క్రిక్కిరిసి ఏవేవో పొదలున్నాయి.

అతడు తన కట్టెల మోపును నేరేడుచెట్టు బోదెకు ఆన్చి, పచ్చిక పైన నీడలో చతికిలబడి—"ముసలమ్మా"! అన్నాడు. ఆ యింట్లోంచి ఒక ముసలామె బయటికివచ్చింది. ఆమె ముంత నిండుగా అతడికి మంచినీళ్ళిచ్చింది. అతడు గబగబ త్రాగేశాడు. ప్రాణం కుదుటబడినట్లైంది. తన చేతిలోవున్న లావాటి కర్రను ఆమె ముందు పడేశాడు. "ఎందుకులే రాముడూ? ఇది లేకపోతేనేం? వున్న కట్టెలు ఎలా కాల్చుకోడమో తెలీడంలేదు. వొద్దంటున్నా వినక—లేనిపోని కష్టం పెట్టుకుంటారు..." అంది ముసలామె.

"అయ్యో చల్లని తల్లీ! అలా అనకు. కట్టెలమ్ముకునే వాళ్ళంతా జన్మజన్మాలకూ నీ ఋణం తీర్చుకోలేరు. నీ చల్లని చేతి నీళ్ళు తాగుతూ—నీ ఇంట్లో ఒక్క కట్టెఅయినా తెచ్చి పడేసి పోకపోతే—మా కట్టెలు వుంటేనేం, లేకపోతేనేం?..." అన్నాడు రాముడు.

> ఎప్పుడూ డ్రెస్ మీద పేకాట ఆడేవారిదగ్గరకు వెళ్ళి పేకాట ఆడే పోలీసుతో ఒకడిలా అన్నాడు "ఏమండీ, మీరు డ్రెస్‌మీద వెళ్ళి ఆజూదరులతో పేకాడతారెందుకు?"
>
> "ఓడిపోతే డబ్బు ఇవ్వక్కర్లేదుగనక" అన్నాడా పోలీసు.
>
> జయంతి బాలకృష్ణ (అనకాపల్లి)

సేదతీరిన తర్వాత—మోపు నెత్తిన బెట్టుకుని, రాముడు తనదారిని తాను వెళ్ళిపోయాడు. మరి కాస్సేపటికి—అక్కడికి ఒక్కొక్కరే చాలమంది కట్టెలవాళ్ళు వచ్చారు. వచ్చిన ప్రతివాళ్ళూ ముసలమ్మ చేతినీళ్ళు త్రాగి—'అమ్మయ్యా' అనుకుని, తలా ఒక్కొక్క కట్టె అక్కడ పడేసి వెళ్ళిపోయారు.

సాయంకాలమైంది. కట్టెలమ్ముకునే వాళ్ళంతా వెళ్ళిపోయారు. ఆ ఆకుటిల్లు ముందర ఒక మోపు కట్టెలు ప్రోగైనాయి. ఆమె వాటిని తీసికెళ్ళి, ఇంట్లో వేసివున్న కట్టెల మీద—తన పుణ్యంలా పేర్చుకొంది.

ఆమె పేరేమో గాని—అందరూ ఆమెను 'ముసలమ్మా' అనే అంటారు. ఆమెకు ఎవ్వరూ లేరు. ఆ అడవి బయట, కొండకింద ఇల్లు కట్టుకుని ఆమె ఒక్కతే ఉంటోంది. ముసలమ్మ ఆ అడివిలోని పళ్ళరకాలంతో కోసి బుట్ట నింపుకుని, పట్టణానికి వెళ్ళిఅమ్ముతుంది. వచ్చిన పైకంతో భత్యం కొనుక్కుంటుంది.

ఆ ముసలమ్మది చల్లనిగుండె. ఆమె ఇంటికి దగ్గరలో ఎక్కడా నీళ్లు దొరకవు. అరమైలు దూరంలో ఒక చిన్న మడుగు ఉంది. ముసలమ్మ అక్కడినుండి నీళ్లు తెచ్చుకుంటుంది. కట్టెలు కొట్టేవాళ్లు అడవిలోనుంచి మోపులు నెత్తిన బెట్టుకొని దాహంతో వస్తారక్కడికి. ఆమె లేదనకుండా వాళ్ళకు కావలసినంత నీళ్ళిస్తుంది. వాళ్లు తలొక కర్ర ఆమె ఇంటిముందు పడేసి పోతుంటారు. ఆమె వద్దన్నా వాళ్లు వినరు. మనస్సులో ఆమెను మెచ్చుకోకుండా ఉండలేరు... ముసలమ్మ ఆకట్టెలన్నీ పేర్చింది. చిన్న గుట్ట తయారైంది. వాటిని ఏం చేయాలో ఆమెకు తోచలేదు...

2

ఆ మరునాటిఉదయం ముసలమ్మ మడుగునుండి రెండుకడవల నీళ్లు తెచ్చుకున్నది... ఆమె ఇంటిముందు నుండి ఒక రెండెడ్ల బండి సాగిపోయి, కొండప్రక్కన నిలబడింది. ఆ బండిలో ముగ్గురు మనుషులున్నారు. "ఏం నాయనా? కట్టెలకోసమా?" అనిఅడిగింది ముసలమ్మ.

ఆ ముగ్గురిలో ఓ కోరమీసా

లాయన — "కాదమ్మా! పూరిగడ్డి కోసం! వానాకాలం దగ్గర కొచ్చేసింది గదా?...ఇల్లు కప్పుకోవాలి." అన్నాడు.

మధ్యాహ్నం అయింది.

వాళ్లు ముగ్గురూ ముసలమ్మ ఇంటిముందు నిలబడ్డారు. చాలా అలసిపోయి ఉన్నారు. మొహాలు ఈడ్చుకుపోయాయి. శరీరాలు చెమటతో తడిసిపోయాయి. కన్నుల్లో ఆకలి తొంగిచూస్తోంది. వాళ్ళు ఆమెను కొంచెం మంచినీళ్ళిమ్మన్నారు.

"ఏం బాబూ! అన్నాలు తిన్నారా?" అంది ముసలామె.

"లేదవ్వా! అన్నాలేమో తెచ్చుకున్నాం. అజాగ్రత్తవల్ల కాకులపాలైపోయింది" అన్నాడు మీసాలాయన.

ముసలమ్మ నొచ్చుకుంది. "అయ్యో తండ్రులారా! ఆకలితో ఎలా ఉంటారు? ఇంట్లో అన్నమైనా లేదు. కాస్సేపుండండి. వండిపెడతాను" అంటూ - వాళ్ళు వద్దంటున్నా వినిపించుకోకుండా పొయ్యిమీద ఎసరుపెట్టింది. నూకలు వేసి సంగటిచేసింది. దగ్గరలో ఉన్న చింతచెట్టువి నాలుగు చింతకాయలు కోసి పచ్చడిచేసింది. ఆ ముగ్గురూ పరమానందభరితులయ్యారు. ఆ నూకలసంగటిని చింతకాయ పచ్చడితో అద్దుకుని అమృతంలా తిన్నారు. "తల్లీ! నువ్వు నూరేండ్లు చల్లగా ఉండాలి. మా ప్రాణాలు నిలిపావు" అన్నారు. ఆ మీసాలాయన తన మొలలోంచి చిల్లర డబ్బులు తీసి ఆమె కివ్వబోయాడు. ఆమె వద్దంది..."నేను డబ్బుకు అన్నం పెట్టాననుకున్నారా బాబూ? పాపం - మీరు ఆకలితో

చల్లని తల్లి

ఉన్నారు కదా అని పెట్టానంతే! అంతమాత్రానికి డబ్బెందుకు?" అంది "ఏ ఋణం మాకెందుకవ్వా? ఉంచుకో - ఫరవాలేదు." అంటూ బలవంతంచేశాడు మీసాలాయన. ఆమె పుచ్చుకోలేదు. "నీకు అంతగా ఋణం ఉంచుకోకూడదని ఉంటే నాకో సాయం చేసిపెడ్తావా నాయనా?" అంది.

"ఏం?" అన్నాడు అతను.

"మరేమీలేదు. నీ పనులన్నీ చక్కబడ్డాక ఒక నెలరోజుల తర్వాత ఎప్పుడైనా నీ రెండెడ్ల బండిని తీసుకొస్తావా?...నీకిష్టం నేను పెట్టుకోనులే!..." అంది ముసలమ్మ.

"సరే"నన్నాడు అతడు. "అవ్వా! నిన్ను మరిచిపోను. నాపేరు మీసాలయ్య. నాకు వీలున్నప్పుడు తప్పక బండి తెస్తాను."

అడివి, కొండా అంతా గాలించి మీసాలయ్య పూరిగడ్డితో బండిని నింపేసి, సాయంకాలం కాగానే తన అనుచరులతో ఇంటిముఖం పట్టాడు.

3

ఒక నెలరోజులు గడిచిపోయాయి. వర్షాకాలం ప్రారంభమైంది. రోజూ ఎడతెరిపి లేకుండా వానలు కురుస్తున్నాయి. ఎక్కడ చూచినా కొండవాగులు పొర్లి ప్రవహిస్తున్నాయి. అడివంతా పచ్చగా చిగురిస్తోంది. ఎవ్వరూ కట్టెలకోసం రావడంలేదు. ఎంత గాలించినా—ఈ వానల్లో అడవిలో ఒక ఎండుపుల్ల దొరకడం కల్ల.

> మేష్టరు : రామూ! నీవు మీ నాన్నమాట ఎందుకు వినటంలేదు.?
>
> రాము : నా పుస్తకంలో చెప్పుడుమాటలు విని మోసపోవద్దని వుందికదండీ.
>
> సీ. భాస్కరరావు (కాకినాడ)

ఆరోజు తెల్లవారింది. రాత్రంతా వాన కురవడంమూలాన నేలంతా తడిసిపోయి అక్కడక్కడా బురదబురదగా ఉంది. నేరేడు చెట్లూ, మామిడి చెట్లు పచ్చగా కదులుతున్నాయి. ఆకాశం స్వచ్ఛంగా—కడిగివేసిన అద్దంలా ఉంది. తెల్లటి పొగమంచు దూదిపింజల్లా విచ్చిపోతూ కొండశిఖరం చుట్టూ ప్రదక్షిణాలు చేస్తోంది. కోయిల గొంతులో కొత్తరాగం వచ్చింది. సూర్యకిరణాల వెలుగులో ప్రకృతి నవనవలాడుతూ చైతన్యవంతంగా ఉంది.

ఆ సమయంలో ఆమె ఇంటి ముందు ఒక రెండెడ్లబండి ఆగింది. మీసాలయ్య క్రిందికి దిగి, "ముసలమ్మా! బండి తెచ్చాను." అన్నాడు. ఆమె సంతోషంతో అతన్ని పరామర్శించింది. గబగబ అన్నం వండి, అతనికి పెట్టి, తానూ తిన్నది. అతని సహాయంతో ఇంటిలోని కట్టెలన్నీ బండిలోకి చేరవేసింది. బండి నిండిపోయి, సగం కట్టెలు ఇంట్లోనే మిగిలిపోయాయి. కట్టెలు పడిపోకుండా కట్టుదిట్టంగా కట్టేశాడు మీసాలయ్య. "ఈ కట్టెలన్నీ పట్టణంలో అమ్ముకోవాలి నాయనా!" అంది ముసలమ్మ.

సూర్యుడు నడినెత్తి మీద నిలిచేసరికి—ఇద్దరూ బండిమీద బయలుదేరారు.

సాయంకాలం కాబోతున్నది. పట్టణంసమీపానికి వచ్చారు.

ఇంతలో-సన్నగా రాలుతూ ఉండిన తుంపర ఎక్కువై, వాన జోరు హెచ్చింది. బాటకు ప్రక్కగా ఊడలతో దట్టంగా ఒక పెద్ద మర్రి చెట్టుంది. బండిని దాని క్రింద నిలిపారు. వాన జోరుగా కురుస్తోంది. మర్రిచెట్లో ఆగిపోయిన చిలుకలు కీచుకీచు మంటున్నాయి. మర్రి ఆకుల్లో నుండి నీటిబొట్లు టపటప మని జారిపడుతున్నాయి. ఆ మర్రి చెట్టు కింద అంతకుముందే మరో వ్యక్తి నిలబడి ఉన్నాడు.

"ముసలమ్మా! అసలే వానా కాలం! వంటచెరకు దొరకడం కష్టం. నీ కట్టెలకు మంచిధర తగిలి తీరాలి..." అన్నాడు మీసాలయ్య.

అక్కడున్న అపరిచిత వ్యక్తి ఆ ఇద్దరినీ చూశాడు. బండిలో ఎత్తుగా పేర్చి కట్టిఉన్న కట్టెలను చూశాడు. "ఎక్కడినుండి వస్తున్నారమ్మా?" అని పలకరించాడు.

అతడు తలకు పెద్ద పాగా కట్టుకున్నాడు. గోచికట్టు కట్టుకున్నాడు. తెల్లని శాలువను ఒంటిపైన కప్పుకున్నాడు. అతని చేతిలో ఒక పొడుగుపాటి బడితెకర్ర ఉంది. అతని బుర్రమీసాలు నల్లగా వంపులుతిరిగి ఉన్నాయి. చెవుల్లో కుండలాలు వ్రేలాడుతున్నాయి. ఒత్తైన కనుబొమల క్రింది కన్నుల్లో మనుషుల్ని ఆకర్షించే తేజస్సు ఏదో కనిపిస్తోంది.

"నాకు ఊరూలేదు, పేరూలేదు బాబూ! ఆ నీలికొండలదగ్గర నా

తండ్రి: ఎందుకురా? నేను ఎక్కడ అడుగు వేస్తే నువ్వు అక్కడే అడుగు వేస్తూ నడుస్తున్నావు.

కొడుకు: మరి మా పంతులు గారు పెద్దవారి అడుగు జాడల్లో నడవాలని చెప్పారు నాన్నా.

నీలం భాస్కరరావు (కాకినాడ)

ఇల్లు. పట్టణంలో కట్టెలమ్ముకుపోదామని వచ్చాను..." అంది ముసలమ్మ.

ఆ వ్యక్తి ఆశ్చర్యపడ్డాడు... "ఈ వానాకాలంలో ప్రజలంతా పొయ్యిలోకి వంటచెరకు దొరక్క నానా అగచాట్లూ పడుతున్నారు. నువ్వెక్కడినుంచి తేగలిగావమ్మా ఈ ఎండుకట్టెల్ని?" అన్నాడు.

ముసలమ్మ చిన్నగా నవ్వింది. "నే నెక్కడినుంచి తేగలను బాబూ? ఆ రాముడిచ్చాడు. రోజూ — చిట్టడవిలో కట్టెలు కొట్టుకునే వాళ్ళకు నీళ్ళిచ్చి వాళ్ళ దాహం తీర్చేదాన్ని. బదులుగా వాళ్ళు తలొకకట్టె పారేసి పోయేవారు. అవే ఇప్పటికి బండెడు కట్టెలయ్యాయి. ఇన్ని కట్టెలు నా కెలాగూ ఉపయోగపడవు. అందుచేత డబ్బుచేసుకుపోదామని వచ్చాను..."

ఆ క్రొత్త మనిషి కళ్లు చిట్లించి కాసేపు ఆలోచించాడు. ముసలమ్మతో ఇలా అన్నాడు. "ఇదిగో అవ్వా! వెదకబోయిన తీగె కాళ్ళకు చుట్టుకున్నట్లు ఈ సమయంలో నువ్వు కనిపించావు. నా పేరు రాజన్న. రాజుగారి కొలువులో నౌకరీ చేస్తున్నాను. వారి కోటలో వంటచెరకుకు కొరతవచ్చిపడింది. ఆ కొరతను పూడ్చేసే బాధ్యత నా నెత్తిమీద పెట్టారు రాజుగారు. ఎక్కడా ఒక్క మోపైనా కపించలేదు. నా పాలిటి దేవతలా నువ్వు వచ్చావు. బండి తోలుకుని నా వెంట అంతఃపురానికి రా. నీకు మంచి బహుమతి ఇప్పిస్తాను...

ముసలమ్మ, మీసాలయ్య సంతోషించారు. "అంతా ఆ రాముడి చల్లదనం! పదండి బాబూ!" అంది ముసలమ్మ. వాన వెలిసింది. బండి రాజన్న వెంబడే కదలింది.

వృక్ష ప్రశ్నలు

అలపర్తి వెంకట సుబ్బారావు

పంచు ముదుసలి బాటసారీ!
మండు టెండలో ఎవటికోయీ?
పైన ఎండకు గొడుగు లేదే!
పాదరక్షలుగూడ లేవే!
కడుపు నిండగ పండ్లు తినగా
వడిగ నాదరి చేరవేమీ?
శ్రమను మరువగ విశ్రమించగ
సరస జేరవు ఏలనోయీ?
దవ్వుదవ్వుల నిలుస్తావేం?
దగ్గరకు రా దడుస్తావేం?
శంక దేనికి ఆరగించగ?
జంకు దేనికి విశ్రమించగ?
ధర్మసత్రపు గుమస్తావలె
ధనము అడిగెద ననెడి భయమా?
పేరుకే అది ధర్మసత్రం
పెరుగుదోటలో పెరుగు గలదా?
త్యాగభావమునందు గురువులు
తరువులేయని పెద్దలనరా?
మోడిమసిమై పోయినా మేం
వీడగలమా ధర్మపథమును?

సూర్యుడు పడమటి కొండ మీదికి దూకబోతున్నాడు. లేయెండ ప్రపంచం మీద పచ్చగా పరచుకొన్నది. తూరుపు దిక్కున ఇంద్రధనుస్సు—ఆకాశరాజు భూదేవి మెడలో వేసేందుకు తెచ్చిన పూలమాలలా మెరిసిపోతూ ఉంది. ముగ్గురూ పురవీథుల్లో ప్రవేశించారు.

(ఇంకా ఉంది)

ఆంత్రభాగం ప్రారంభమౌతుంది. జెజునం చివర నుండి "ఇలియం" అనే పేరుగల ఆంత్ర భాగం ప్రారంభించి చుట్టలు చుట్టలుగా చుట్టుకొని కోలన్ అనే పెద్ద ప్రేగులో అంతమౌతుంది. ఈ ఇలియం కోలన్‌లో ప్రవేశించే ప్రదేశానికి క్రిందుగా, మిరపకాయ ఆకారం గల ఒక భాగం ఉన్నది. దానిని "వెర్మిఫారమ్ ఎప్పెండిక్స్" అంటారు. వెర్మిఫారం అంటే వానపాములా పొడుగైన పురుగు ఆకారం గలది అని అర్థం. ఎపెండిక్స్ అంటే ఒక ప్రధాన భాగమును అంటి పెట్టుకుని ఉండేది. ఉదరమును ఇంగ్లీషులో "ఎబ్డోమెన్" అంటారు. కోలను ఎబ్డోమెన్‌లో కుడివైపున క్రింది భాగంలో ప్రారంభించి, పైకి ప్రాకి, ఎడమ ప్రక్కకు తిరిగి, ఎడమ డొక్కలోని పై భాగంలో క్రిందికిదిగి, "సిగ్మాయిడ్ కోలన్" అనే క్రిందిభాగం ఏర్పడుతుంది. ఈభాగం "రెక్టం" అనే మలాశయంగా రూపొందుతుంది. రెక్టం చివర మూలస్థానం ఉన్నది.

నోటిదగ్గర ఆరంభమై, మూలస్థానంలో అంతమయ్యే జీర్ణకోశం ఒక పెద్దపొడుగైన గొట్టంవంటిది. అది కొన్నిచోట్లసాగి, వేరు రూపం పొందవచ్చు. ఈ గొట్టంలో మూడు పొరలుఉన్నవి. బయటప్రక్క 'సీరస్ మెంబ్రేను' అనేపొరఉన్నది. ఇది "సీరమ్" అనే రసిని స్రవింపచేస్తుంది. మధ్యలో కండరములతో యేర్పడిన పొర, లోపల "మ్యూకస్ మెంబ్రేను" ఉన్నవి. ఈ కండరములు చిన్నవి పెద్దవి అయే శక్తిగల ధాతువుతో తయారైనవి. అయితే, ఇలా చిన్నదికావడం పెద్దది కావడం, మన ఇచ్ఛాధీనమై జరుగదు. చేతి కండ్లలవలె మనం వీటని మన ఇష్టంవచ్చినట్లు

జీర్ణకోశ వ్యాధులు

(15 వ పేజీ తరువాయి)

ఆడించలేము. మెదడు, అవసరమునుబట్టి, వీటి చలనమును ఏర్పరుస్తుంది. ఈ గొట్టం లోపలఉన్న మ్యూకస్ మెంబ్రేనులో చిన్న చిన్న గ్లాండులు రకరకముల రసములను తయారుచేసి, జీర్ణక్రమం సాగిస్తవి. ఇంతే కాదు. ఈగొట్టం చలనం, చేతికండల చలనంలాగా పొట్టి పొడుగూ కావడం కాదు. ఇందులో ఉంగరం ఆకారంగల కండలువున్నవి. ఒకభాగంలోఉన్న కండలు చిన్నవవుతవి. అక్కడఉన్న పదార్థం క్రిందికి పోతుంది. ఆ సమయంలోనే అక్కడికన్నా క్రిందిభాగం పెద్దదవుతుంది. మళ్ళీ అది చిన్నదవుతుంది. దాని క్రిందిభాగం పెద్దదవుతుంది. ఈవిధంగా సముద్రతరంగములలాగా ఎత్తూ పల్లమూ ఏర్పడుతూ వుంటవి. ఈ తరంగచలనమును ఇంగ్లీషులో "పెరిస్టాలిసిస్" అంటారు. ఆహారకణములను చిన్నవిచేసి, చిలకడానికీ, జీర్ణరసములను జీర్ణపదార్థంతో మిళితంచేయడానికీ, ఆ పదార్థములను ఒకచోటనుంచి మరొకచోటికి పంపడానికీ, తరంగచలనం సహకరిస్తుంది. ఇలియాలోనుంచి ఒక పోర్టల్ వెయిన్ అనే రక్తనాళము ప్రారంభమై, పైకిపోయి, లివరులో తన శాఖల ద్వారా విస్తరించి, లివరులోనుంచి హిపాటెక్ వెయిన్‌గా హృదయానికి వెళ్ళిపోతుంది.

ఆహారం నోటిలో ఉమ్మినీరుతో తడిసి, దంతసహాయంతో నమలబడి, ముద్ద అయి, ఫారింక్సుదాటి, ఈసాఫెగస్‌ద్వారా తరంగచలనంవల్ల కడుపులోకిపోతుంది. కడుపులో మ్యూకస్ మెంబ్రేనులోఉన్న గ్లాండులు గాస్ట్రిక్ జ్యూస్, అనేరసమును స్రవించేస్తవి. అందులో పెప్సిన్ అనేపదార్థము, హైడ్రోక్లోరిక్ ఏసిడ్ (ద్రావకము) ఉంటవి. మ్యూకస్ అనే జిగురుపదార్థమును కూడా ఈపొర స్రవింపచేస్తుంది.

డుయోడినంలో పాంక్రియాటిక్ జ్యూస్, బైలు, రెండూ జీర్ణక్రమాన్ని మరొక స్థితికి తీసుకొని పోతవి. పాంక్రియాస్ ఈ రసమును స్రవింపచేయడమేకాక, తనలోఉన్న కొన్ని జీవాణువులద్వారా "ఇన్సులిన్‌డ్" అనే పదార్థమును తయారుచేస్తుంది. ఇన్సులిన్ లేకపోతే శరీరం శర్కరాద్రవ్యములను దహించలేదు. అప్పుడు "డయాబెటిస్" అనే వ్యాధి యేర్పడుతుంది. తరవాత జెజునాలో సక్కస్ ఎంటెరికస్ అనే రసం జీర్ణక్రమమును పూర్తిచేస్తుంది. ఎంటెరన్ అంటే పేగు అని చెప్పేను. ఎంటెరికస్ అంటే పేగుకు సంబంధించినది అని అర్థం. టైఫాయిడ్ జ్వరంలో, ప్రేగులు వాస్తవి. అందుకని దానికి ఎంటెరిక్—జ్వరం అని పేరు. జీర్ణమైన పదార్థము, ద్రవరూపంలో ఇలియం మ్యూకస్ మెంబ్రేనులో నుంచి అపహరించబడి, పోర్టల్ వెయిన్ ద్వారా లివరులోకి పోయి. అక్కడ కొన్నిమార్పులు పొంది, రక్తంద్వారా శరీరం అంతటికీ పోతుంది.

జీర్ణకోశ భాగములలో సాధారణంగా యేర్పడే వ్యాధి వాపు. లాటిన్ భాషలో ఐటిస్ అంటే వాపు అని అర్థం వాపును ఇంగ్లీషులో ఇన్‌ఫ్లమేషన్ అంటారు. గాస్ట్రియం అంటే కడుపు అని చెప్పేను. గాస్ట్రియం + ఐటిస్ = గాస్ట్రైటిస్ అంటే కడుపువాపు అని అర్థం. ఇల్లాగే పాంక్రియస్ + ఐటిస్ = పాంక్రియటైటిస్; హిపార్ ఐటిస్, = హిపటైటిస్ టాన్సిల్ + ఐటిస్ = టాన్సిలైటిస్, ఎంటెరన్ + ఐటిస్ = ఎంటెరైటిస్, ఎప్పెండి + ఐటిస్ = ఎప్పెండిసైటిస్—ఇలా అనేకవ్యాధులు ఆయా పేర్లతో ఏర్పడతవి; అంగంయొక్క నిర్మితి తెలిస్తేనేగాని, (Structwre) దాని ధర్మం (Function) తెలియదు. అవయవము దాని సహజధర్మములను నిర్వహించకపోవడమే రోగము. నిర్మితీ, ధర్మమూ సూక్ష్మంగా అర్థంచేసుకుంటేనే గానీ, ఏ అవయవం వ్యాధిగ్రస్తమైందో తెలుసుకోలేము. ఏ అవయవధర్మం ఎంతవరకు మారిందో, దానినిబట్టి, రోగలక్షణములు వుంటవి. దానినిబట్టే ఏ వ్యాధి ఎంత ప్రమాదకరమో తేలుతుంది. కొద్దిగానైన శరీరావయముల నిర్మాణం, వాటి ధర్మం తెలియకపోతే, రోగం స్వభావమే అర్థంకాదు. ★



అన్నపూర్ణవారి 6-వ చిత్రంలో నాగేశ్వరరావు, గిరిజ.


వార్తాభరణం

సంక్రాంతి కానుకలు శరవేగంతో బయలుదేరి వచ్చేస్తున్నాయి. కొన్నిటిని పండగకి రెండుమూడువారాలు ఇటువేపుగా గురిచేశారు. కొన్ని పండక్కే గురిపెట్టారు. ఒకటో రెండో రద్దీనిబట్టి అటవుతాయి.

ప్రగతి ఆర్ట్ పిక్చర్స్ వారు తాతినేని (ఇల్లరికం) ప్రకాశరావు దర్శకత్వాన తీస్తున్న 'మాబాబు' చిత్రం 14 రీళ్లు తయారైంది. ఇంక రెండురీళ్లు తరువాయి. గతవారం వీరు ఈ చిత్రంలో ముఖ్యఘట్టాలలో ఒకటిఅయిన కోర్టు సన్నివేశాన్ని విజయాస్టుడియోలో చిత్రించారు. ఈ చిత్రంలోఉన్న అగ్ర నటీనటులు—నాగేశ్వరరావు, సావిత్రి, రేలంగి, గుమ్మడి, రమణారెడ్డి, కన్నాంబ, ఎం. ఎన్. రాజం మొదలైనవారంతా ఇందులో పాల్గొన్నారు. తనకన్న బిడ్డడిని అన్యుల కివ్వవద్దని ప్రాధేయపడే ఉద్వేగభరిత సన్నివేశంలో హృదయపూర్వకంగా నటించిన సావిత్రి ఒకమారు సొమ్మసిల్లిపోయింది.

ఈ వారంలోనే సావిత్రి ఇంటివద్ద ఆమె కుటుంబంవారంతా సరదాగా క్రికెట్ ఆడుకునే సన్నివేశం షూట్ చేశారు. సావిత్రి, రేలంగి, కన్నాంబ, ఎం. సరోజ, బాలనటి హనీ ఇరానీ ఇందులో ఉత్సాహంగా పాల్గొని చూడవచ్చిన వారందరికీ కూడా ఉత్సాహం పంచిపెట్టారు.

నవంబరు నెలాఖరుకు షూటింగు అయి



పోతుందనీ, డిసెంబరు మధ్యలో విడుదల చేయడం జరుగవచ్చునని నిర్మాత డి. వి. ఎస్. రాజు గారు చెప్పారు.

*　　*　　*

అన్నపూర్ణావారి కొత్తచిత్రం, (ఇంకా నామకరణం జరగలేదు) సంక్రాంతినాటికి విడుదల అవుతుంది. నిర్మాణ కార్యక్రమం చాలవరకు పూర్తిఅయిపోయింది. గతవారం కేరళలో ఔట్ డోర్ దృశ్యాలు చిత్రించడానికై నిర్మాత మధుసూదనరావు, మొదలగువారు వెళ్ళారు.

సంక్రాంతి కానుకలలో మరొక ముఖ్యమైన చిత్రం ఎన్. ఎ. టి. వారి 'సీతారామ కల్యాణం'. వీరి చిత్రానికి షూటింగ్ పూర్తి అయింది. రీరికార్డింగు జరుగుతోంది. రామారావు రావణుడి భూమిక నిర్వహించారు. రచయిత సముద్రాల రాఘవాచార్య. సంగీత దర్శకుడు గాలిపెంచల నరసింహారావు.

మంజీరావారి సాంఘికం 'చివరకు మిగిలేది' షూటింగ్ పూర్తి అయింది. సావిత్రి, బాలయ్య, కాంతారావు, పాల్గొంటున్న ఈ చిత్రానికి జి. రామనీడు (మాయింటి

వార్తాభరణం

మహాలక్ష్మి) దర్శకుడు. ఈ చిత్రం కూడా డిసెంబరులోనే రావచ్చునని తెలుస్తుంది.

* * *

ప్రసిద్ధ దర్శకుడు ఎల్. వి. ప్రసాద్ గారు, 'నిత్య కల్యాణం – పచ్చ తోరణం' చిత్రకథకు కొన్ని మార్పులూ, కూర్పులూ చేసి తమిళంలో తీస్తున్నారు. ఇది పూర్తికాగానే తమ తరువాతి తెలుగు చిత్రం 'కొడుకులూ కోడళ్లూ' నిర్మాణం ఆరంభించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ప్రసాదీ ప్రౌఢ కృష్ణ పేరిట 'ఇల్లరికం' చిత్ర కథతో ఈయన నిర్మిస్తున్న హిందీ చిత్రం 'ససురాల్' తాతినేని ప్రకాశరావు దర్శకత్వాన బొంబాయిలో తయారవుతోంది.

* * *

విజయవారి 'జగదేక వీరుడు' చిత్ర నిర్మాణం ఆరంభమైంది. ఒక సెట్ పై షూటింగ్ పూర్తిచేశారు. కె. వి. రెడ్డిగారి దర్శకత్వాన తయారవుతున్న ఈ చిత్రానికి పింగళి నాగేంద్రరావు రచయిత, నటీనటులు సరోజా దేవి, రామారావు.

విజయవారు మావుకోరు చిత్రాన్ని తమిళంలో నిర్మించాలని సంకల్పించినట్లు కూడా తెలిసింది. ★

హాస్యాక్షవరాలు.

దీపావళికి అటూ ఇటూ విడుదల అయిన చిత్రాలలో రెండో మూడో మరోబా కాశ్చేకాయనీ, పోటీవల్ల పీటీ అయిపోయాయన్నా వాటికి పూర్తి పంజాయిషీ కొజాల వనీ సినీమనీషులు అంటున్నారు. కథలు బొత్తిగా పురిలేని బారాలని, నటీనటుల ఆకర్షణ శక్తి మకీ భూగోళానికి ఉన్నంత భారీగా లేదనీ, పాటలు పాతపాటలలో సాగాయనీ, చిత్రీకరణ నానుస్తూ సాగిందనీ అన్నారు. వీటికి మందేమిటి? తరుణోపాయం ఏది అని పరస్పర తర్కించుకున్నారు

'కాదు దారిలేదు' అన్నాడొకాయన రెండు రీళ్లు నిట్టూర్చి.

"మనది విషవలయం. తీగలాగితే డొంకంతా కదులుతుంది. చాతనైతే డొంకంతా తీసేసి కొత్త లతని పెంచాలి అన్నాడు నీరసంగా – అది అసాధ్యం అని ధ్వనిస్తూ...

నిజమే, ఈపని మారాత్తుగా జరిగేది కాదనీ ప్రయత్నించినా కలిసి వచ్చేది కాదనీ ఉత్సాహాల్లాంటివి వచ్చి ఆ కల్లోలంలోంచి అమృత సమానమైన కొత్తిదారి ఎప్పుడో పుడుతుందనీ అందాకా 'దంపినమ్మకి బొక్కిందే కూలి' అన్నట్టుగా వ్యవహారం చేసుకుపోతూ ఉండటంతప్ప మార్గాంతరం లేదనీ పరిశ్రమలో మునిగి తేలే వారు అంటారు.



సారథీవారి 'కుంకుమ రేఖ'లో సావిత్రి.

అందువల్లనే 'సినీనటులు షేక్స్పియన్‌లా' ఏమేం చెయ్యాలో చెబుతూ ఫిలించేంబరు గతవారం విడుదలచేసిన కోరికల జాబితా చాలమందికి హాస్యాస్పదంగా కనబడింది. కొందరు వీటిని హిరణ్యాక్ష వరాలన్నారు. జవాబు ఇవ్వబడతగని యక్ష ప్రశ్నలన్నారు.

ఎవరూ యుద్ధాలు చేయకూడదని కొలంసాడు లీగాఫ్ నేషన్స్ నీరసంగా పెట్టిన తీర్మానాలబాపతన్నారు... నటులు సాలుకు ఆరుచిత్రాలకన్న మించి పనిచేయకూడదు! దర్శకుడు మూటికిమించి పనిచేయకూడదు! తగిన కారణం లేనిదే నిర్మాత ద్విభాషాచిత్రం తీయకూడదు!! పెద్దతారలు తమ యిష్టం వచ్చినవారిచేత కాక నిర్మాత చెప్పినచోట మేకప్ చేయించుకోవాలి. హరిబాబే గతి గోదాలనీ జాస్తిపైనే తలదువ్వాలనీ ఎట్టబట్టకూడదు... పెద్దపంతి! రచయితలు (! ?) తాము ఇచ్చిన (?) కథ (?) పూర్తిగా మౌలికమైనదే (!) నని ప్రతిజ్ఞ (? ! ?) చెయ్యాలి!!!!...ఇవీ ఛేంబర్ మెమొరాండంలో కొన్ని అంశాలు.

"ఊహ మంచిదేగాని—ఎందుకొ రెండి రేలంగి హాస్యం కూడా ఈమధ్య ఎవర్నీ ఈ జాబితా అంతగా నవ్వించలేదు" అన్నాడు ఒక నిర్మాత-రచయిత-దర్శకుడూ విరగబడి నవ్వుతూ—ఈనాడు నిర్మాతలంతా తెలుగేతరకథల్నే కొంటున్నారనీ, వాటిని తమ అభిమానుల సహాయంతో కథలుగా బనాయిస్తున్నారనీ, తెలుగులో కథఆలోచన ఇంకా శైశవంలో ఉందనీ ఛేంబరుకు తెలీకపోవచ్చు. ★

సినీ మాయాజాలం

పి. వెంకట్రావు

వెనక ఓసారి ఒక పిక్చరు ప్రివ్యూకి వెళ్లాను. ఆ సినిమా పేరు సంసారం.

అది రమారమి మూడున్నరగంటలసేపు నడిచినట్టు జ్ఞాపకం. మధ్యలో లేచిపోతే బాగుండదని ఆవలిస్తూ అక్కడే కూర్చున్నాను.

పక్కని కూచున్న స్నేహితుడొకడు చెయ్యిపెట్టి పొడిచిన తరవాత ఉలిక్కిపడి మేలుకుని 'ఇంకా తెల్లారందే!' అన్నాను. 'నీ తెలివి తెల్లారినట్టే ఉంది! పిక్చరయిపోయింది! లే!' అన్నాడు. నా మిత్రుడు. నీరసం నా కాళ్లీడ్చుకుంటూ వీధిలో పడ్డాం.

మొత్తంమీద ఆ చిత్రం సారంలేని సంసారంలాగే ఉందన్నారు, అక్కడికి వచ్చిన సినీవిమర్శక శిఖామణులంతా! 'పెట్టుబడికి అట్టే ఢోకా ఉండదు లేవోయ్!' అన్నాడు ఒక ఫిల్ముస్టాల ఆసామీ ఆవలిస్తూ. ఇది మూడోనాటికే ఫ్లాఫ్! ఎంత పందెం?' అన్నాడు సినిమాల్లోపడి - దివాళా తీసిన ఇంకొక దివాలీ!

చిట్టచివరికి పందెం వెయ్యడం జరగలేదు గాని వేసే ఆయన ఇంకోసారి దివాళా తీసి ఉండును! ఆ తరవాత సంసారం ఆంధ్ర దేశంలో అంతట ఆరుమాసాలవరకు పారాడి పోయింది! ఆపైన అది హిందీలో కూడా తీశారు. అప్పటికి నా సినీవిమర్శక మిత్రుల నోళ్లకి తాళాలుపడ్డాయి. అదేదో గాలిపాటు! లేకపోతే దానిలో ఏం ఉంది! అన్నారు వాళ్లు! కాని దానికి నకళ్లుతీసిగల్లాపెట్టెలు నింపుకోవచ్చునని పెద్ద పెద్ద డైరెక్టరేమిటి! యాక్టరేమిటి చాలా తంటాలుపడ్డారు. చిట్టచివరికి ఆ నకళ్ల వల్ల వాళ్ళ నవనాళ్ళు కుంగిపోయాయి. లాభాలు గూబల్లోకివచ్చాయి. కాని కళ్ళు మాత్రం తెరుచుకున్నాయి. ఆ తరవాత అందరు ఏకగ్రీవంగా 'సంసారం' అంత గొప్ప సినీమా రాలేదన్నారు. నే నానాటి నించి సినీమాలని గురించి మనకి తెలిసింది చాలా తక్కువేమో! అనుకున్నాను.

ఆ తరవాత మరికొన్నాళ్ళకి సత్యజిత్ రాయ్‌చిత్రం 'పథేర్ పాంచాలీ' మద్రాసులో చిత్రాలో ప్రదర్శిస్తున్నారన్నారు. మేమంతా టిక్కెట్లకోసం పడ్డ యాతన ఇంతా అంతా కాదు ఎందుకయినా మంచిదని ముందుగానే సీట్లు బుక్ చేయించుకున్నాం. సాయంత్రం కొంచెం చినుకులు పడుతున్నా లక్ష్యపెట్టక బస్సులో వెళ్లాడుతూ నిలబడి, ఎల్లాగో అలాగ శ్రమపడి చిత్రా థియేటరులో సీటుల్లో చదికిలబడ్డాం!

నే నెరిగినంతవరకు అంత తక్కువ మంది హాజరయిన చిత్రం ఏది లేదు. ఇదేమిటీ చిత్రం! అని నేను చాలా ఆశ్చర్యపడ్డాను. ఆ చిత్రం సంగతి చాలా కాలంనించి పేపర్లలో పడుతూంది. పెద్ద పెద్ద విమర్శకులందరు ముక్తకంఠాలతో దాన్ని ఆకాశానికెత్తేస్తున్నారు. మద్రాసువంటి మహానగరంలో కాకపోతే ఆ చిత్రానికింకెక్కడ ఆదరణ దొరుకుంది! కాని ఎందుచేతనో గాని అట్టేమంది పెద్దలెవరు ఆ చిత్రం చూడాలని తహతహపడలేదు.

మరికొంతసేపటికి పథేర్ పాంచాలీ ప్రారంభమయింది. మాలో ఎవరికీ ఆ చిత్రం చూస్తున్నామన్న స్పృహే లేదు! అదేదో సినీమా అనికూడా అనిపించలేదు! మా కళ్లముందర వంగదేశంలో ఒక సామాన్య సంసారంలో వచ్చే కష్టసుఖాలన్నీ వాస్తవ జీవితంలోలాగే చాలా సహజంగా అతిసన్నిహితంగా ఆర్ద్రంగా సాగిపోతున్నాయి. ఆ తరవాత నా మిత్రులు కొంతమంది ఆ చిత్రం రెండుమూడుసార్లు చూశారు.

పథేర్ పాంచాలీలో అసలు హీరో, హీరోయిన్, విలన్-వీళ్ల హంగామాలుగాని, గామాలవంటి హాస్యనటుల అల్లరుగాని ఎక్కడా కనబడలేదు! చిత్రంఅంతా ఆమూల నుంచి ఈ మూలదాకా నిమ్మకి నీరెత్తినట్టు సాగిపోయింది.

మరి ఆ పథేర్ పాంచాలీ మన పెద్దపెద్ద కేంద్రాలలో ఎక్కడయినా పట్టుమని పది రోజుల పాటయినా ఆడుతుందా? ఆడదని మన సినీ పెద్దలందరికీ తెలుసును. కనకనే వారెవరూ అలాంటి చిత్రాల జోలికి పోరు. పోతే చేతులు కాల్తాయని భయం!

మన తెలుగు దేశంలో ఉత్తమ చిత్రాలు తీయగలిగిన సమర్థులకేం కొరతలేదు! అయితే వారెవరూ బాక్సాఫీసు హిట్లరు కారు! కాలేరు! కాగా పెద్ద పెద్ద నిర్మాతలెవరూ వారి దరిమానానికి కూడా వెళ్లరు! వెళ్లినా 'హే! నిర్మాతా! నీకో నమస్కారం! అని ఒక దణ్ణంపెట్టి దూరదూరంగా పారిపోతారు! భారత ప్రభుత్వం పతకాలకి, పతాకాలకి ఇంకొకవంక దణ్ణం పారేసి గల్లాపెట్టె పథకాలకోసం కాలుగాలినపిల్లిలా తిరుగుతారు.



డీలక్స్ ఫిలింస్‌వారి "బాగ్దాద్ గజదొంగ"లో వైజయంతి, ఎం. జి. రామచంద్రన్.



వరనరాజు కంపెనీవారి 'వీరసామ్రాజ్యం'లో రంగారావు, వైజయంతీమాల.

ఈ పక్షకాలేకో అందరికీ బాగా తెలిసి నదే. భారత ప్రభుత్వం నిడివి తగ్గించాలని ఎంతగా పాంకరించినా ఇది సాధ్యమైనంత పొడుగ్గా ఉండాలి. పెద్దతారల పేర్లు డాన్సుల హోరులు తప్పవు. కథ, పాటలు, మాటలు, ఇటీవల బాగా డబ్బుచేసుకున్న ఏ హిందీ సినిమా ధోరణిలోనో అచ్చంగా గిరి గీసినట్టు సాగిపోవాలి. ఎక్కడ గాడీ తప్ప కూడదు. పౌరాణికమయినా, సాంఘికమయినా, జానపదమయినా ఒక్కటే బాత! ఆపైన పెద్దపెద్ద అక్షరాలతో పేపర్లలో ప్రకటనల హోరు!

ఇలాంటి సినిమాలు తీస్తే అసలుకి మోసం రాదని అందరూ అంటారు. కాని చెప్పలేం! ఒక్కొక్కప్పుడంతా తలకిందులయిపోవడం కూడా కద్దు. దీనికేమిటి కారణం? ఈ కిటుకు పట్టుకున్నవాళ్లే డైరెక్టర్లలో ఘటికులు.

అయితే ఈ కిటుకు ఎప్పుడు ఒక విధంగా ఉండదు. అయిదారు నెలలకే హఠాత్తుగా మారిపోతూ ఉంటుంది.

పేరుమోసిన డైరెక్టర్లనెవరినయినా పలకరిస్తే ఈ పరమరహస్యం కనిపెట్టగల శక్తి పుట్టుకతోనే రావాలిగాని ఒట్టి మాటలతో సాధ్యమయ్యే వ్యవహారం కాదని అంటారు. అసలు సినిమా లెవరికోసం తీస్తున్నాము? ప్రజలకోసమేగాని మీలాంటి అర్థపని మేధావులకోసం కాదని వాదిస్తారు.

ఒకవేళ ఏదయినా చిత్రం ఆట్టేకాలం ఆడలేదనకోండి! అప్పుడేమంటారో తెలుసునా! 'బ్రదర్! ఉవకబారు చిత్రాలతో ప్రాణం విసిగిపోయిందయ్యా! కాస్త 'క్లాస్' పిక్చర్ తియ్యాలని సరదా పుట్టింది!' అంటారు.

ఒకవేళ ఆ చిత్రమే బాక్సాఫీస్ సక్సెస్ అయితేనో! ప్లేటు ఫిరాయిస్తుంది!

బ్రదర్! ఇలాంటివి తియ్యడం నాకు బొత్తిగా ఇష్టంలేదనుకో! కాని ఏమిటి చెయ్యడం? ఇదంతా లక్షలతో వ్యవహారం! కనక ముందుగా మన చిట్టచివరి తరగతి ప్రేక్షకులందరినీ సంతోషపెట్టాలి. నువ్వు వెయ్యిచెప్పు! లక్షచెప్పు! మన పరిశ్రమ బతుకంతా మోస్తున్నది వాళ్ళే కాదటయ్యా! ఈసారి కనక ఎవరయినా మంచి ప్రొడ్యూసరు దొరికితే భారతప్రభుత్వం బంగారు పతకం మనదే! కాని అలాంటివాళ్ళెక్కడా కనబడడం లేదయ్యా!

మధ్యన ఏదయినా అడ్డుపుల్ల వేసి మాట తప్పిస్తే తప్ప ఆ ధోరణి అలాగే సాగిపోతుంది. ఇంతకీ దర్శకులు ఎవర్ని అనుసరిస్తున్నారు? నిర్మాతలనా? చిట్టచివరి తరగతి ప్రజలనా? చెట్టుముందా? విత్తుముందా? అన్నట్టుంది ఈ ప్రశ్న!

రాజకీయ నాయకులకి మల్లేనే మన డైరక్టర్లకూడా ప్రజలే తమ ఆరాధ్య దైవతాలని అంటారు.

కాని ప్రజ అభిరుచి మనం అనుకున్నంత తక్కువ స్థాయిలో లేదు. నిజంగా గొప్ప చిత్రాలు తీయగల సాహసులే ఉంటే ప్రజ అవి తప్పకుండా ఆదరించి తీరతారు.

ఈ అసలు రహస్యం గమనించడం మాని వేస్తే అన్నీ సమస్యలే! అన్నీ చిక్కు ప్రశ్నలే! కనకనే ప్రజాభిమానం చూరగొన్న ఉత్తమచిత్రం నిర్మించడం ఈనాడు మనకొక గొప్ప గడ్డుసమస్యలా తయారయింది. ఇటు ప్రజాదరణ, అటు ఉత్తమ స్థాయి సాధించుకోవడం సాధ్యపడడంలేదు. ఒకదానికోసం ఇంకొకటి బలిపెట్టడం తప్పడంలేదు. విదేశాలలో ఇవి రెండు సమాన స్థాయిలో సాధించిన ఉత్తమ దర్శకులనేకులున్నారు.

ఈ వేళ కాకపోతే రేపయినా మన తెనుగునాట ఇటువంటి ఉత్తమ చిత్రాలు బయలుదేరి తీరతాయి. కాకపోతే వాటికి తగిన పరిస్థితులు, పరికరాలు సమకూరాలి. అంతే! ఆనాటి కానాడు కాదా గొప్పా? మన చిత్రాల స్థాయి పెరుగుతున్నదిగాని తగ్గిపోవడం లేదుగదా!

అంతవరకు, మాటలతో అయితేనేమి, చేతలతో అయితేనేమి, మన ప్రస్తుత దర్శక నిర్మాతలందరూ కలిసి ప్రదర్శిస్తున్న తెనుగు చిత్రాల విచిత్ర మహేంద్రజాలాల ప్రదర్శనాలతో కాలక్షేపం చెయ్యక తప్పదు! ★



విరల్ ప్రొడక్షన్స్ 'కనకదుర్గ పూజామహిమ'లో రాజనాల, మాధురి.

జింబో నగర ప్రవేశం

మనుషులూ, వాళ్లతోపాటు జంతువులూ కూడా కలిసి మెలిసి నటించిన 'జింబో నగర ప్రవేశం' అక్టోబరు 28 సాయంకాలం ఫిలిం సెంటర్ స్టూడియోస్‌లో పత్రికా విలేఖరులకు చూపించారు.

జంతువులు నటించడానికి మనుషులకు కావలసినన్ని యోగ్యతలు అవసరంలేదు. పెర్సనాలిటీ, ఫేస్‌కట్, సంభాషణలు చెప్ప గలగడంవంటి షరతుల ప్రసక్తి అక్కరలేదు. అభినయంమాత్రం కావాలి. అందుకు ఇందులో 'పెడ్రో' అనే చింపంజీ చేసిన అభినయం ఔననిపించుకుంటుంది.

ఒక అడవిమనిషిని మచ్చిక చేసి, వైజ్ఞానిక శక్తితో అతనిని మానవుణ్ణి చేసి, ప్రేమతో అతన్ని మనిషిని చేసిన కథ దీని ఇతివృత్తం. ఆ అడవిమనిషి, జింబోగా అజాద్, అతన్ని ప్రేమతో జయించి తనను తాను అర్పించుకున్న మానవతి మాలతిగా చిత్రా చక్కగా నటించారు

మానవత్వం జంతువుల్లోనూ, పశుత్వం మానవుల్లోనూ ఉన్నంతకాలం ఏది జంతువో, ఎవరు మనిషో చెప్పలేని 'పజిల్' చిరకాలంగా అపరిష్కృతంగా ఉంది. ఆ పజిల్ విడగొట్టడానికి 'జింబోనగరప్రవేశం' కొంత ప్రయత్నించింది.

హాలీవుడ్ చిత్రాలు ఇటీవల చాలా తెలుగులోకి అనూదితమై ప్రజాదరణ పొందాయి. 'జింబోనగరప్రవేశం' కూడా జనాదరణ పొందవచ్చు.

శ్రీశ్రీ కూర్చిన మాటలూ, పాటలూ, విజయభాస్కర్ సంగీతం ఈ చిత్రంలో ఆకర్షణలు.

కాగా ఈ చిత్రమంతా సర్కస్ గమ్మత్తులతో నిండి ఉంది. తగినంత హాస్యం (దాదాపు బఫూనరీ) ఉంది. క్రీకారణ్యాల మధ్య వేటవంటి భయంకర సన్నివేశాలూ ఉన్నాయి. అన్నీ కలసి పదమూడు వేల అడుగుల చిల్లర కాలక్షేపమూ ఉంది. ★



ఇటీవల చెన్నపురి ఆంధ్రమహాసభ వారు నిర్వహించిన నాటికల పోటీలలో 'కథ కంచికి' (ఆంధ్రపత్రిక 59-60 ఉగాది సంచికలో ప్రచురితం) నాటికను ప్రదర్శించి 'ఉత్తమ ప్రదర్శనకు ప్రథమ బహుమతి పొందిన మద్రాసు ఆంధ్రా ఆర్ట్సువారు. కూర్చున్నవారు: (ఎడమ నుంచి) టి. యస్. నారాయణ, రాధాకుమారి (ఉత్తమనటి) రావికొండలరావు (రచయిత) పి. జె. శర్మ, కె. గోపాలరాజు నించున్నవారు: (ఎడమ నుంచి) ఆర్. నారాయణరావు పి. అంజనేయులు, లాజాలు, కె. ప్రసాదరావు.

పంకిలి బ్రతుకులు

(13-వ పేజీ తరువాయి)

అప్పటికే నాలో అంకురించిన అనుమానం తెరలు విచ్చింది. మీనాక్షి కొడుకు ఎక్కడివాడు ఎక్కడ తేలాడు?

ఒకరాత్రి వేళ ఎందుకో మెలుకువవచ్చింది. ఉన్నట్టుండి ఓ చిత్రమైనఆలోచన నన్ను నిలబెట్టి అడిగింది. 'ఈ పిల్లవాడు ఆకుటుంబంలోనే పెరిగిఉంటే?...జగన్నాథానికి మళ్ళీ పెళ్ళయిందని ఎప్పుడో విన్నాను. సంతానమూ కలిగిందేమో! వాళ్ళెలా ఉన్నారో నాకేమీ తెలియదు. వీడే గనక అక్కడుంటే మళ్ళీ జగన్నాథంలా తయారయేవాడు. అర్థంలేని గారాబాలతో మంకుపట్టులతో మొద్దబ్బాయిఅయి కూర్చునేవాడు మీనాక్షి ఆ కూపంలోనుంచి బయటికివచ్చి తనకొడుకును మనిషిగాచేసింది. వాడికో ఉన్నతమైన స్థానాన్ని వ్యక్తిత్వాన్ని ఇచ్చింది. ఈ కొడుకును వెన్నుదట్టి తను ప్రపంచపు చీకటి తెరల మాటుకి తప్పుకొంది.

ఆదివారం పొద్దున్న తొమ్మిదయిందేమో. మా రెండోవాడు వచ్చి "గోపాలకృష్ణ వచ్చాడు నాన్నా మీకోసం" అన్నాడు.

బయటికివచ్చాను. గోపాలకృష్ణ నమస్కరించాడు. మడతలు నలగని బట్టలతో గంభీరమైన రూపంతో ఉన్నాడు. ఆమాటలతీరే మనుషుల్ని ముగ్ధుల్ని చేస్తోంది.

ఏవోపుస్తకాలు నాదగ్గరున్నాయని తెలిసి వాటికోసం వచ్చానన్నాడు. తను వ్రాసిన ఖండిక ఒకటిచ్చి తప్పులు దిద్దమన్నాడు.

అతన్ని ఏవేవో ప్రశ్నించాను. చాలామంది కాలేజీకుర్రాళ్ళకుండే అహంకారం కన్పించలేదతనిలో. వినయంగా మాట్లాడుతున్నా దానివెనకాల పట్టుదలా స్వేచ్ఛా ప్రవృత్తీ తొణికిసలాడుతూనే ఉన్నాయి. అతను నాతో చాలా విషయాలు మాట్లాడాడు. ప్రతిచిన్న విషయంలోనూ అతనికో కచ్చితమైన అభిప్రాయం ఉన్నది. అతని ఉద్దేశాలు కొన్ని తలతిక్కగా కనిపించినా తార్కికంగా ఉన్నాయి. అతడికి మొత్తానికి పుస్తకపరిజ్ఞానం చాలా ఉందనీ ఇంకా అనుభవంమాత్రం చాలదనీ తెలుసుకున్నాను. అతనిపక్కనే కూర్చున్నారు నాగనీ, శశీ ఒళ్ళంతా కళ్ళు చేసుకొని. ఇలాంటి ఊహలు కలగవచ్చునేది వాళ్ళకసలు స్వప్నంలోకూడా తట్టిఉండదు.

"ఏ ఊరు బాబూ నీది? మీ నాన్న గారెవరు?" తెలీనట్టు అడిగాను.

ఆరేడేళ్ళ కిందట పదిపన్నెండేళ్ళ వాడు. మసక వెలుతురులో చూశాను. గుర్తు పట్టాడనే భయంలేదు.

"ఇదివరకు రాజాపురంలో ఉండేవాళ్ళం. మా నాన్న గారు చనిపోయినతరువాత మా అమ్మ భద్రాచలందగ్గర ఉన్న పల్లెటూళ్ళో ఉంటున్నది."

"మీ నాన్న గారేంపని చేసేవారు?"

"క్వారీల కంట్రాక్టు, మా అమ్మకూడా అక్కడే చిన్నస్కూల్లో టీచరుగా పని చేసేది!

"మరి నువ్వెక్కడ చదివావు?"

"పక్కనే ఉన్న ఊళ్ళో హైస్కూల్లో చదువుకొనేవాణ్ణండీ, అయినా నేను చదువుకొన్నది ఎక్కువగా మా అమ్మదగ్గరేనండీ. మా అమ్మకు సాహిత్యం అంటే మరీఇష్టం. లైబ్రరీనుంచి పుస్తకాలు తెప్పించేది. తన సంపాదనా కొంతా చాలావరకూ చదువుకే వినియోగించేది. మా అమ్మ నిజంగా చెప్పుకోవలసినమనిషి. తల్లి నిగురించిన తలపే అతణ్ణి మహోత్సాహంతో పరచింది. అతని ప్రేమా గౌరవం, ఆమెలో గూడుకట్టుకొన్నాయని తెలుసుకొన్నాను. అతని కళ్ళు తనతల్లి నిగురించిన గర్వంతో తళతళలాడుతున్నాయి.

ఇక్కడే...సరిగ్గా ఇప్పుడేనాలో ఎవరో రాక్షసుడు ప్రవేశించాడు. ఆ గూడు పడగొట్టాలి. ఆ తళతళలు మసకేసిపోవాలి! ఈ పిల్లవాడికి తనతల్లి పతనగాథ తెలీదా? తెలిస్తే ఈ గర్వం నిలుస్తుందా?

ఒకడు : ఒరే! సున్నకిసున్న చేరిస్తే ఏమవుతుందిరా?

మరొకడు : రెండు సున్నలు.

ఒకడు : తప్పు. సున్నంరా.

ఎస్. ఆర్. ఎస్. శాస్త్రి (నూజవీడు)

'మీ నాన్న గారిపేరేమిటన్నావ్'

"శ్యామలరావు."

నాహృదయం భగ్గుమంది. పచ్చి అబద్ధం. ఏదో ఒక చిత్రమైన అనుభూతి గాలానికి గిజగిజలాడుతున్న ఎరను చూడాలనే వేటగాడి ప్రవృత్తి ఏదో నన్ను తరిమింది. నాకసలు ఏదీ గుర్తురాలేదేమో. నా పిల్లలెవరికీ లేనిసంస్కారం విజ్ఞానం ఈ అనామకుడికి ఈ భ్రష్టురాలి కొడుక్కి ఉండటమా? అసలు నాకు కలిగినఉద్రేకం ఏమిటో నా సంస్కృతీ విగ్రహం, ఇన్నేళ్ళ చదువూ ఏమయినాయో నాకర్థం కాలేదా సమయంలో. "కాదు.. మీనాన్న శ్యామలరావు కాదు" అన్నాను. 'కాదు' అరిచాను. "మీ నాన్న అని నీవు పిలుస్తున్న మనిషి మీనాన్న కాదు. మీ నాన్న జగన్నాథం. మాది నెల్లూరుజిల్లా ... నీ చిన్నప్పుడే నిన్ను తీసుకొని శ్యామలరావుతో లేచిపోయింది. ఎన్నాళ్లు ఇలా లోకం కళ్ళుకప్పుతారు మీరు" అనేశాను.

అసలీ దెబ్బ షాక్ అతనికి. ఇంతకంటే అతనికి దారుణం మరొకటిలేదు. చప్పున నిలుచున్నాడు. కళ్ళెర్రబడ్డాయి, పెదవులదురుతున్నాయి.

పిడికిళ్లు బిగుసుకొంటున్నాయి.

"మా అమ్మ.. మా అమ్మ" అంటున్నాడు అర్థంలేకుండా రవీ శశీ దిమ్మెరపోయినారు.

"మీ అమ్మ...మీ అమ్మ నేఅడుగు చెప్తుంది" అన్నాను వెకిలిగా నవ్వుతూ.

పిచ్చిగా జుట్టుపీక్కుంటూ బయటికి పోయాడు. అతడు తెచ్చిన కాగితాలు దూళిలో పొర్లుతున్నాయి, అతని గౌరవాభిమానాలలాగే.

ఇప్పటికే పెద్దదయిన కథను ఇంకా పొడిగించను. ఏం జరిగిందో పాఠకులు ఊహించే ఉంటారు. మర్నాటినుంచీ గోపీ కనిపించలేదాఊళ్ళో. రవి పల్లె కనుక్కొని ఆ రాత్రే వెళ్ళిపోయాడని సామానంతా అలాగేఉందని కబురు చెప్పాడు. నాలుగురోజులయింతరువాత నాపేర నొక ఉత్తరం వచ్చింది.

మామగారూ.

నానుంచి మీ రెన్నడూ ఉత్తరం ఆశించిఉండరు. మీ రేఉద్దేశంతో నా గోపీకి ఈ కథ చెప్పారో నాకు తెలీదు గాని

మీ మీద అంతనేరం రుద్దటానికి నా మనస్సు ఒప్పుకోవటంలేదు.

నేను బయటికి వచ్చేశాను మీ రనుకొన్నట్లే, శ్యామలరావు చేయూతతో. అలాగే ఆ మురికికూపంలో పడి తన్నుకొంటూ అప్పుడప్పుడు మీ అందరి సానుభూతీ కోరుతూ కన్నీళ్లూ పెట్టుకొంటుంటే గాలాంటి పెద్దల మనస్సులకు తృప్తి కలిగేదేమోగాని నిజంగ సమస్యకు పరిష్కార మార్గం వెతుక్కొనేటప్పటికి అందఱూ కతులుగట్టారు. లేకపోతే పదహారేళ్ల కిందటి కథ మీరు అభమూ శుభమూ తెలియని గోపీ ముందు ఏకరువు పెట్టటంలో అర్థమేముంది.

నా చెయ్యిపట్టుకొని పైకి లాగటానికి మీ వంటి పెద్దమనుషులు గౌరవనీయులూ ముందుకు రారనీ, ఊరికే మాట పోగొట్టుకోవటమే మిగులుతుందనీ నాకు తెలుసు. నా సంగతి శ్యామలరావుతో చెప్పాను. అలాంటివాడే ముందుకు రావాలనీ తెలుసు. కాని మీ రనుకొన్నట్టి ప్రవృత్తి నాకులేదు. మీరు నమ్ముతారో లేదో. నమ్మకపోయినా ఇప్పుడు నాకు కలిగేనష్టమూ లేదనుకోండి. శ్యామలరావు అండతో గోదావరి నీడన నాకు ఆశ్రయం దొరికింది. సంఘంలో పెద్ద మనిషి కాడు అతను. సంస్కారిగాడు. మాటలూ చెప్పలేడు. అయినా నా చెంత కూడా రాకుండా నాగోపీకి తండ్రిగా నిలిచి సంఘంలో స్థానమిచ్చాడు.

పదిమంది పిల్లలకు చదువు చెప్పుకునీ, కుట్టుపని చేసుకొనీ నా గోపీని పెంచుకొన్నాను. మనిషిగా నిలబెట్టాను. కష్టమూ సుఖమూ తెల్సుకొన్నాను. ఏనాడూ శ్యామలరావు దగ్గర్నుంచి డబ్బు ఆశించనూ లేదు. ఇద్దామని ప్రయత్నించి అతనెన్నడూ కించపరచనూలేదు. మానసికంగా అతను నాకు ఎంతో బలాన్నిచ్చాడు. చివరికి ఒక్క ప్రాణిని రక్షించిన పుణ్యమైనా దక్కించుకొన్నాడు.

ఏనాడైనా గోపికివి తెలీకమానవు. అది నాకు తెలుసు. అయినా చిన్నప్పటినుంచీ యిలాంటి ఆలోచన్లు రేపితే అవి వ్యక్తిత్వాన్ని బలహీనపరుస్తాయని దాచి ఉంచాను. కొంత వయసూ అనుభవమూ వచ్చినతరువాత వాడితో నేనే చెప్పి వాడిచ్చే శిక్షను స్వయంగా అనుభవించాలని అనుకున్నాను గాని యీలోగా మీరా కాస్త పుణ్యమూ మూటకట్టుకొన్నారు. గుండెల్లో యినుమని ఆ దెబ్బ వాడిలో లోతుగా గుచ్చుకొంది. నిజమైన బతుకు వాడిది. పయి కొకటీ లోప లొకటీ అనేది వాడికి తెలీకుండా పెంచుకొచ్చాను.

మీ మాటలతో నా బిడ్డ దేశాలు పట్టిపోయినాడు. తిరిగి నా మొహం చూడటానికి కూడా వాడికిష్టం కలగలేదు. ఇంకో పదేళ్ల తరువాత వాడికి నా సంగతి తెలిస్తే "మరేం ఫర్వాలేదు. అంతేగదా" అనేనాడే నిశ్చయంగా. వాడి సంస్కారం తెలుసు నాకు. కాని వానిలేతగుండె అప్పుడే ఈదెబ్బ ఓర్చుకోలేకపోయింది.

అయిపోయింది. సంకుచితత్వం జీర్ణించుకొన్న లోకంలో పోరాడి ఓడిపోయాను. చివరికి నాకు మిగిలిన ఆ ఒక్క ఆశా తుంచివేసేదాకా ఊరుకోని సంఘానికి సెలవు. మరోక జన్మ అనేది ఉంటుందోలేదో నాకు తెలీదు. తెలుసుకోటానికి నే నెన్నడూ ప్రయత్నించనూలేదు. ఒకవేళ ఉంటే స్త్రీగా పుట్టగూడదనీ, పుట్టినా తెలుగు దేశంలోమాత్రం పుట్టగూడదనీ కోరుకుంటున్నాను.

నాకు సరిపోని నా తావరణం లోనుంచి బయటికి వచ్చాననేగా నాకింత శిక్ష? ఇంచుమించు రెండు ప్రాణాలను నిలువునా హత్య చేసిన మీరు పెద్దమనుషులే. మీ పిల్లలకు గౌరవంగాజీవించటానికి హక్కుంది. సరే అలాగే పదికాలాలు జీవించండి. కాని మాగోపిలాంటి వాళ్లనుమాత్రం యిలా సజీవంగా నాశనంచేయాలని ప్రయత్నించకండి."

మీనాక్షి.

హంతకుడ్నే... కాదు పెద్దమనిషిని. కల్చర్డ్ సొసైటి అధ్యక్షుడిని. కవిని. రచయితను. గౌరవనీయుణ్ని. ★

చదరంగం:

అనవసరంగా ఒక ఎత్తు వేసినా ఆటకు ముప్పే!

చతురంగజ్ఞుడు శ్రీ జి. ఎస్. దీక్షిత్ ఆట పద్ధతి విశిష్టమైనది. ఆత్మరక్షణలో ఏమరకుండా మొదటినుంచి నిరంతరాయంగా ఎదిరిబలంమీద దాడులు జరపడంలో ఆయన దిట్ట. వ్యూహరచనలో బలాలను సమీకరించడంలో ఆయనకున్న నేర్పు అసమానమైనది.

క్రిందటివిడాది మే నెలలో కస్తూరికప్ టూర్నమెంటులో శ్రీ ఎమ్. ఎ. వినాయకమూర్తి (మధుర)తో శ్రీ దీక్షిత్ ఆడినఆట ఇందుకు తార్కాణం. ఆ టూర్నమెంటులో శ్రీ దీక్షిత్ ప్రథమస్థానం ఆక్రమించారు.

ఆ ఆట సాగిన క్రమం ఇది:
ఎమ్. ఎ. వినాయకమూర్తి—తెలుపు;
జి. ఎస్. దీక్షిత్—నలుపు.

ఫ్రెంచి రక్షణ పద్ధతి

1. బ-రా 4; బ-రా 3.
2. బ-మ 4; బ-మ 4.
3. గు-మ శ 3; శ-గు 5.
4. బ-రా 5; బ-మ శ 4.
5. బ-మ ఏ 3 (అ); శ×గు షా.
6. బ×శ; మ-శ 2 (ఆ).
7. గు-శ 3; మ గు-శ 3.
8. శ-రా 2; రా గు-రా 2.
9. 0-0 (రాజువైపు కోట); 0-0 (రాజువైపు కోట).
10. బ-మ ఏ 4; బ-మ గు 3.
11. శ-మ 3 (ఇ); గు-గు 3 (ఈ).
12. బ-రా ఏ 4; బ-శ 5.
13. శ-రా 2? (ఉ); బ-శ 3.
14. బ-రా ఏ 5; గు (గు 3)-రా 2.
15. బ×బ; బ×బ.
16. శ-ఏ 6; ఏ-శ 2.
17. గు-ఏ 4; రా-ఏ 1.
18. బ-గు 3 (ఊ); శ-మ 2.
19. శ-శ 3?; ఏ-రా గు 1 (ఋ).
20. రా-గు 2; మ-మ 3.
21. ఏ-ఏ 1; బ-రా 4.
22. రా ఏ-ఏ 2 (ౠ); బ-రా 5.
23. శ-రా 2 (ఎ); బ-శ 4.
24. గు-గు 6 షా (ఏ); గు×గు.
25. బ×గు; ఏ×బ.
26. శ-ఏ 5; బ-శ 5!
27. శ×ఏ; బ-శ 6 షా (ఐ).
28. రా-గు 1; మ×శ.
29. మ-మ 2; ఏ-శ 4 (ఒ).
30. ఏ-మ 1; గు-మ 1.
31. ఏ-ఏ 4; గు-రా 3.
32. రా-ఏ 2; ఏ-ఏ 4.
33. ఎ-రా గు 1 (ఓ); మ-గు 5!
34. శ-గు 5 (ఔ); గు×శ (అం).

తెలుపు ఓటమి అంగీకరించినది.

అ, 5.—; శ-ఏ 4. 6. బ-మ గు 4; బ×మ బ. 7. గు-గు 5; శ-శ 2. 8. బ-రా శ 4. ఇది స్మిస్లావ్ (తెలుపు) తో బాట్వినిక్ (నలుపు) ఆడిన క్రమం.

ఆ, నలుపు వేసిన ఈ ఎత్తు లక్ష్యం తెలుపు మ శ 3 గడిమీద దాడి చేయడం.

(ఇ) తెలుపు పదవ ఎత్తు సార్థకం కావడానికి ఇప్పుడు 11. శ-ఏ 3 వేసి ఉండవలసినది.

(ఈ) ఈ స్థితిలో వేయతగ్గ ఎత్తు ఇది ఒక్కటే. నలుపు ఏమరిపాటుతో మరే ఎత్తు వేసినా ఆటస్థితి ప్రమాదకరంగా పరిణమించి ఉండేది.

(ఉ) తెలుపు 15. బ-రా ఏ 5 వేసి ఉండవలసినది. ఇప్పటి ఎత్తువల్ల తెలుపు 11 వ ఎత్తు నిరర్థకమైనది.

(ఊ) తెలుపు 18. బ-శ 4; ఆ తరువాత అవకాశంబట్టి 19. బ-గు 4 ఆడితే బాగా ఉండేది.

(ఋ) ఈ ఫైల్ ఉపయోగించుకోనడానికి తెలుపు అవకాశంలేకుండా చేసుకొన్నగి, అలాంటి అవకాశాలను తెలుపు చక్కగా కల్పించుకొన్నది.

(ౠ) 22. గు-గు 6 షా అయితే తెలుపు ఆట చాలా బాగా ఉండేది.

(ఎ) ఈ శకటుకు అవసరంలేని గళ్ళకు వెళ్ళడం, బయలుదేరిన చోటికి తిరిగిరావడం అలవాటు అయినట్లు కనుపిస్తుంది. తెలుపు ఆట పోవడానికి ఈ శకటు ఎత్తులు చాలావరకు కారణమైనవంటే అతిశయోక్తి లేదు.

(ఏ) 24 —; బ×గు తప్పు. 25. బ×బ; ఏ×బ. 26. శ-శ 4 షా తెరచిరాజుతో నల్ల మంత్రి పోతుంది.

(ఐ) మరొక మంచిఎత్తు. దీనితో తెలుపు స్థితి విషమంగా తయారు అయినది.

(ఒ) తెలుపు 30 మ-గు 5 ఆడి మంత్రులు సమంగా పోవడానికి అవకాశం ఇవ్వరాదు.

(ఓ) 33. ఏ×ఏ; మ×ఏ షా. 34. రా-గు 1; ఏ-ఏ 6 అయితే మరొక్క ఎత్తుతో తెలుపు ఆట పోతుంది.


(ఔ) నైరాశ్యంతో వేసినఎత్తు. నిరర్థకం.

(అం) —; గు-శ 5—; మ-ఏ 6 షా ఏ×మ; ఏ×ఏ షా ఆటకట్టు.

—చాగంటి బాపిరాజు.

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

గళ్ళ నుడికట్టు-25



ఆధారాలు

అడ్డము :

1. మరో పేరు.
3. ఇల్లరికపు టల్లుళ్ళ మూలపురుషుడు-కవి.
5. వారి పూరపొరునది.
7. వేరే చెప్పాలా? మీఇంట నేను తినడం లోనే నా మెప్పుకోలు వుంది.
9. నిక్షేపంలా ఉంది-గుప్తులదేనని దాఖలా లేకపోయినా.
12. కలివిడిలోనే కేటాయింపు ఉంటుంది- అదే మన సంస్కృతిసూత్రం అంటారు.
14. పావుశేరు పాలలో ఉన్నవి.
15. ఈ గుణం రౌతు మహాధనికుడు. సాక్షాత్తూ కుబేరుడే.
17. సినిమాలో సాధారణంగా 14 నిలువు సీను తరవాత వెంటనే వచే ...ను ఇదే.
18. ఎవ...వాడిచేత ...నా ముట్ట చెప్పించు కో...లంటే ...'ఇదీ' చెయ్యాలి.
20. ఆడా మగా కూడా కనేది.
22. తక్కువైనా ఎక్కువైనా, తల్లీ ఉల్లీ కూడా చేసేది.
24. గౌతమిలో త్వరపడే స్వభావం ఎక్కువుంది!
26. చచ. ఈ కుక్కాకాదు ఆ కుక్కాకాదు ఈశ్వరుడి బాణం.

* 29. లేశం.

31. అంజనం వేసి చూడండి. మీక్కావలసిన మనుషులు కనిపిస్తారు.
32. సుగంధ ద్రవ్యం.
33. కొబ్బరికాయ పడగండి.

ఆధారాల పోటీ

గళ్ళ నుడికట్టు 25లో 29 అడ్డం మాటకు, 14 నిలువు మాటకు మేము ఇచ్చిన ఆధారాలకన్న ఉత్తమమైనవి పంపినవారికి ఐదు రూ. లు బహుమతి ఇస్తాం. ఆధారాలు మాకు చేరవలసిన ఆఖరు తేదీ నవంబరు 5, 1960.


నిలువు :


1. వింటిపైనా ఇంటిపైనా వంచినా ఉంచినా తెంచినా బాధ్యత దీనిదే.
2. బండిపోతుండగా తొలి మురుగు కాలవలో పడిపోయింది. పడిందేది? పోయిందేది?
3. బాణంలా వెళ్లి నాటుకునే నాటకం. ఒకడిదేమాట.
4. వినుకొండ వెళ్ళి కొండవిూంచి చూస్తే కనుబడునది.
5. నోటికి రుచికరమైనది.
6. బ్రహ్మ.
8. కొందరికి అప్పులిచ్చేముందు ఇవి కూడా జాగ్రత్తకోడం మంచిది.
10. దొంగ సొమ్ము కొస్తా చెల్లాచెదరై పోయింది.
11. ఇదేమిట నడిగి లాభంలేదు. ముఖ్య మేం చెప్పేదేముంది.
13. అంధా...బా డిబా డిబా డిబా డిబా డి...

* 14. శయ్య.

16. ఉన్నమాట చెప్పుకోవాలంటే ఆయుధ పూజ రోజున ఆడది విధిగా పూజించ వలసిన దిదేనంటారు.
17. కలువరేకుల్లా ఉన్న కన్నుదోయి సన్నిధినే ఉంటూ స్తుతించే అలంకారద్రవ్యం
18. మాసాలూ మీసాలు అన్న భేదం లేనే లేదు.
19. కనుకాలేదు;......ఉంది ఉంది కోపం వచ్చింది.
21. 20 అడ్డంతో ఇది కలిపి చదువుకుంటే కలిగే చింత దీనిలాగే పాకిపోతుంది.
22. ప్రబంధ నాయిక ధరించే ముత్యాలు.
23. శేషు నాగవంశంలో పసిబిడ్డ.
25. జోడు, పాదరక్ష కాదు.
26. యమునాతీరంలో వెతికితే పొదరిల్లు ఆ చూకీ కనబడుతుంది.
27. కొత్త తొమ్మిది.
28. ...తన శత్రువై ఎదురు తిరిగినది.
30. వంగిమంటే వంగం కాని 29 అడ్డంతో కలిపితే పరిమళద్రవ్యం.
31. వీరభద్రుడు డిందులోంచి పుట్టాడు. ★

24-వ గళ్ళనుడికట్టుకు జవాబులు





'తా' (పనగోం.)

శంసంగ ఒక ప్రేక్షకుడు మరి యొకనితో దాని అర్థమేమని అడిగెను. వెంటనే రెండవ ప్రేక్షకుడు మొదటిది తిననివాళ్ళకు రెండవది తినేవాళ్ళకు అని సమాధానమిచ్చెను.

ముత్తంశెట్టి బలరాం (ఒంగోలు)

* * *

పొట్టికథలు

క్లాసు డిబేటులో అనర్గళంగా వాదిస్తున్నాననుకుంటున్న ఓ కుట్టిశక్తి హాస్యాస్పదమైన సంఘటన చేస్తానంటూ, శ్రోతలకి వార్నింగు యిచ్చి మరీ ఒక విషయం చెప్పేడు. విషయంచెప్పడం అయిపోయింది. తనుమాత్రం నవ్వాపుకోలేక నవ్విపారేశాడు. ఒక్కసారి హాలంతా ఫకాలుమంది. నవ్వుకున్నది తనజోకు బాగుందుకే అనుకున్నాడు. ఇంతలో వెనకబెంచినించి "మళ్ళీ ఒక్కసారి నవ్వండి" అన్నారు ఎవరో. సీరైపోయాడు విషయంగారు.

ఎస్. శాంతారాం (విశాఖపట్నం)

* * *

కెమెరామేన్ (డైరెక్టర్‌తో): హీరోగారేరండి?

డైరెక్టర్ : కసరత్తు చేస్తున్నారు.

కెమెరామేన్ : ఎందుకు?

డైరెక్టర్ : హీరోగారు హీరోయిన్‌ను ఎత్తుకునే సన్నివేశాన్ని చిత్రీకరించబోతున్నాము. అందుకు కావలసిన బలమును సేకరించడానికి.

జి. కనకలింగేశ్వరరావు (ఎలమంచిలి)

* * *

సినిమా హాలులో 'అహింసా పరమోధర్మః' అని ఒక స్లైడు వేసి వెంటనే మరియొక స్లైడు 'మంచిరుచికరమైన మాంసపు భోజనము పెట్టబడును' అని

కొత్తగా యూనివర్సిటీలో చేరిన ఒక సుబ్బారావు తన క్లాసు అమ్మాయితో నిమ్మల్ని కలుసుకోవాలని అనుకుంటున్నాను కానండీ ఎప్పటికప్పుడే ఏదోపనివల్ల "మిస్" అయిపోతానండి.

నిర్మల : అలాగండీ సుబ్బారావుగారూ — మీరు "మిస్" అయితేనే నన్ను మరీ బాగా కలుసుకుందుమనీ చెయిండి.

ఎస్. శాంతారాం (విశాఖపట్నం)

* * *

పోలీసుఅధికారి(దొంగతో): నీవు ఆ ఇంటిలోనికి ఎందుకు జొరబడ్డావు.

దొంగ: అది నా ఇల్లే అనుకున్నానండీ.

అధికారి: అయితే ఆ ఇంటావిడ వస్తే ఎందుకు పారిపోతున్నావు.

దొంగ : నా భార్య అనుకున్నానండీ.

అధికారి: అయితే పట్టుబడ్డ తరవాత తప్పించుకొని పారిపోతున్నావు ఎందుకు.

దొంగ: అది నా సహజగుణమండీ.

డి. రామవరలింగరావు (చక్రధరపూర్)

Printed and Published for NageswaraRao Estates Private Ltd, by S Radha Krishna at The Andhra Patrika Press 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad

Regd No. M. 4479 Andhra Patrika Illustrated Weekly.

మీరు టూత్ పేస్ట్ లేక

టూత్ పౌడర్, ఏది వాడినా

పళ్లను శుభ్రపరచేది టెక్

టెక్ టూత్ బ్రష్‌కు మాత్రమే యీ క్రింది ప్రత్యేక అంశములు కలవు:

- ఎంచుకొందుకు వీలుగా రెండు ఆకారములు — 'ఓవల్' మరియు 'షార్ట్ ఓవల్'
- సౌమ్యమైన 'కిటన్' కుచ్చులు
- ఆరు వివిధ ప్లాస్టిక్ రంగులలో స్ఫటికముపంటి 'మిరేకల్ గ్రిప్' హేండిలు



జాన్సన్ అండ్ జాన్సన్ ఆఫ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్